అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 18-2-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 48 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50

అదానీ దొంగచాటు దందా..!




న్యూఢిల్లీ : అదానీ నౌకాశ్రయాల్లో ఎలాంటి ఒప్పందాలు లేకుండానే దిగుమతుల వ్యవహారాలు చోటు చేసుకుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడి మేరకు ఎలాంటి టెండర్ లేకుండానే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) గంగవరం పోర్టు ద్వారా దిగుమతులు చేసుకోవడమే ఇందుకు నిదర్శనం. టెండర్ ప్రక్రియ లేకుండానే ఈ వ్యవహారం జరుగుతుందని తృణముల్ కాంగ్రెస్ ఎంపీ మహు మొయిత్రా ఆరోపించారు. ఎలాంటి సిగ్గు లేకుండా అదానీ కంపెనీలు ఇలాంటి దొంగ చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. "టెండర్ లేదు, సీవీసీ విధివిధానాలు లేవు, వైజాగ్ పోర్టు నుంచి గంగవరం పోర్టుకు వ్యాపారాలను తరలిస్తున్నారు." అని చమురు శాఖ మంత్రి హర్దీప్ ...2లో

ఉపాధి హామీపై
మరో కత్తిపోటు

ఆధార్ ఆధారిత చెల్లింపులకు కేంద్రం ఉత్తర్వు

- 57శాతం మందికి పని నిరాకరణ





న్యూఢిల్లీ : ఉపాధి హామీ పథకంపై కేంద్ర ప్రభుత్వం మరో కత్తిపోటు పొడిచింది. ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు మోడీ ప్రభుత్వం ఇప్పటికే డిజిటల్ హాజరును తప్పనిసరి చేసింది. అలాగే ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీకి కేటాయిపులను రూ.30 వేల కోట్లకు తగ్గించింది. ఇప్పుడు.. ఆధార్ ఆధారిత వేతన చెల్లింపులకు సిద్ధమైంది. దీంతో ప్రభుత్వ డేటా ప్రకారమే 57శాతం మంది కార్మికులు వేతనాలకు దూరమవుతారు.

నరేంద్ర మోడీ ప్రభుత్వం 100 రోజుల ఉద్యోగ పథకం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం కింద వేతనాల పంపిణీకి ఆధార్-రూటెడ్ చెల్లింపు వ్యవస్థను తప్పనిసరి చేసింది. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ జనవరి 30న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖ రాస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 'రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో (యూటీలు) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) ప్రభావవంతంగా అమలు చేయబడుతుందని మీకు తెలుసు. కాబట్టి, ఈ పథకం కింద లబ్దిదారులకు అన్ని చెల్లింపులు ఏబీపీఎస్ ద్వారా మాత్రమే చేయాలి. ఇవి తప్పనిసరిగా అమలుచేయాలి. ఈ విషయంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ క్రమం తప్పకుండా అవగాహన కల్పిస్తోంది' అని మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ధరంవీర్ ఝా లేఖలో పేర్కొన్నారు. ఈ నిర్ణయం 2023 ఫిబ్రవరి 1 నుంచి అమలులోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కార్మికులు తమ ఖాతాను తమ ఆధార్ నంబర్‌తో లింక్ చేయమని వారి బ్యాంకులను అభ్యర్థించాలి. కేవైసీ వివరాలను సమర్పించిన తరువాత ఖాతాను నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ఈ ప్రక్రియలో ఖాతాదారుని బయోమెట్రిక్ ప్రమాణీకరణ కూడా ఉంటుంది. 43శాతం మంది కార్మికులకు ...5లో

ఉపాధి హామీ నిర్వీర్యం : బి.వెంకట్




ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఏ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నదని ఏఐఏడబ్ల్యుయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. అందులో భాగంగా బడ్జెట్ కేటాయింపుల కోత, ఆన్‌లైన్ హాజరు తప్పనిసరి వంటి చర్యలకు పాల్పడుతున్నదని తెలిపారు. ఇప్పుడు ఏకంగా కార్మికులను పనికి దూరం చేసేందుకు ఆధార్ ఆధారిత చెల్లింపులను తప్పనిసరి చేసిందన్నారు. ఉపాధి హామీ కోసం 2023-24 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.60,000 కోట్లు కేటాయించిందనీ, ఇది 2022-23లో సవరించిన కేటాయింపుల కంటే రూ.30,000 కోట్లు తక్కువగా ఉందని తెలిపారు.

మీ పేర్లు చేర్చం..

కేంద్రానికి సుప్రీం షాక్

హిండెన్‌బర్గ్-అదానీ వివాదంలో సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు

- కమిటీలో కేంద్రం సూచించిన నిపుణుల పేర్లను చేర్చేందుకు నిరాకరణ
- మేమే నిపుణులను ఎంపిక చేస్తాం
- మొత్తం ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తాం
- కమిటీ పట్ల ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండాలి : న్యాయస్థానం స్పష్టీకరణ



"నిపుణుల పేర్లను మేం ప్రభుత్వం నుంచి స్వీకరిస్తే, అది ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ అవుతుంది. కమిటీ పట్ల ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండాలి. హిండెన్‌బర్గ్-అదానీ వివాదంపై దర్యాప్తు జరిపేందుకు సిట్టింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిని నియమించం. రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేస్తాం" - సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : అదానీ గ్రూప్ - హిండెన్‌బర్గ్ నివేదిక వివాదాన్ని పరిశీలించేందుకు ఏర్పాటుచేసే కమిటీ విషయంలో కేంద్రానికి సుప్రీంకోర్టు షాకిచ్చింది. కేంద్ర ప్రభుత్వం సీల్డ్ కవర్లో సూచించే నిపుణుల పేర్లను చేర్చేందుకు అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం నిరాకరించింది. న్యాయవాదులు మనోహర్ లాల్ శర్మ, విశాల్ తివారీ, కాంగ్రెస్ నేత జయా ఠాకూర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ జెబి పార్దివాలా నేతృత్వంలోని ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. తామే స్వయంగా నిపుణులను ఎంపిక చేస్తామనీ, మొత్తం ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని ధర్మాసనం తెలిపింది.

నిపుణుల పేర్లను తాము ప్రభుత్వం నుంచి స్వీకరిస్తే, అది ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ అవుతుందని సుప్రీంకోర్టు తెలిపింది. కమిటీ పట్ల ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండాలని పేర్కొంది. హిండెన్‌బర్గ్-అదానీ వివాదంపై దర్యాప్తు జరిపేందుకు సిట్టింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిని నియమించబోమని స్పష్టం చేసింది. అయితే రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని వివరించింది.

అయితే కేంద్ర ప్రభుత్వం అంతకుముందు వినిపించిన వాదనల్లో, మన దేశంలోని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) వంటి చట్టబద్ధ వ్యవస్థలకు సంపూర్ణ సమర్థత ఉందనీ, ఇవి తమ పని తాము చేస్తున్నాయని తెలిపింది. ఇటువంటి పరిస్థితుల్లో మన దేశంలోని నియంత్రణ వ్యవస్థలకు ఓ పర్యవేక్షక కమిటీ ఉండాలనే ఉద్దేశపూర్వకం కానటువంటి సందేశం పెట్టుబడిదారులకు వెళ్లడం వల్ల విదేశీ నిధుల రాకపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. నిపుణుల కమిటీకి సంబంధించిన అన్ని వివరాలను, అంటే, నిపుణుల పేర్లు, కమిటీ పరిధి వంటి వివరాలన్నిటినీ సీల్డ్ కవర్లో అందజేస్తామని అత్యున్నత న్యాయస్థానానికి తెలిపింది. సెబి దాఖలు చేసిన అఫిడవిట్‌లో, షార్ట్ సెల్లింగ్‌ను లేదా బారోవ్డ్ షేర్స్ అమ్మకాన్ని నిషేధించడానికి తాము అనుకూలం కాదని పేర్కొంది. అదానీ గ్రూప్‌పై ఓ చిన్న షార్ట్ సెల్లర్ చేసిన ఆరోపణలపైనా, దాని షేర్ల ధరల ...5లో

మోడీ నోరు విప్పాలి

- విదేశీ ఇన్వెస్టర్లకు ప్రధాని సమాధానం చెప్పాలి: బిలియనీర్ జార్జ్ సోరస్



న్యూఢిల్లీ: విదేశీ పెట్టుబడిదారులకు ప్రధాని మోడి సమాధానం చెప్పాలని అమెరికాకు చెందిన బిలియనీర్ జార్జ్ సోరస్ డిమాండ్ చేశారు. ఇటీవల మ్యూనిచ్‌లో జరిగిన సెక్యూరిటీ కాన్ఫరెన్స్‌లో ...5లో

కేసీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ

పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రపతి, ప్రధాని, విజయన్ సహా పలువురు సీఎంల విషెస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి స్వయంగా సీఎంతో ఫోన్లో మాట్లాడారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేరళ సీఎం పినరయి విజయన్, ఢిల్లీ, పంజాబ్, తమిళనాడు, ఏపీ, అస్సాం ముఖ్యమంత్రులు కేజ్రీవాల్, భగవంత్‌సింగ్ మాన్, స్టాలిన్, వైఎస్ జగన్, హిమంత బిశ్వశర్మ, మాజీ ప్రధాని దేవెగౌడ, కేంద్ర మాజీ మంత్రి, సినీ నటుడు చిరంజీవి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు



తెలిపారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలంటూ వారు ఆకాంక్షించారు. కేసీఆర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన వారిలో కర్నాటక, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎంలు కుమారస్వామి, అఖిలేశ్ యాదవ్, ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, హైదరాబాద్‌లో భారత డిప్యూటీ హై కమిషనర్ ...5లో



గోరక్షకుల దాష్టీకం

ఇద్దరు ముస్లింల అపహరణ..హత్య

- హర్యానాలో కాలిపోయిన కారులో శవాలు లభ్యం
- నిందితులు బజరంగ్ దళ్ సభ్యులు
- ఘటనను ఖండించిన రాజస్థాన్ సీఎం

జైపూర్ : గోరక్షకులు దారుణానికి తెగబడ్డారు. రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు ముస్లింలను అపహరించారు. ఆ తర్వాతి రోజు ఆ ఇద్దరు హర్యానాలోని ఒక కారులో శవాలుగా కనిపించారు. ఇది బజరంగ్‌దళ్‌కు చెందినవారి పనేనని మృతుల కుటుంబసభ్యులు ఆరోపించారు. పోలీసులు ఈ ఘటనకు సంబంధించి 12 మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ ఈ దారుణ ఘటనను ఖండించారు.

పోలీసులు, మృతుల కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతులు ఇద్దరు నజీర్ (25), జునైద్ అలియాస్ జునా (35) లు రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లా ఘట్మీకా గ్రామానికి చెందినవారు. బుధవారం కొందరు దుండగులు వచ్చి నజీర్, జునాలను ఎత్తుకెళ్లిపోయారు. ఆ తర్వాతి రోజు గురువారం ఉదయం ఆ ఇద్దరు హర్యానాలోని లోహరులో ఒక కారులో శవాలుగా కనిపించారు. ఆ కారు కాలిపోయిన స్థితిలో ఉండటం గమనార్హం. ఈ ఘటనపై మృతుల కుటుంబాలు ...5లో

ఆప్‌కు భారీ విజయం

నామినేటెడ్ సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనడానికి వీల్లేదని సుప్రీం తీర్పు



న్యూఢిల్లీ : ఎన్నికల్లో గెలిచి కూడా మేయర్ ఎన్నికకు ఆటంకాలు ఎదుర్కొంటున్న తరుణంలో.. ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ విజయం దక్కింది. నామినేటెడ్ సభ్యులు ఓటింగ్‌లో పాల్గనడానికి వీల్లేదని సుప్రీం కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. ఢిల్లీ చరిత్రలోనే మేయర్ ఎన్నిక ఆలస్యం కావడం ఇదే తొలిసారి. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక.. ఫలితాలు వెలువడిన నెలలోపే అదీ తొలి సెషన్‌లోనే జరిగిపోవాలి. అది జరుగుతూ వస్తోంది కూడా. కానీ, ఈసారి ఆ ఆనవాయితీకి బ్రేక్ పడినట్లయ్యింది. ఫలితాలు వెలువడి రెండు నెలలు గడుస్తున్నా ఇంకా మేయర్ ఎన్నికపై సస్పెన్స్ కొనసాగుతోంది. జనవరి 6, జనవరి 24వ ...2లో

బాన్సువాడ ఎంసీహెచ్‌కు
జాతీయ గుర్తింపు

బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ అక్రిడిటేషన్ ప్రకటించిన బీఎఫ్‌హెచ్ఐ

- దేశంలోనే మొదటి ప్రభుత్వాస్పత్రిగా ఘనత
- సిబ్బందికి మంత్రి హరీశ్‌రావు అభినందనలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి (ఎంసీహెచ్) జాతీయ గుర్తింపు దక్కింది. తల్లి పాలను ప్రోత్సహించే "బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ హాస్పిటల్ ఇన్షియేటివ్ (బీఎఫ్‌హెచ్ఐ)" అందించే "బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ అక్రిడేషన్ (గ్రేడ్-1)" లభించింది. తద్వారా దేశంలోనే ఈ ఘనత సాధించిన ...5లో

మొక్కలు నాటిన హరీశ్‌రావు

సీఎం పుట్టినరోజు సందర్భంగా..



వివరాలు 5లో..

కేంద్రమంత్రుల్లో కిషన్‌రెడ్డి ఆణిముత్యం.. కేటీఆర్ ఎద్దేవా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అబద్ధాలనైనా ఎప్పుడూ ఒకేలా చెప్పేలా కేంద్ర మంత్రులకు శిక్షణ ఇవ్వాలని ప్రధాని మోడీకి రాష్ట్ర మంత్రి కేటీఆర్ హితవు పలికారు. తెలంగాణకు నూతన వైద్య కాలేజీల మంజూరు విషయంలో కేంద్ర మంత్రులు ...5లో



అచ్ఛేదిన్ కాదు..
అంధకారం

దోపిడీకి సహకరిస్తున్న మోడీ పాలన



మాట్లాడుతున్న కేరళ సీఎం పినరయి విజయన్ — కె.ఎన్ హరి

హౌరా బహిరంగసభలో కేరళ సీఎం పినరయి విజయన్

- పెద్ద ఎత్తున తరలి వచ్చిన వ్యవసాయ కార్మికులు

హౌరా నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

దేశంలో మోడీ పాలనలో అచ్చేదిన్ అని చెబుతున్నారనీ, కానీ అంధకారం నడుస్తున్నదని కేరళ సీఎం పినరయి విజయన్ తెలిపారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం 10వ మహాసభల సందర్భంగా హౌరాలోని బిజయోనంద పార్కు(సమర్ ముఖర్జీవేదిక)లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అంతకుముందు హౌరా మైదాన్‌లోని శరత్‌సదన్ నుంచి బిజయోనంద పార్కు వరకు భారీ ప్రదర్శన జరిగింది. దీనికి బెంగాల్‌లోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వ్యవసాయ కార్మికులు తరలి వచ్చారు. రెండు కిలోమీటర్ల దూరం సాగిన ప్రదర్శనకు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. అనంతరం ఆహ్వాన సంఘం నాయకులు, బెంగాల్ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి అమియపాత్రో అధ్యక్షతన జరిగిన సభలో విజయన్ మాట్లాడారు.

అపురూప వ్యక్తులకు జన్మనిచ్చిన బెంగాల్

మోడీ అంధకార పాలన ఫలితంగా పేదల సంఖ్య అంతకంతకూ పెరుగుతున్నదని చెప్పారు. స్వామి వివేకానంద, రవీంద్రనాథ్‌ఠాగూర్, ఎంఎన్‌రాయ్, ప్రమోద్‌దాస్ గుప్తా, జ్యోతిబసు వంటి అపురూప వ్యక్తులకు జన్మనిచ్చిన బెంగాల్ దేశానికి గర్వకారణమని తెలిపారు. బెంగాల్ ప్రజాపోరాటాలకు ఎంతో గుర్తింపు ఉన్నదనీ, అనేక పోరాటాల్లో వ్యవసాయ కార్మికులు, పేదలు, వృత్తిదారులు ఎంతో మంది పాల్గొన్నారని వివరించారు. రైతాంగ ఉద్యమం ఉధృతంగా సాగిందనీ, ఎంతోమందిని జైలుపాలు చేశారనీ, అయినా వెనుదిరగని పోరాటం సాగిందని వివరించారు. 20 శతాబ్దంలో అక్టోబరు విప్లవం తర్వాత సోషలిస్టు ఆలోచనలు ప్రవేశించడంతో బెంగాల్లో వ్యవస్థీకృత రైతు ఉద్యమం ప్రారంభమైందని ...5లో

కష్టాల్లో హాకా

రూ.60 కోట్లమేర ప్రభుత్వ మొండి బకాయిలు

- సబ్సిడీకి మంగళం
- విత్తనాల సరఫరాకు స్వస్తి
- నిర్వీర్యమవుతున్న హాకా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించే ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ అసోసియేషన్ (హాకా) ఆర్థిక వనరులు లేక ఇబ్బందులు పడుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో విత్తన సరఫరాలో కీలకంగా వ్యవహరించిన ఈ సంస్థకు...ప్రస్తుతం ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. ఆర్థిక వనరులు లేకపోవడం, నిధులు సమీకరణకు సర్కారు సహకారం అందకపోవడంతో అది ఉన్నా లేనట్టుగానే ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు పథకం అమలు చేస్తున్న నేపథ్యంలోవిత్తన సబ్సిడీకి స్వస్తి పలికింది. దీంతో ఆ సంస్థ కష్టాల ఊబిలోకి కూరుకుపోయింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండేండ్లపాటు రైతులకు విత్తనాలు సరఫరా చేసినందుకుగానూ సర్కారు హాకాకు రూ 60 కోట్లు బకాయిలు పడింది. ఆరేండ్లు గడుస్తు న్నా...ఇప్పటికీ ఆ నిధులు విడుదల చేయడం లేదు. అనేక సార్లు ప్రభుత్వా నికి మొరపెట్టుకున్న ప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది.

నాడు పోచారం...నేడు సింగిరెడ్డి

నాటి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పట్టించుకోలేదు. ఆ తర్వాత బాధ్యతలు చేపట్టిన సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కూడా ఆ సంస్థకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు ఎలాంటి ప్రయత్నం చేయడం లేదనే విమర్శలొస్తున్నాయి. వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషన ర్లు ఎవరొచ్చినా హాకాను గాలికొదిలేశారు. కొత్త రాష్ట్రం లో కనీసం చైర్మెన్‌ను కూడా నియమించలేదు. ఎనిమిదేండ్ల తర్వాత ఎట్టకేలకు మొన్న ఫిబ్రవరి 15న కొత్తగా చైర్మెన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమిం చింది. సన్న చిన్నకారు రైతులకు సరసమైన ధరలకు విత్తనాలు సరఫరా చేసే హాకాను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అది నేడు నిర్వీర్యమవుతున్నది. క్రమక్రమంగా తన ప్రాధాన్యతను కోల్పోతు న్నది. ఒకప్పుడు రైతులకు మేలురకం విత్తనాలు అందజేసిన సంస్థ ఇప్పు డు కార్యకలాపాలు లేక కూనారిల్లుతు న్నది. ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ నిధులు విడుదల కాకపోవడం తో సంస్థ మనుగడే ప్రశ్నా ర్థకంగా మారింది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లోనూ ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన కొత్తలోనూ కర్ణాటక, మహా రాష్ట్ర తదితర రాష్ట్రాల్లో విత్తనాల అమ్మకాలను సాగించింది. చివర కు దీపావళి పండుగకు టపాసుల వ్యాపారం చేసింది. అయినప్పటికీ సంస్థల కష్టాల నుంచి గట్టెక్కలేదు.

పాల సరఫరాకే పరిమితం

అన్నదాతలకు నాణ్యమైన విత్తనా లను అందించాల్సిన సంస్థ ఇప్పుడు కేవలం అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు సరఫరా చేసే సంస్థగా మారింది. వివిధ ఏజెన్సీల ద్వారా నాణ్యమైన పాలు సేకరించి అంగన్‌వాడీ కేంద్రా ల్లోని పిల్లలకు అందిస్తున్నది. దీంతో పాటు కందిపప్పు కూడా సరఫరా చేస్తున్నది. ఐదేండ్ల క్రితం వరకు రైతులకు అపరాలు, పెసర్లు, మినుములు వంటి పప్పు ధాన్యాలు, సజ్జలు, రాగులు వంటి చిరుధాన్యాలకు సంబంధించిన విత్తనాలు సబ్సిడీపై ప్రతి మండల కేంద్రంలో అందు బాటులో ఉంచేది. మూడేండ్లుగా ప్రభుత్వం సబ్సిడీకి మంగళం పాడటంతో సంస్థ కూడా ఏమీ చేయ లేక చేతులెత్తేసింది. వ్యాపార కార్యకలా పాలు తగ్గిపోయిన నేపథ్యంలో ఉద్యోగుల జీతభత్యాలను చెల్లించడం కూడా కష్టంగా మారింది. ఈ పరిస్థితు ల్లో పెండింగ్ పడిన ఆ సబ్సిడీ మొత్తాన్ని విడుదల చేయడంతోపాటు రాయితీపై విత్తనాలు అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని ఉన్నతాధికారులు కోరుతున్నారు.

కొత్త చైర్మెన్‌కు సవాళ్లు

ఇటీవల హాకా చైర్మెన్‌గా నూతనంగా నియమితులైన మచ్చా శ్రీనివాసరావు పలు సవాళ్లు ఎదుర్కోనున్నారు. సంస్థకు పూర్వవైభవం తీసు కొచ్చేందుకు ఇప్పటికే కీలక సమావేశం నిర్వహించి నట్టు తెలిసింది. వ్యాపార కార్య కలాపాలను విస్తరించేం దుకు ఉన్న అవకాశాలను అందిపుచ్చు కునేందుకు సంప్రదింపులు జరుపుతు న్నట్టు సమాచారం. రైతులకు విత్తనా లు అందించడం తోపాటు వ్యవసాయ రంగంలో తన సేవలను కొనసాగిం చేందుకు ఏం చర్యలు తీసుకుంటే బాగుంటుందో ఆయా రంగాల నిపుణులతో చర్చిస్తున్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించి ఇవ్వాల్సి న బకాయిలను ఇస్తే సంస్థ నిలబడుతుంది. రైతుకు చేయూతనిస్తుంది.

'ఆప్'కు భారీ విజయం

(మొదటిపేజీ తరువాయి)

తేదీల్లో, ఫిబ్రవరి 6వ తేదీల్లో సభ్యుల ఆందోళన వల్ల నెలకొన్న గందరగోళం నేపథ్యంలో మూడుసార్లు మేయర్ ఎన్నిక వాయిదా పడింది.ఈ తరుణంలో మూడుసార్లు మేయర్ ఎన్నిక వాయిదా పడగా.. ఆప్ సుప్రీంను ఆశ్రయించింది. ఆప్ వాదనలతో ఏకీభవించిన సుప్రీం కోర్టు.. నామినేటెడ్ సభ్యులకు ఓటింగ్‌లో పాల్గనే అర్హత లేదని స్పష్టం చేసింది. అంతేకాదు 24 గంటల్లో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికపై నోటిఫికేషన్ ఇవ్వాలని.. ఎన్నిక నిర్వహణ తేదీని కూడా స్పష్టంగా ప్రకటిం చాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. దీంతో ఢిల్లీ మేయర్ ఎన్నికపై ప్రతిష్టం భన తొలిగిపోయే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు సుప్రీం తీర్పుపై ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ హర్షం వ్యక్తం చేశారు.లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా నామినేట్ చేసిన పది మంది కౌన్సిలర్లను.. మేయర్ కోసం జరిగే ఓటింగ్‌కు ప్రిసైడింగ్ ఆఫీసర్ సత్య శర్మ(బీజేపీ) అనుమతించారు.

ఈ తరుణంలో వాళ్లంతా బీజేపీకే ఓటేస్తారని, సత్యశర్మ బీజేపీ గనుక సొంత పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తు న్నారని ఆప్ మొదటి నుంచి వాదిస్తోంది. పైగా ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(డీఎంసీ) యాక్ట్ 1957 ప్రకారం.. నామి నేటెడ్ సభ్యులు ఓటింగ్ లో పాల్గొనేందుకు అర్హత లేదని గుర్తు చేసింది. ఢిల్లీ మేయర్‌ను ఎన్నికల్లో నెగ్గిన మున్సిపల్ కౌన్సిలర్లు, ఢిల్లీ పరిధిలోని ఏడుగురు లోక్‌సభ ఎంపీలు, ముగ్గురు రాజ్యసభ ఎంపీలు, వీళ్లతో పాటు ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేసే 14 మంది ఎమ్మెల్యేలు ఎన్నుకుంటారు.

అదానీ దొంగచాటు దందా..!

(మొదటిపేజీ తరువాయి)

సింగ్ పూరి, సీవీసీకి మొయిత్రా ట్వీట్ చేసింది. కాగా.. గంగవరం పోర్టును ఎల్పీజీ దిగుమతుల కోసం అద్దెకు తీసుకునేందుకు సంబంధించి ఎలాంటి ఒప్పందం చేసుకోలేదని ఐఓసీ కూడా స్పష్టతను ఇవ్వడం గమ నార్హం. నాన్ బైడింగ్ ఎంఓయూపై సంతకం చేయడం ద్వారా సౌకర్యాలను ఉపయోగిం చుకుంటున్నట్టు పేర్కొంది.

అయితే దీని కోసం ఎటు వంటి టెండర్లు మాత్రం పిలవలేదని స్పష్టతనిచ్చింది. ఏడాదికి ఐదు లక్షల టన్ను ల సామర్థ్యం కోసం చెల్లింపులు చేయడానికి సిద్ధ పడింది. అది తక్కువ పరిమాణంలో ఉన్నా.. ఆ మొత్తానికి చెల్లింపులు చేయాల్సి ఉండటం గమనార్హం. ఐఓసీ ప్రస్తుతం ఏడాదికి దాదాపు 7-8 లక్షల టన్నుల ఎల్పీజిని దిగుమతి చేసుకోవడానికి వైజాగ్ పోర్టును ఉపయోగి స్తోంది. ఈ వ్యాపారాన్ని తెరచాటున క్రమంగా గంగవరం పోర్టుకు తరలించడం ద్వారా అదానీ పోర్టుకు లబ్ది చేకూర్చినట్ల వుతుందని నిపుణులు పేర్కొంటు న్నారు. కాగా అదానీ గ్రూపు నిర్వహిస్తున్న గంగవరం పోర్టు నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఐఓసీ దిగుమతులు చేపట్టడం అంటే అది అదానీకి లబ్ది చేకూర్చడమేనని కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ జైరాం రమేశ్ పేర్కొన్నారు.

VBC FERRO ALLOYS LIMITED

Regd office : 6-2-913/914, 3rd Floor, Progressive Towers, Khairatabad, Hyderabad-500 004.
CIN:L27101TG1981PLC003223 Website: www.vbcfal.in E-mail:vbcfalhyd@gmail.com

31 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కొరకు ఆడిట్‌చేసిన ఆర్థిక ఫలితాల సారాంశం

(రూ.లక్షల్లో ఇపిఎస్ కొరకు మినహా)

క్ర. సం	వివరాలు	ముగిసిన త్రైమాసికం 31.12.2022 (Unaudited)	30.09.2022 (Unaudited)	31.12.2021 (Unaudited)	ముగిసిన తొమ్మిది నెలలు 31.12.2022 (Unaudited)	31.12.2021 (Unaudited)	ముగిసిన సం॥ 31.03.2022 (Audited)
1.	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం (నికర)	3,743.57	3,597.89	1,352.19	12,912.46	1,394.92	9,246.87
2.	కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల &/ లేదా అసాధారణ ఐటంలకు ముందు)	-585.12	14.64	36.38	-124.52	-276.01	22.54
3.	పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల &/ లేదా అసాధారణ ఐటంల తరువాత)	-585.12	14.64	36.38	-124.52	-276.01	22.54
4.	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల &/ లేదా అసాధారణ ఐటంల తరువాత)	-531.64	12.20	36.38	-147.92	-276.01	19.02
5.	కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం) (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	-531.64	12.20	36.38	-147.92	-276.01	19.02
6.	చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం	1639.50	1639.50	1639.50	1639.50	1639.50	1639.50
7.	రిజర్వులు(రీవాల్యూయేషన్ రిజర్వ్ మినహాయించి)	-3,383.82	-2,852.17	-3,682.82	-3,383.82	-3,682.82	-3,235.89
8.	నికర విలువ	-1,744.32	-1,212.67	-2,043.32	-1,744.32	-2,043.32	-1,596.39
9.	డెట్ ఈక్విటీ నిష్పత్తి	NA	NA	NA	NA	NA	NA
10.	వాటా యొక్క రాబడులు(రూ. 10/- చొప్పున) (కొనసాగుతున్న మరియు నిలిచిపోయిన ఆపరేషన్లు)						
	1) బేసిక్	-3.24	0.07	0.22	-0.90	-1.68	0.12
	2) డైల్యూటెడ్	-3.24	0.07	0.22	-0.90	-1.68	0.12
11.	డెట్ సర్వీస్ కవరేజ్ నిష్పత్తి	NA	NA	NA	NA	NA	NA
12.	ఇంటరెస్ట్ సర్వీస్ కవరేజ్ నిష్పత్తి	NA	NA	NA	NA	NA	NA

ముఖ్యాంశాలు:
1. సెబి (లిస్టింగ్ అండ్ అదర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్)రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 33 ప్రకారం పైన పేర్కొన్న త్రైమాసికం మరియు అర్థ వార్షికానికి సంబంధించిన ఆర్థిక ఫలితాలు స్టాక్ ఎక్స్ఛేంజెస్ వద్ద దాఖలు చేయబడినవి. దీనికి సంబంధించిన పూర్తి ఫార్మాట్ త్రైమాసికానికి సంబంధించిన ఆర్థిక ఫలితాలు స్టాక్ ఎక్స్ఛేంజ్ యొక్క వెబ్‌సైట్‌లో పాటుగా కంపెనీ యొక్క వెబ్‌సైట్ www.vbcfal.inవద్ద కూడా అందుబాటులో ఉంటాయి.
2. పైన పేర్కొన్న స్టాండ్‌అలోన్ ఆర్థిక ఫలితాలు ఆడిట్ కమిటీ ద్వారా రివ్యూ చేయబడినవి మరియు కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్ల తేది: 14-02-2023 నిర్వహించిన వారి యొక్క సమీక్షా సమావేశంలో ఆమోదించబడినవి.

బోర్డు వారి ఆదేశానుసారం
For VBC Ferro Alloys Limited
సం/- (ఎం.వి.అనంత కృష్ణ)
పూర్తి స్థాయి డైరెక్టర్
DIN : 00897536

ప్రదేశం: హైదరాబాద్
తేది:14-02-2023

భూమి, కనీసవేతనాల కోసం పోరు

సాంబశివ, తెలంగాణ ప్రతినిధి


మాట్లాడుతున్న సాంబశివ

పేదలకు భూమి, కనీస వేతనాల కోసం విస్తృత పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలంగాణ ప్రతినిధి సాంబశివ తెలిపారు. మహాసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికుల పరిస్థితి మరీ దయనీయంగా మారిందని అన్నారు. దీనిపై నిర్వహించిన పోరాటాల ఫలితంగా అనేక అనుభవాలు, విజయాలు వచ్చాయని చెప్పారు. వరంగల్ లాంటిచోట్ల నిర్వహించిన భూపోరాటం మంచి అనుభవమని అన్నారు. సేవా కార్యక్రమాల్లోనూ తెలంగాణలో వ్యవసాయ కార్మిక సంఘం కీలకపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలపై నిరంతరం కార్యాచరణతోపాటు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్నామని వివరించారు.

మహిళా కార్మికులకు సమగ్రచట్టం

మహాసభలో ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి శివనాగరాణీ



మహిళా వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం అందడం లేదని, వారికోసం సమగ్రచట్టం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి వి.శివనాగరాణి తెలిపారు. హౌరాలో జరుగుతున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం 10వ మహాసభలో రాష్ట్రాల ప్రతినిధుల చర్చల సమయంలో ఉదయం పలు రాష్ట్రాల ప్రతినిధులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నుండి శివనాగరాణి మాట్లాడుతూ మహిళలకు కనీస భద్రత లేదని, వేతనాలూ అందడం లేదని పేర్కొన్నారు. పనులు లేకపోవడంతో ఎక్కువమంది కార్మికులు వలసలు పోతున్నారని వివరించారు. ఈ క్రమంలో ప్రమాదాల బారినపడుతున్నారని,వారి పిల్లలూ చదువుకు దూరమవుతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో మహిళల కోసం కనీస వేతన చట్టం చేయాలని కోరారు. అప్పుడే వారికి న్యాయం జరుగుతుందని చెప్పారు. మహిళా వ్యవసాయ కార్మికుల కోసం ఆంధ్రప్రదేశ్‌లో కన్వీనింగ్ కమిటీ పనిచేస్తోందని పేర్కొన్నారు. నాలుగు జిల్లాల్లో ఇప్పటికే కమిటీలు వేశామని చెప్పారు.


హౌరాలో ప్రదర్శనగా....
క్లిక్: కె.ఎన్ హరి

కేంద్ర విధానాలపై సంయుక్త పోరు

ఆలిండియా కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్

- ఏఐఏడబ్ల్యూయూ మహాసభలో సౌహార్ధ సందేశం

హౌరా నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

వ్యవసాయ కార్మికులు లేకపోతే వ్యవసాయం లేదని తెలిపారు. నయా ఉదారవాద ఆర్థిక విధానాల ప్రభావం వ్యవసాయ కార్మికులపై ఎక్కువగా ఉన్నదనీ, వాటిని వేగంగా అమలు చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై సంయుక్తంగా పోరు నిర్వహించాలని ఆలిండియా కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ అన్నారు. హౌరాలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం 10వ మహాసభ సందర్భంవా ఆయన సౌహార్ధ సందేశం ఇచ్చారు. ఏఐకేఎస్‌కు వ్యవసాయ కార్మిక సంఘానికి సారూప్యత ఉందని తెలిపారు. మోగాలో 1954లో జరిగిన ఏఐకేఎస్ మహాసభ వ్యవసాయ కార్మికుల అంశంపై ప్రత్యేక తీర్మానం చేసిందని తెలిపారు. గత నాలుగు దశాబ్దాలుగా రెండు సంఘాలు సంయుక్తంగా పోరాడుతున్నాయని వివరించారు. ప్రపంచీకరణ విధానాల ప్రమాదాన్ని తొలిసారిగా ప్రజల్లోకి తీసుకెళ్లింది వ్యవసాయ కార్మిక సంఘం అన్నారు. ప్రపంచీకరణ విధానాల అమలుతో రైతులకు కనీస మద్దతు ధరల దొరకడం లేదని, ఉపాధి హామీ, ఆహార భద్రత, కనీసవేతనాలు లేకుండా పోతున్నాయని వివరించారు. మోడీ చెప్పే అచ్ఛేదిన్ రైతులకు, వ్యవసాయ కార్మికులకు కాదని అన్నారు. ప్రధాని మోడీ రైతుల పోరాటాన్ని పంజాబ్‌లో ఒక ప్రాంతానికి చెందినదని తక్కువ చేసి మాట్లాడారని కానీ దేశవ్యాప్తంగా విస్తరించి మోడీ నోరు మూయించిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జరిగిన ఈ ఉద్యమంలో వ్యవసాయ కార్మికులు కూడా కలిసి రావడం వల్లే ఉద్యమం తీవ్రమై కేంద్రం దిగిరావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు చెప్పిన దేశమంటే మట్టికాదోయ్ మనుషులోయ్ అని తెలుగు కవి చెప్పిన మాటను నిజం చేసి చూపించారని అన్నారు. మతోన్మాదులు, కార్పొరేట్లకు వ్యతిరేకంగా ఉద్యమానికి ఇది సరైన సమయమని వివరించారు. 2024లో దేశంలో మార్పు వస్తుందని, దీనిలో వ్యవసాయ కార్మికులు కీలక పాత్ర పోషించనున్నారని చెప్పడంలో ఏ మాత్రమూ సందేహం లేదని అన్నారు.


అభివాదం చేస్తున్న కేరళ సీఎం విజయన్



తెలంగాణ ప్రతినిధుల బృందం


బహిరంగ సభకు హాజరైన జనం


ఆటపాటలతో...

బెంగాల్ పోరాటం స్ఫూర్తిదాయకం

వారికి అండగా ఉంటాం
వ్యవసాయ కార్మిక మహాసభ తీర్మానం



బెంగాల్లో ప్రజాతంత్ర వాదులపైనా టీఎంసీ, బీజేపీ దాడులను తట్టుకుని ముందకు సాగుతున్న నాయకుల పోరాటం స్ఫూర్తిదాయమకమనీ, వారికి సంఘీభావం తెలపడంతోపాటు మద్దతుగా నిలవాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం 10వ మహాసభ నిర్ణయించింది. ఈ మేరకు తీర్మానాన్ని తమిళనాడు ప్రతినిధి ఎస్.చంద్రం ప్రవేశపెట్టగా ఇస్లాం అస్లాన్ బలపరిచారు. తృణమూల్ గూండాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్యకర్తలకు సంఘీభావం ప్రకటించారు. బెంగాల్లో ఉన్న ప్రజా ఉద్యమంపై జరుగుతున్నదాడులను అడ్డుకునే క్రమంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. వామపక్షాలను, ప్రజాతంత్ర వాదులను పూర్తిగా తొలగించాలనే ఉద్దేశంతో టీఎంసీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. దీనికోసం కేంద్రంలోని బీజేపీ, బెంగాల్లోని టీఎంసీ కలిసి ఐక్యంగా పనిచేశాయని వివరించారు. టీఎంసీ పాలనలో బెంగాల్ గ్రామీణ ప్రాంతంలో పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వంలో ఉన్న పెద్దలు బలవంతంగా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. పంటలకూ తగినంత ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం అవడంతో ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలూ తగ్గుతున్నాయని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని టీఎంసీ గూండాలు వారి ఆర్థికవనరుగా వాడుకుంటున్నారని, పెద్దఎత్తున అవినీతి జరుగుతోందని తీర్మానంలో పేర్కొన్నారు. టిఎంసి విధానాల వల్ల వ్యవసాయ కార్మికులు ఎక్కువగా నష్టపోయారని పేర్కొన్నారు. ఈ క్రమంలో టీఎంసీ కి వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటాలు సాగుతున్నాయని అన్నారు.

వారిని ఏకం చేసేందుకు కృషి జరుగుతోందని, వామపక్ష ఉద్యమం పునరుజ్జీవం కావడానికి వ్యవసాయ కార్మిక ఉద్యమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బెంగాల్లో వర్గ శక్తులను ఐక్యం చేయడానికి వ్యవసాయ కార్మిక ఉద్యమం కృషి చేయాలని ఈ మహాసభలో తీర్మానించారు.

తెలంగాణ

బీజేపీని గద్దె దించే లక్ష్యంతో పని చేస్తాం

అదాని కంపెనీలపై దాడులు లేవా?

- ప్రతిపక్ష నాయకులపై ఈడీ దాడులు దారుణం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ -నల్లగొండ



రానున్న ఎన్నికల్లో కలిసి వచ్చే శక్తులను సమీకరించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే లక్ష్యంతో పోరాటాలు ఉధృతం చేస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఐ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల సంస్థలపై, వ్యక్తుల పైన ఈడీ, సీబీఐ దాడులు జరుగుతున్నాయి తప్ప ప్రధానమంత్రి మోడీ అనుచరుడైన అదాని, అతని సంస్థలపై దాడులు లేవా అని ప్రశ్నించారు. దేశంలో రోజురోజుకూ బీజేపీ నియంతృత్వ విధానాలు పెరిగిపోతున్నాయని, అందులో భాగంగానే మీడియా సంస్థలపై దాడులు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ వ్యతిరేక శక్తులను ఏకం చేసి పోరాటాలకు సన్నద్ధమవుతామని తెలిపారు. అందులో భాగంగానే రాష్ట్రంలో బీఆర్ఎస్‌తో ఎన్నికల్లో పొత్తులు ఉంటాయన్నారు. ఇంతవరకు సీపీఐ(ఎం), బీఆర్ఎస్ మధ్య సీట్ల సర్దుబాట్లపై చర్చలు జరగలేదన్నారు. మీడియాలో వచ్చిన వార్తలు ఊహాజనితమన్నారు.

గత ఎన్నికల ముందు ప్రజలకు మోడీ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేరలేదని విమర్శించారు. దేశంలో మతతత్వ దాడులు పెరిగాయని, హత్యలు, లైంగికదాడులు జరుగుతున్నా మోడీ స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మార్చి 15 నుంచి 30 వరకు జాతా నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు.

రాష్ట్రంలో పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. 2022 వరకు దేశంలో ఇండ్లు లేని పేదవారు ఉండరని చెప్పిన ప్రధాన మంత్రి ఇప్పటివరకు ఎన్ని ఇండ్లు కట్టించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో బుల్లెట్ ట్రైన్ల విషయం అతీగతి లేదని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ సొరంగం, ఉదయ సముద్రం ప్రాజెక్టులకు ఎక్కువ నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సాగర్ ఎడమ కాలువ లిఫ్టుల పనులను పూర్తి చేసి వెంటనే ఆపరేటర్‌ను నియమించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, డబ్బికారు మల్లేష్, బండ శ్రీశైలం, సయ్యద్ హాశం, కందాల ప్రమీల, పట్టణ కార్యదర్శి సలీం తదితరులు పాల్గొన్నారు.

తంగిరాల చక్రవర్తికి డాక్టర్ సతీష్ చతుర్వేది స్మృతి పురస్కారం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలుగు కవి తంగిరాల చక్రవర్తి డాక్టర్ సతీష్ చతుర్వేది స్మృతి పురస్కారాన్ని అందుకున్నారు. అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ అఖిల భారత మహాసభను శుక్రవారం మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించారు. అక్కడి లయన్స్ క్లబ్ భవన్‌లో సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వీరేంద్రసింగ్ అధ్యక్షతన, సంస్థ కార్యదర్శి కృతి చతుర్వేది ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సభలో తెలంగాణ శాఖ అధ్యక్షులు కడాలి సత్యమూర్తి, మధ్యప్రదేశ్ రాష్ట్ర వైద్యవిద్యా పునరావాస మంత్రి విశ్వాస్ సారంగ్ చేతుల మీదుగా జాతీయ పురస్కారాలను ప్రదానం చేశారు.

వినూత్న ఫీచర్, స్మార్ట్‌కీతో నూతనయాక్టివా

మార్కెట్‌లోకి విడుదల చేసిన తెలంగాణ జోనల్ మేనేజర్ ఇస్మాయిల్‌ఖాన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భారతీయ ద్విచక్ర వాహన పరిశ్రమలో సరికొత్త చరిత్రను సృష్టిస్తూ స్కూటర్ విభాగంలో వెలుగొందుతున్న హెూండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) స్మార్టర్ అత్యాధునిక యాక్టివా 2023ను విడుదల చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లో హెచ్ఎంఎస్ఐ తెలంగాణ జోనల్ మేనేజర్ ఇస్మాయిల్‌ఖాన్, హైదరాబాద్ ఏరియా మేనేజర్లు సునీల్‌రెడ్డి పునీత్‌కుమార్ సీఎస్‌తో పాటుగా హెూండా డీలర్లు మార్కెట్‌లోకి దాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్‌ఖాన్ మాట్లాడుతూ..ఇది హెచ్ఎంఎస్ఐ యొక్క మొట్టమొదటి ఓడీబీ2 ప్రమాణాలు కలిగిన ద్విచక్ర వాహనం అని తెలిపారు. సాంకేతికత పరంగా ముందుండే హెచ్ఎంఎస్ఐ వినియోగదారులకు సౌకర్యం, సౌలభ్యాన్ని వారి రోజువారీ జీవితాలలో అందిస్తున్నదని తెలిపారు. ద్విచక్ర వాహన విభాగంలో మొట్టమొదటిసారిగా వినూత్నమైన ఫీచర్, స్మార్ట్ కీతో నూతనయాక్టివా ఉంటుందని చెప్పారు. ఈ వాహనం అన్ని హెూండా టచ్‌పాయింట్ల వద్ద వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

కృష్ణా నీటి లెక్కలు తేల్చండి

కేఆర్ఎంబీని కోరిన ఈఎన్సీ

- మార్చి మొదటివారంలో మళ్లీ భేటి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే ఈ సంవత్సరం కృష్ణా నీటిని వాటాకు మించి వాడుకున్నదనీ, ఆ లెక్కలను తేల్చాలని రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీని కోరింది. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన సమావేశంలో తెలంగాణ సాగునీటి, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి. మురళీధర్ మాట్లాడారు. ఈసందర్భంగా కృష్ణా నదీ నీటి లెక్కలకు సంబంధించి వివరంగా త్రిసభ్య కమిటికి వివరించారు. నీటి లెక్కలను తేల్చడం ద్వారా ఏ రాష్ట్రం ఎంత వాడుకున్నదీ, ఎవరి వాటా ఎంత మిగిలి ఉందో స్పష్టమవుతుందని చెప్పారు. కాగా ఈ సమావేశానికి ఏపీ ఇంజినీర్ ఇన్ చీఫ్ నారాయణరెడ్డి హాజరు కాలేదు. ఆ మేరకు ముందస్తు సమాచారం కేఆర్ఎంబీ అధికారులకు ఇచ్చారు. పోలవరం పర్యటన ఉన్న కారణంగా హాజరు కావడం లేదని బోర్డు సభ్యకార్యదర్శికి తెలిపారు.

దీంతో కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి రాయ్‌పురే, తెలంగాణ ఈఎన్సీ మురళీధర్ సమావేశమయ్యారు. ఈ ఏడాది ఏపీ ఇప్పటికే వాటాకు మించి కృష్ణా నీటిని వాడుకుందనీ, నీటిలెక్కల విషయంలో కఠినంగా ఉండాలని తెలంగాణ విజ్ఞప్తి చేసింది. తమకు 141 టీఎంసీలకు అవకాశం ఉందనీ, ఆమేరకు నీటిని వాడుకుంటామని తెలంగాణ ఈఎన్సీ మురళీధర్, సభ్యకార్యదర్శి రాయ్‌పురేకు తెలియజేశారు. వచ్చే నెలా మొదటివారంలో త్రిసభ్య కమిటీ మరోమారు సమావేశమయ్యే అవ కాశం ఉందన్నారు. అటు పూర్తిస్థాయి బోర్డు సమావేశాన్ని కూడా త్వరలోనే ఏర్పాటు చేయాలని తెలంగాణ కోరింది. కొత్త ఛైర్మెన్ వచ్చిన నేపథ్యంలో బోర్డు సమావేశం పెట్టాలన్న ఈఎన్సీ మురళీధర్, పూర్తిస్థాయి బోర్డు సమావేశంలో అన్ని అంశాలపై చర్చించడానికి వీలుంటుందని అభిప్రాయపడ్డారు.

గతం..

కృష్ణా ప్రాజెక్టు కింద అవసరాలకు అనుగుణంగా నీటిని పంపిణీ చేసేందుకు కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అయితే ఏపీ ఈఎన్సీ రాకపోవడంతో ఈ విషయమై పూర్తిస్థాయిలో చర్చించే అవకాశం లేకుండాపోయింది. డిసెంబరులో జరగాల్సిన ఈ సమావేశం పలు దఫాలుగా వాయిదా పడుతూ వస్తున్న సంగతి తెలిసిందే. ఉమ్మడి ప్రాజెక్టు నుంచి ఆయా రాష్ట్రాలకు ఏ మేరకు నీరు అవసరం ఉంటుందనే అంశాన్ని ఈ సమావేశంలో చర్చించి ఖరారు చేయాల్సి ఉంది. శ్రీశైలం ప్రాజెక్టులో గురువారం నాటికి 34 టీఎంసీలు అందుబాటులో ఉండగా, నీటిని తోడుకునే కనీసం మట్టం స్థాయి వరకు(ఎండీడీఎల్) 18 టీఎంసీల జలాలు నిల్వ ఉన్నట్టు అంచనా వేశారు. నాగార్జునసాగర్‌లో 90 టీఎంసీల లభ్యత ఉన్నట్టు భావిస్తున్నారు. ఈ నీటి సంవత్సరమైన మే 31 నాటికి రాష్ట్రాల అవసరాలను పరిగణనలోకి తీసుకోనున్నారు. ఇప్పటికే రాష్ట్రాల వాటా మేరకు వినియోగం పోను మిగిలిన నీటిని పంపిణీ చేయాల్సి ఉంది. ఆమేరకు వచ్చే బోర్డు త్రిసభ్య కమిటీ భేటిలో మరోమారు చర్చించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

21నుంచి ఎన్‌పీఆర్‌డీ ఆవిర్భావ వారోత్సవాలు

జిల్లా కేంద్రాల్లో జెండావిష్కరణలతో ప్రారంభం

- 28న రాష్ట్ర సదస్సు
- చట్టాలు, సంక్షేమ పథకాల అమలు కోసం ఉద్యమం : ఎన్‌పీఆర్‌డీ ప్రధాన కార్యదర్శి అడివయ్య



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈ నెల 21నుంచి ఎన్‌పీఆర్‌డీ అవిర్భావ వారోత్సవాలను నిర్వహించనున్నట్టు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, ఉపాధ్యక్షులు జెర్కొని రాజుతో కలిసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21న జిల్లా కేంద్రాల్లో జెండాల ఆవిష్కరణ, 28న హైదరాబాద్‌లో విద్యా, ఉపాధి, అంశాలపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. వికలాంగుల చట్టాలు సంక్షేమ పథకాల అమలు కోసం ఉద్యమాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. 2010 ఫిబ్రవరి 20-21తేదీల్లో ఆత్మగౌరవం, హక్కుల సాధన లక్ష్యాలతో సంఘం ఏర్పడిందని గుర్తుచేశారు.అవిర్భావ దినోత్సవాల సందర్భంగా సెమినార్లు, రక్తదాన శిబిరాలు, పండ్ల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్టు తెలిపారు. 13 ఏండ్లలో వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలు చేసి విజయాలు సాధించామన్నారు. 2016 ఆర్‌పీడీ చట్టం, యూనివర్సల్ గుర్తింపు కార్డులు, ఉపాధి హామీ చట్టంకింద 150 రోజుల పని, అంత్యోదయ రేషన్ కార్డులు మంజూరు తదితర అనేక సమస్యలపై పోరాటాలు నిర్వహించామని చెప్పారు. 2016 ఆర్‌పీడీ చట్టంలో సవరణలు చేయాలనీ, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ నియామకాల్లో వికలాంగులకు అవకాశాలు లేకుండా చేయాలని చూస్తే పోరాటాల ద్వారా వాటిని తిప్పి కొట్టామని గుర్తుచేశారు. రాష్ట్రంలో పెన్షన్ పెంపు కోసం పోరాడి సాధించుకున్నామన్నారు. వివాహ ప్రోత్సాహం పెంపు, మరగుజ్జులకు బస్ పాసులు, రుణాల సబ్సిడీ పెంపుకోసం ఉద్యమాలు చేసి విజయాలు సాధించామన్నారు. రాబోయే కాలంలో పింఛన్‌ను రూ.10 వేలకు పెంపు, ఉచిత విద్యుత్, ప్రయాణ సౌకర్యం, బ్యాక్ లాక్ పోస్టుల భర్తీ, నామినేటెడ్ పదవుల్లో రిజ్వేషన్ల అమలు, స్వయం ఉపాధి, రుణాల కోసం ఉద్యమాలు ఉధృతం చేస్తామని తెలిపారు.

రూ.800 కోట్ల వ్యాపారాన్ని చేరుతాం : వర్ధమాన్ బ్యాంక్ వెల్లడి



హైదరాబాద్ : వర్ధమాన్ (మహిళ) కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ తన 54వ జనరల్ బాడి సమావేశాన్ని నిర్వహించుకున్నట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశానికి హాజరైన డైరెక్టర్లు, సభ్యులకు ఆ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎడిఎన్‌వి ప్రసాద్ స్వాగతం పలికారు. దీనికి ఛైర్మన్ రితేష్ కుమార్ డాగ, ఇతర డైరెక్టర్లు నిర్మలా డాగ, రాజ్ కుమారి చౌర్దియా, తుషార్ సల్వా, మహేందర్ కుమార్ జైన్ గొలెచ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ వైస్ ఛైర్మన్ నిర్మల డాగ మాట్లాడుతూ.. 2023 మార్చి ముగింపు నాటికి పెట్టుకున్న రూ.800 కోట్ల వ్యాపార లక్ష్యాన్ని చేరనున్నామని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుత ఏడాది బ్యాంక్ మెరుగైన ప్రగతిని నమోదు చేస్తుందని ఛైర్మన్ రితేష్ కుమార్ పేర్కొన్నారు.

సంపాదకీయం

నిర్వీర్యం దిశగా... ప్రజాపంపిణీ వ్యవస్థ

దేశంలో కోట్లల్లో ఉన్న బీద బిక్కి జనానికి కాస్తంత ఆహార ఆసరా కల్పించే ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్)ను నిర్వీర్యం చేసి పేదల నోటికాడి ముద్ద లాగేసే కుట్రలకు కేంద్ర ప్రభుత్వం ఒడిగట్టడం దారుణం. పిడిఎస్‌కు అవసరమైన ఆహార సేకరణను ప్రయివేటీకరించేందుకు అడుగులు

> ప్రభుత్వ నయా-ఉదారవాద విధానాల వలన అంతరాలు పెరిగి పేదరికం తీవ్ర రూపం దాల్చుతోందని పలు గణాంకాలు చెబుతున్నాయి. ఈ తరుణంలో ఆహార సబ్సిడీ పెంచాల్సి ఉంది. సార్వజనీన పిడిఎస్ అవశ్యంగా మారింది. మోడీ సర్కారు కార్పొరేట్ల లాభాల కోసం పరితపించి పేదల కడుపు కాల్చడాన్ని ప్రజలు ప్రతిఘటించాలి.

వేస్తున్న మోడీ సర్కార్, పంపిణీని సైతం ప్రయివేటీకరించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. లక్ష్యం పిడిఎస్‌లోనూ కార్పొరేట్లను ప్రవేశపెట్టి లాభాలు దోచిపెట్టడం. మోడీ ప్రభుత్వ అంతరంగం మొన్న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఆవిష్కృతమైంది. ఆహార సబ్సిడీకి రూ.90 వేల కోట్లు కోత పెట్టడంతో ప్రభుత్వ కుతంత్రం ప్రజలకు బోధ పడింది. పిడిఎస్ వ్యయ నియంత్రణలు, ఉచిత ఆహార పథకం పరిధి కుదింపునకు నిటిఅయోగ్ చేసిన సిఫారసులకు అనుగుణంగానే బడ్జెట్‌లో కేంద్రం ఆ పద్దుకు కత్తెర వేసిందని 'ది రిపోర్టర్స్ కలెక్టివ్' ఆధారాలతో బట్టబయలు చేసింది. ఆహార భద్రతా కార్యక్రమాలకు, పిడిఎస్ అమలుకు నిటిఅయోగ్ వ్యతిరేకంగా ఉందని వెల్లడించింది. రిపోర్టులోని అంశాల ఆధారంగానే సుప్రీం కోర్టుకు కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ ఇవ్వగా, తోసిపుచ్చిన సర్వోన్నత న్యాయస్థానం, 2021 జనాభా ప్రాతిపదికన ఆహార భద్రతా చట్టాన్ని అమలు చేయాలంది. సుప్రీం సూచన అమలుకు బడ్జెట్‌లో నిధులు పెంచాల్సి ఉండగా తగ్గించడాన్నిబట్టి అత్యున్నత న్యాయస్థానం కంటే నిటిఅయోగ్ నివేదికనే మోడీ సర్కార్ గీటురాయిగా పరిగణించింది.



జాతీయ ఆహార భద్రతా చట్టం 2013లో యూపీఏ-2 హయాంలో వచ్చింది. కిలో రూ.3కు బియ్యం, రూ.2కు గోధుమలు పేదలకు ఒక్కొక్కరికి నెలకు ఐదు కిలోల వంతున అందించడం యాక్ట్ లక్ష్యం. చట్టానికి కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ గ్రామీణ ప్రజల్లో 75శాతం, పట్టణాల్లో 50శాతం చట్టం పరిధిలోకొచ్చారు. దాదాపు 81 కోట్లకుపైన ప్రజలు కాస్తయినా ఊరట పొందుతున్నారు. మోడీ ప్రభుత్వం వచ్చింది లగాయతు ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్‌ను పలచన చేసేందుకు కంకణం కట్టుకుంది. పేదలకు నేరుగా ఆహార ధాన్యాలను పంపిణీ చేయకుండా నగదు బదిలీ (డిబిటి) నినాదం ఎత్తుకుంది. ఆహార ధాన్యాలు పంపిణీ చేయకుండా ఇచ్చే సబ్సిడీని లెక్కకట్టి నగదు బదిలీ చేస్తే, బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరిగితే, ఆ ధరలకు ధాన్యాలను పేదలు కొనుక్కోలేక ఆహారానికి దూరమవుతారు. డిబిటి కోసం రాష్ట్రాలపై కేంద్రం ఒత్తిడి చేస్తోంది. ప్రజలు వ్యతిరేకిస్తుండటంతో మన రాష్ట్రం సహా చాలా చోట్ల అమలు తాత్కాలికంగా వాయిదా పడింది. పిడిఎస్‌ను కుదించే చర్యల్లో మరొకటి 'ఒకే దేశం-ఒకే రేషన్ కార్డు'. దీని లక్ష్యమూ వీలైన మేరకు కార్డులను, లబ్ధిదారులను కుదించి నిధులు మిగుల్చుకోవడం. పేదలందరికీ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ వర్తించట్లేదు. పేదరికం కొలబద్దలు అసంబద్ధంగా ఉన్నాయి. రాష్ట్రాలు తమ పరిధిలో రేషన్ కార్డులిస్తున్నాయి. వాటన్నింటికీ కేంద్రం సబ్సిడీపై ఆహార ధాన్యాలు సరఫరా చేయట్లేదు. కేంద్రం ఇచ్చేది పోను మిగతా ఖర్చు రాష్ట్రాలే భరిస్తున్నాయి. పేదలకు చేసే ఆ కొద్ది సాయానికీ మోడీ ప్రభుత్వం ఎసరు పెట్టాలని చూస్తోంది.

2023-24 బడ్జెట్‌లో ఆహార సబ్సిడీ పద్దు కుదించుకు పోయింది. ఈ యేటా సవరించిన అంచనాలు రూ.2.14 లక్షల కోట్లు కాగా వచ్చే ఏడాదికి రూ.1.37లక్షల కోట్లకు తగ్గింది. ఆహార భద్రతా చట్టం అమలుకు ఆహార ధాన్యాల సేకరణకు రూ.72వేల కోట్ల నుంచి 59వేల కోట్లకు తగ్గించారు. కరోనా ఇక్కట్లు ఇంకా తొలగలేదు. ఉచిత ఆహార ధాన్యాలు కొనసాగించాల్సి ఉంది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో మన దేశం పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక కంటే దిగువన 107వ స్థానంలో ఉంది. పోషకాహార లోపంతో శిశువులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. మరణాలూ సంభవిస్తున్నాయి. కోట్లాది మంది ఒక్కపూట తిండికీ నోచక ఆకలికి అలమటిస్తున్నారు. ప్రభుత్వ నయా-ఉదారవాద విధానాల వలన అంతరాలు పెరిగి పేదరికం తీవ్ర రూపం దాల్చుతోందని పలు గణాంకాలు చెబుతున్నాయి. ఈ తరుణంలో ఆహార సబ్సిడీ పెంచాల్సి ఉంది. సార్వజనీన పిడిఎస్ అవశ్యంగా మారింది. మోడీ సర్కారు కార్పొరేట్ల లాభాల కోసం పరితపించి పేదల కడుపు కాల్చడాన్ని ప్రజలు ప్రతిఘటించాలి.

న్యాయమూర్తులు-రాజకీయ ప్రలోభాలు

ఏ.పీ.షా

భారతదేశ సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన నెల రోజుల్లోపే జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా నియమితుడయ్యాడు. రామజన్మభూమి సమస్యను పరిష్కరించిన రాజ్యాంగ ధర్మాసనంలో ఆయన ఒక భాగస్వామిగా ఉండటం కాకతాళీయం కాదని చాలామందివలె నేను కూడా విశ్వసిస్తాను. ఈయన, 2014 నుండి నరేంద్రమోడీ నాయకత్వంలోని ప్రభుత్వ పాలనా కాలంలో పదవీవిరమణ చేసిన తరువాత ఉన్నతస్థాయిలో రాజకీయంగా నియమించబడిన మూడవ సుప్రీంకోర్టు న్యాయమూర్తి. మిగిలిన ఇద్దరిలో ఒకరు కేరళ గవర్నర్‌గా నియమించబడిన జస్టిస్ పీ.సదాశివన్, మరొకరు రాజ్యసభ సభ్యుడిగా నియమితుడైన జస్టిస్ రంజన్ పీ.గొగోయ్.

ఒకవేళ తాము అనుకూలమైన తీర్పులు ఇస్తే, తమకు తగిన విధంగా బహుమతులు అందిస్తారనే విషయాన్ని సర్వోన్నత న్యాయస్థానం సభ్యులకు తెలియజెప్పే విధంగా ఈ నియామకాలు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ చర్యలు సూచిస్తున్నాయి. మన అత్యున్నత న్యాయస్థానంలో

> గవర్నర్ నియామకం చూడటానికి లాంఛనప్రాయంగానే కనపడుతుంది కానీ, వాస్తవానికి అది కచ్చితంగా రాజకీయ నియామకమే. ఎలాగైతేనేం, న్యాయవ్యవస్థను అస్థిరపరచడం, వివిధ మార్గాలలో దాని పనితీరును బలహీనపరచడం పాలక పార్టీ వ్యూహాత్మక చర్యల్లో భాగంగా కనపడుతోంది. ఒకసారి వెనక్కి తిరిగి పరిశీలించి చూస్తే, న్యాయవ్యవస్థ నెమ్మది నెమ్మదిగా బలహీనపడుతూ ఉండడాన్ని మనం గమనించవచ్చు.

కొంతమంది న్యాయమూర్తులను చూస్తే, ఇలాంటి బహుమతులు ఇవ్వజూపడం అనేది న్యాయమూర్తులను అవినీతిపరులుగా తయారుచేయడంగానూ, ముఖస్తుతి సంస్కృతిని ప్రోత్సాహించేదిగాను ఉంది. ఇది కూడా న్యాయవ్యవస్థ పట్ల ప్రజలలో విశ్వాసాన్ని తగ్గిస్తుంది. "న్యాయమూర్తులు రాజకీయ విజయాలు సాధించిన రాజకీయ నాయకులకు పుష్పగుచ్ఛాలు ఇవ్వడం, అభినందన లేఖలు పంపించడం, ఉన్నత స్థానాలను పొందారని ప్రశంసించడం మొదలుపెట్టినట్లైతే, ప్రజలకు న్యాయవ్యవస్థపై ఉండే విశ్వాసం చెదిరిపోతుందని" 1980 లోనే జస్టిస్ వీ.డీ.తుల్జాపుర్కార్ అన్నారు.

> "పదవీవిరమణ అనంతరం, న్యాయమూర్తులు రాజకీయ ప్రోత్సాహాన్ని సూచించే ఎలాంటి నియామకాలను స్వీకరించకూడదని మహాసభ అంగీకరించాలి. న్యాయవ్యవస్థకు ప్రమాదం లోపలే పొంచి ఉన్నదని జస్టిస్ వై.వీ. చంద్రచూడ్ అన్నారు. పదవీవిరమణ అనంతరం ధనలాభం లేదా గౌరవం లభించే పదవుల కోసం స్వతంత్రతతో వ్యాపారం చేయడం ద్వారా న్యాయవ్యవస్థ సభ్యులు రాజీపడలేరు. ఒక వ్యక్తి న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంలో ఒక ధర్మంతో కూడిన స్వతంత్రతతో కూడిన న్యాయానికి హామీని నిర్వహిస్తామని ప్రమాణం చేసి సంతకం చేస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ప్రమాణంపై రాజీపడకూడదు."

న్యాయవ్యవస్థను బలహీన పరచడం

గవర్నర్ నియామకం చూడటానికి లాంఛనప్రాయంగానే కనపడుతుంది కానీ, వాస్తవానికి అది కచ్చితంగా రాజకీయ నియామకమే. ఎలాగైతేనేం, న్యాయవ్యవస్థను అస్థిరపరచడం, వివిధ మార్గాలలో దాని పనితీరును బలహీనపరచడం పాలక పార్టీ వ్యూహాత్మక చర్యల్లో భాగంగా కనపడుతోంది. ఒకసారి వెనక్కి తిరిగి పరిశీలించి చూస్తే, న్యాయవ్యవస్థ నెమ్మది నెమ్మదిగా బలహీనపడుతూ ఉండడాన్ని మనం గమనిం చవచ్చు.

వాస్తవంగా చెప్పాలంటే... ఈ ప్రభుత్వం న్యాయమూర్తులను ఇలా అవినీతిపరులుగా మార్చడానికి సాహసం చేసిన మొదటి ప్రభుత్వమేమీ కాదు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో ముఖ్యంగా ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ నాయకత్వంలోని ప్రభుత్వాలు కూడా ఇలాంటి సాహసాలు చేశాయి. కానీ ప్రస్తుత ప్రభుత్వం, ప్రతిపక్ష పార్టీని కూడా అంతే సమానమైన దోషిగా పేర్కొనడం పిరికితనంతో కూడిన ఆత్మరక్షణ కోసం తప్ప మరొకటి కాదు. గతంలో జరిగిన దుష్టాంతం ప్రస్తుత ఉల్లంఘనను సమర్థించదు కూడా. పాలనా యంత్రాంగం శాఖల స్వతంత్రతకు హామీ ఇవ్వడం, ప్రజాస్వామిక విలువలు కాపాడబడేట్లు చూడడమే ఎలాంటి సహేతుకమైన కార్యనిర్వహక వ్యవస్థ ఉన్నత లక్ష్యం. కానీ నిశ్చయాత్మకమైన అధికసంఖ్యాక వర్గం ఆదేశాలు, ఏ వ్యక్తినైనా అధికారంతో ఉద్రేకసహితుడ్ని చేసి, ఆ అధికార నిర్వహణకు, తరువాత ఆ అధికారం సంఘటితపడడానికి అవసరమైన సృజనాత్మకమార్గాల పరిశోధన కోసం ఒత్తిడి చేస్తాయి. ఇదే నేటి భారత ప్రభుత్వంలో జరుగుతున్న తంతు కూడా.

కపటపూరిత ప్రవర్తన

పదవీవిరమణ తరువాత చేపట్టే న్యాయనియామకాలను నివారించాలని గతంలో అరుణ్ జైట్లీ రూపొందించిన ప్రభుత్వ స్వంత మ్యానిఫెస్టోను ఉద్దేశ్యపూర్వకంగానే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు కాబట్టి ప్రభుత్వ ప్రవర్తన కూడా కపటపూరితంగానే ఉంటుంది. వాస్తవానికి, అలాంటి నియామకాల ద్వారా న్యాయమూర్తులను ప్రభావితం చేయడం అనేది కాంగ్రెస్ నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారతీయ జనతాపార్టీ మార్గదర్శకత్వంలో చేసిన నిర్దిష్టమైన ఆరోపణ.

ఇలాంటి పరిస్థితుల్లో న్యాయవ్యవస్థ కూడా నిందార్హమైన తప్పిదాలకు పాల్పడింది. భారతదేశంలో న్యాయమూర్తులను చాలా బలమైన గుణగణాలతో తయారుచేస్తారు. ఒక్కసారి కూడా మోసాలకు పాల్పడరని నేను విశ్వసిస్తాను. ఇటీవల



జస్టిస్ అఖిల్ ఖురేషీ చేసిన విధంగా న్యాయమూర్తులు నైతిక బాధ్యత, నైతిక వ్యక్తిత్వాన్ని ప్రదర్శించాలి. తన గొప్పతనాన్ని నిర్లక్ష్యానికి గురిచేసి, దేశంలోని వివిధ హైకోర్టులకు తనను తరలించిన తీరుపై ఆయన పదవీవిరమణ తరువాత, తన గురించి ప్రభుత్వానికి గల "ప్రతికూల అవగాహనను" ఒక "స్వేచ్ఛా ధృవీకరణ పత్రం" అని, ఏ మాత్రం చెక్కుచెదరకుండా తాను చాలా గర్వంగా న్యాయవ్యవస్థను వదిలివేస్తున్నానని అన్నాడు. రాజకీయ నియామకాల రూపంలో ప్రభుత్వం నుంచి పొందే చేయూత ఒక మార్గం కాదనీ, ఇచ్చే వాడు ఉంటే, పుచ్చుకునే వాడు కూడా ఉంటాడనే విషయాన్ని న్యాయమూర్తులు గుర్తించాలి. రాజకీయ ఆదరణలకు, పదవీవిరమణ తరువాత ఉపాధి అవకాశాలకు మధ్య ఉండే వ్యత్యాసాలను భారతీయ న్యాయవ్యవస్థ గుర్తించాలి.

పాత్రల విభజన

ట్రిబ్యునల్ లేదా కమిషన్ లాంటి న్యాయపరమైన అధికారానిది స్పష్టమైన విలువ, అవసరం ఉండే పాత్రకు, ఆ అధికారం లేనిచోట ఉండే పాత్రకు మధ్య సరిహద్దులు ఉండాల్సిన అవసరం ఉంది. జస్టిస్ గొగోయ్, రాజ్యసభకు తన నియామకం గురించి మాట్లాడుతూ, న్యాయ వ్యవస్థకు, శాసనసభకు మధ్య ఉండే అంతరాన్ని పూడ్చాలనే ఉద్దేశం తనకున్నట్లు ప్రకటించాడు కానీ పార్లమెంటరీ వ్యవహారాలలో ఆయన హాజరైన తీరు, ప్రజల భాగస్వామ్యం అలాంటి ఏ ఉద్దేశాన్ని సూచించలేదు. అదేవిధంగా జస్టిస్ సదాశివం, తాను ప్రజలకు గవర్నర్ పాత్ర ద్వారా సేవలు అందించాలనుకున్నాననీ, కానీ అదే లక్ష్యాన్ని ఇతర నియామకాల ద్వారా ఖచ్చితంగా చేసి ఉండెడివాడిననీ, అది భారత ప్రధాన న్యాయమూర్తి పదవిలో ఉన్న వారికి మరింత సానుకూలంగా ఉంటుందని అన్నాడు.

దీనిపై ప్రధాన న్యాయమూర్తుల మహాసభలో న్యాయనిపుణుల సమాజం అంతా కలిసి ఒక నిర్ణయం తీసుకోవాలి. పదవీవిరమణ అనంతరం, న్యాయమూర్తులు రాజకీయ ప్రోత్సాహాన్ని సూచించే ఎలాంటి నియామకాలను స్వీకరించకూడదని మహాసభ అంగీకరించాలి. న్యాయవ్యవస్థకు ప్రమాదం లోపలే పొంచి ఉన్నదని జస్టిస్ వై.వీ. చంద్రచూడ్ అన్నారు. పదవీవిరమణ అనంతరం ధనలాభం లేదా గౌరవం లభించే పదవుల కోసం స్వతంత్రతతో వ్యాపారం చేయడం ద్వారా న్యాయవ్యవస్థ సభ్యులు రాజీపడలేరు. ఒక వ్యక్తి న్యాయమూర్తిగా బాధ్యతలు

> పదవీవిరమణ తరువాత చేపట్టే న్యాయనియామకాలను నివారించాలని గతంలో అరుణ్ జైట్లీ రూపొందించిన ప్రభుత్వ స్వంత మ్యానిఫెస్టోను ఉద్దేశ్యపూర్వకంగానే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు కాబట్టి ప్రభుత్వ ప్రవర్తన కూడా కపటపూరితంగానే ఉంటుంది. వాస్తవానికి, అలాంటి నియామకాల ద్వారా న్యాయమూర్తులను ప్రభావితం చేయడం అనేది కాంగ్రెస్ నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారతీయ జనతాపార్టీ మార్గదర్శకత్వంలో చేసిన నిర్దిష్టమైన ఆరోపణ.

స్వీకరించిన సందర్భంలో ఒక ధర్మంతో కూడిన స్వతంత్రతతో కూడిన న్యాయానికి హామీని నిర్వహిస్తామని ప్రమాణం చేసి సంతకం చేస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ప్రమాణంపై రాజీపడకూడదు. మన న్యాయమూర్తులు భారతదేశ ప్రజలతో చేసుకున్న ఈ అలిఖిత ఒప్పందాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

("ద హిందూ" సౌజన్యంతో)
అనువాదం బోడపట్ల రవీందర్, 9848412451



బిలియనీర్ల కన్న మధ్య తరగతి ఆదాయ పన్నుఎక్కువ!

దేశాభివృద్ధికి ప్రజలు చెల్లించే పన్నులే ఆధారం. పన్నులు లేకుండా ప్రభుత్వం నడవదు. ప్రజాసంక్షేమం, ప్రగతి రథం కదలడానికి నిధులు పన్నుల నుంచే వాసులు చేయబడతాయి. పన్ను వసూళ్లలో వేతన జీవులు ఎలాంటి అక్రమ మార్గాలను వెతక్కుండా సరైన పద్ధతిలో పన్నులను కచ్చితంగా, సకాలంలో చెల్లిస్తున్నారు. వ్యాపార వర్గాలు పన్నుల ఎగవేతలకు దొడ్డిదారులు అన్వేషిస్తున్నారు. బిలియనీర్ల పన్నుల రేట్లను ప్రభుత్వమే రాయితీల పేరుతో తగ్గిస్తున్నది. నిరుపేదలు, వ్యవసాయ వర్గాలు పన్ను పరిధిలోకి రావడం లేదు. మధ్య తరగతి వేతన జీవులే ప్రభుత్వానికి తేలికగా దొరుకుతున్నారు. ఇలాంటి భారత మధ్య తరగతి వర్గాలు పన్ను పోటుతో నవ్వలేక, ఏడ్వలేక అయోమయ స్థితిలో త్రిశంకుస్వర్గంలో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. సంపన్న వర్గాలకు కార్పొరేట్ పన్ను 30శాతం నుంచి 22శాతానికి తగ్గించడంతో పాటు నూతన మాన్యుఫాక్చర్ కంపెనీలకు పన్ను 15శాతం మాత్రమే వసూలు చేస్తుండగా మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వర్గాల నుంచి మాత్రం 30శాతం వరకు పన్నులు వసూలు చేయడం విచారకరం. ఆర్థిక సంవత్సరాలు 2020, 2021ల్లో బిలియనీర్ల కార్పొరేట్ పన్నులు 30 నుంచి 22శాతానికి తగ్గించడంతో ప్రభుత్వం రూ.1,84,000 కోట్ల ఆదాయం కోల్పోయింది. మధ్య తర గతి 30శాతం వరకు పన్నులు చెల్లిస్తుండగా బిలియనీర్లు 22శాతం మాత్రమే కట్టడం సమర్థనీయం కాదు.

మధ్య తరగతి ఆదాయ పన్ను తగ్గించలేదా!

వేతన మధ్య తరగతి వర్గాలకు పన్నుల మినహాయింపు కనీస ఆదాయం ప్రస్తుత రూ.2.50లక్షల నుంచి 5.0లక్షలకు పెంచాలని, తదుపరి స్లాబుల్లో పన్ను రేట్లు గణనీయంగా తగ్గించాలనే డిమాండ్ గత కొన్నేండ్లుగా వినిపిస్తున్నది. ఇదే విషయాన్ని దేశ ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కూడా సమర్థిస్తూ మాట్లాడటం తాను కూడా మధ్య తరగతి పన్ను చెల్లింపు వర్గానికి చెందిన దానినే అంటూ కొత్త ఆశలను రేకెత్తిస్తున్నది. మధ్య తరగతి కడుతున్న పన్నులతో ఆ వర్గానికి అవసరమైన స్మార్ట్ సిటీస్ అభివృద్ధి, మెట్రో రైల్ సదుపాయాలు, నగర మౌలిక వసతుల అభివృద్ధి, జీవన ప్రమాణాల పెంపుదల లాంటి సేవలు సుసాధ్యం అవుతున్నాయని ప్రభుత్వం వివరిస్తున్నది. భారత్‌లో వార్షిక ఆదాయం రూ.5 లక్షల నుంచి 30లక్షల వరకు ఉన్న వర్గాలను మధ్య తరగతిగా, సాలీనా 30లక్షల కన్న అధిక ఆదాయం కలిగిన వర్గాలను ధనవంతులు, సంపన్నుల కుబేరులుగా వర్గీకరించబడ్డారు. ఇండియాలో 3 శాతం సంపన్న వర్గాలు, 30శాతం మధ్య తరగతి వర్గాలు, 67శాతం పేద వర్గాలు ఉన్నారని ఇటీవల 'ప్రైస్ డాటా ఏజెన్సీ' విశ్లేషించింది. కుబేరుల పన్ను రేట్లు 30శాతం కన్న అధికంగా, మధ్య తరగతి వర్గాలకు 25 శాతం కన్న తక్కువగా ఉండాలని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

మధ్య తరగతి ఆదాయ పన్ను విధానాలు

సగటు భారతీయుడు 54శాతం వరకు ప్రత్యక్ష, పరోక్ష పన్నులను కడుతున్నారని తెలుస్తున్నది. భారత్‌లో ప్రస్తుత నూతన పన్ను విధానంలో వార్షిక ఆదాయం రూ.2.5లక్షల వరకు పన్ను మినహాయింపు ఉండగా, 2.5లక్షల నుంచి 5.0లక్షల ఆదాయం వరకు 5శాతం ఆదాయ పన్నులు కడుతున్నారు. వార్షిక ఆదాయం 5.0 నుంచి 7.5లక్షల వరకు 10శాతం పన్నులు, 7.5 నుంచి 10లక్షల వరకు 15శాతం ఆదాయ పన్నులు వసూలు చేస్తున్నారు. అనంతరం 10 నుంచి 12.5లక్షల వరకు 20శాతం, 12.5 నుంచి 15లక్షల వరకు 25శాతం ఆదాయ పన్ను చెల్లిస్తున్నారు. వార్షిక ఆదాయం రూ.15లక్షలు దాటిన వారికి 30శాతం ఆదాయ పన్నులు చెల్లించడం జరుగుతోంది. పాత విధానం ప్రకారం 2.5 నుంచి 5లక్షల వార్షిక ఆదాయానికి 5శాతం, 5 నుంచి 10లక్షల వరకు 20శాతం, 10 లక్షల పైన ఆదాయానికి 30శాతం పన్నులు వసూలు చేశారు. పన్ను చెల్లింపుదారులకు పాత లేదా కొత్త విధానాలను ఎంపిక చేసుకునే స్వేచ్ఛను కల్పించారు. నూతన పన్ను విధానంలో చెల్లించే వేతన జీవులకు స్టాండర్డ్ డిడక్షన్, ఇంటి కిరాయి, సెలవు ప్రయాణ సహాయం, గృహ రుణాలు, సెక్షన్ 80సి, 80డి, 80సిసిడి, పిపియఫ్, యన్‌యస్‌సి, ఈపియఫ్ లాంటి పన్ను రాయితీ ప్రయోజనాలు కల్పించకపోవడం ఆక్షేపణీయమే అని వింటున్నాం.

2017-18 నుంచి నేటి వరకు నూతన పన్ను విధానం ప్రవేశ పెట్టినప్పటికీ మధ్య తరగతి వర్గాల బేసిక్ ఆదాయ పన్ను మినహాయింపు లిమిట్‌లో పెద్ద మార్పులు కనిపించ లేదు. రాబోయే అసెంబ్లీతో పాటు 2024 పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టు కొనైనా ఇప్పుడు మధ్య తరగతి వర్గాలకు ఊరట లభించే విధంగా ప్రభుత్వాలు ఆలోచన చేయాల్సిన అవసరముంది.



డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి
99497000037

పట్టణాలపై కేంద్రం విసిరిన 'రింగ్ ఫెన్సింగ్'



బి. గంగారావు

పట్టణాలు, నగరాలు ఎదుర్కొంటున్న కీలక సమస్యలను 2023-24 కేంద్ర బడ్జెట్ విస్మరించింది. ఈసారి చిన్న పట్టణాలపై గురిపెట్టింది. ప్రయివేట్ పెట్టుబడులు, ప్రయి వేట్ రుణాలు ప్రోత్సహిం చటం ద్వారా టైర్-2, టైర్-3 పట్టణాల్లో మౌలిక సదుపాయాలు కల్పించబోతున్నట్లు బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అందుకుగాను చిన్న పట్టణాల మౌలిక సదుపాయాల కల్పన నిధిని రూ.10 వేల కోట్లతో ఏర్పాటు చేశారు. ఈ నిధితో పాటు 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు, కేంద్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో వివిధ పథకాలకు కేటాయించిన నిధులను కూడా ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. అయితే ఈ నిధులను వినియోగించుకోవటానికి ఒక షరతుపెట్టారు. ఈ నిధులను ఉపయోగించుకునే పట్టణం తప్పనిసరిగా యూజర్ ఛార్జీలను ప్రజల నుండి అమలు చేయాలని నిబంధన విధించారు.

"రింగ్ ఫెన్సింగ్" విధానాన్ని అమలు చేయడం ద్వారా చిన్న పట్టణాల్లో సైతం పట్టణ సంస్కరణలను అమలు చేసేందుకు మోడీ ప్రభుత్వం తెరలేపింది. రింగ్ ఫెన్సింగ్ అంటే పట్టణ పరిపాలనా వ్యవస్థ నుండి కొన్ని భాగాలను వేరుచేసి నిర్వహించటం. ప్రస్తుత మున్సిపల్ పరిపాలనా విధానంలో భాగంగా ఉన్న విధులు, కార్యకలాపాలు, ఆదాయాలు, వ్యయాలు, ఆస్తులు మొదలగు వాటిని వేరు చేసి ప్రత్యేక సంస్థల ద్వారా నిర్వహించటం. ఈ సంస్థలను చట్టపరంగా, ఆర్థికంగా స్వతంత్రంగా పనిచేసేలా ఏర్పాటు చేస్తారు. వీటికి ప్రత్యేక ఎస్క్రో అకౌంట్స్ ఏర్పాటు చేస్తారు. ఉదాహరణకు నీటి సరఫరా. ఇది మున్సిపాలిటీ ముఖ్యవిధి. ప్రస్తుతం ఈ విభాగం మున్సిపల్ కార్యకలాపాల్లో భాగంగా ఉంది. దీని ఆస్తులు, నిర్వహణ, కేటాయింపులు, ఖర్చులు వంటివన్నీ మున్సిపల్ కౌన్సిల్ పరిపాలనలో ఉన్నాయి. దీని లాభనష్టాలకు కూడా మున్సిపల్ కౌన్సిల్ బాధ్యత వహిస్తుంది. ఆదాయ-వ్యయాలను కూడా మున్సిపల్ బడ్జెట్‌లో చూపిస్తున్నారు. ఇప్పుడు "రింగ్ ఫెన్సింగ్" విధానంలో వీటిని మున్సిపల్ విధుల్లో చూపరు. మున్సిపల్ అకౌంట్స్‌లో కూడా చూపరు. ఈ విధానం అమలు చేసిన చోట మున్సిపల్ కౌన్సిల్‌కు ఈ రంగం ఎలాంటి నిర్ణయం తీసుకోవడానికి అధికారం ఉండదు. స్వతంత్రంగా పని చేస్తూ కౌన్సిల్‌కు జవాబుదారీగా ఉండదు.

మంచినీటి సరఫరాయే కాదు. పారిశుధ్యం, మురుగునీరు, పార్కులు, వీధి లైట్లు, ఖాళీస్థలాలు వంటి వాటన్నిటి నిర్వహణను విడివిడిగా చేయడమే "రింగ్ ఫెన్సింగ్" లక్ష్యం. వీటిని తరువాత ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పజెప్తారు. ఈ రింగ్ ఫెన్సింగ్ విధానంలో నిర్వహణకు అయ్యే ఖర్చును మొత్తం ప్రజల నుండి వసూలు చేయడం ప్రధాన విధి. నీటి సరఫరా, పారిశుధ్యం, మురుగునీరు, వీధిలైట్లు, పార్కులు ఇలా ప్రతి రంగంలో ఏడాదికయ్యే ఖర్చును యూజర్ ఛార్జీల రూపంలో వసూలు చేయాలి. అలాగే టైర్-2, టైర్-3 పట్టణాలకు ఇచ్చే నిధులన్నీ సంస్కరణలకు ముడిపెట్టి ఇచ్చేవే. మౌలిక సదుపాయాల కల్పన నిధి ఏర్పాటు అందుకే. ఇప్పుడు 15వ ఆర్థిక సంఘం నిధులు, పట్టణ ప్రాంతాలకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించే అమృత పథకం వంటి నిధులన్నీ షరతుల పరిధిలోకి వెళ్ళనున్నాయి. కేంద్రం విధించిన షరతులు అమలు చేస్తేనే వీటిని వినియోగించుకోవడం సాధ్యమవుతుంది.

మరొక ప్రమాదకర నిర్ణయం ఏమిటంటే లక్షలోపు జనాభా ఉన్న పట్టణాలను కూడా అప్పుల్లోకి దించబోతున్నారు. ఇప్పటి వరకు దేశంలో టైర్-2, టైర్-3 పట్టణాలు అప్పులు చేయలేదు. ఎక్కువ భాగం స్వంత పన్ను ఆదాయాలు, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు, కేంద్ర పట్టణ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక గ్రాంట్ల మీదనే ఆధారపడి నడుస్తున్నాయి. ఇప్పుడు వీటి రుణ సామర్థ్యాన్ని పెంచటానికి రింగ్ ఫెన్సింగ్ ఉపయోగపడుతుందని ఆర్థిక



> పట్టణ రంగానికి సంబంధించి మొత్తం సంస్కరణలను అమలు చేయాలన్నదే ఈ బడ్జెట్ కేంద్ర లక్ష్యంగా ఉంది. పట్టణాలు ఎదుర్కొం టున్న ప్రధాన సమస్యలు, సవాళ్లను ఏ మాత్రం పట్టించుకోలేదు. వీటన్నింటి కోసం అప్పుల ద్వారా ఆదాయాలు సమకూర్చుకోవాలని, ప్రయివేటీకరణ చర్యలు చేపట్టాలని, వినియోగ చార్జీలు వసూలు చేయాలని నివేదించింది. గత ఏడాది కన్నా 2023-24 బడ్జెట్‌లో పట్టణ రంగానికి కేటాయింపులు స్థూల జాతీయోత్పత్తిలో 0.5శాతం నుండి 0.3శాతానికి కోతపెట్టింది. స్మార్ట్ సిటీలకు రూ.8800కోట్ల నుండి 8వేల కోట్లకు తగ్గించింది. ఈ పథకం అమలు ఈ ఏడాది జూన్‌తో ముగిసిపోతుంది.

మంత్రి బడ్జెట్ ప్రసంగంలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. రింగ్ ఫెన్సింగ్ కింద వేరు చేసిన విభాగాలకు నిధులను ప్రయివేట్ రుణాల ద్వారా, బాండ్ల ద్వారా సమకూర్చుకోవాలి. లేదంటే వీటి నిర్వహణ పూర్తిగా ప్రయివేట్ సంస్థలకు ఇవ్వాలి. ప్రతి విభాగంలో ఆదాయ-వ్యయాలు సమానం అయితేనే ఆ రంగంలో పెట్టుబడుల కల్పనకు రుణాలు ఇస్తారని లేదా బాండ్ల విడుదల ద్వారా పెట్టుబడులు సమకూర్చుకోవటం సాధ్యమవుతుందని ప్రభుత్వం అడ్డగోలుగా వాదిస్తున్నది. పట్టణ రంగానికి సంబంధించి మొత్తం సంస్కరణలను అమలు చేయాలన్నదే ఈ బడ్జెట్ కేంద్ర లక్ష్యంగా ఉంది. పట్టణాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, సవాళ్లను ఏ మాత్రం పట్టించుకోలేదు. వీటన్నింటి కోసం అప్పుల ద్వారా ఆదాయాలు సమకూర్చుకోవాలని, ప్రయివేటీకరణ చర్యలు చేపట్టాలని, వినియోగ చార్జీలు వసూలు చేయాలని నివేదించింది. గత ఏడాది కన్నా 2023-24 బడ్జెట్‌లో పట్టణ రంగానికి కేటాయింపులు స్థూల జాతీయోత్పత్తిలో 0.5శాతం నుండి 0.3శాతానికి కోత పెట్టింది. స్మార్ట్ సిటీలకు రూ.8800 కోట్ల నుండి 8వేల కోట్లకు తగ్గించింది. ఈ పథకం అమలు ఈ ఏడాది జూన్‌తో ముగిసిపోతుంది. పట్టణ బడ్జెట్‌లో 33.32శాతం మెట్రో రైళ్ల నిర్మాణానికి కేటాయించింది. ఇవి కూడా పిపిపి కింద చేపట్టేవే. కొన్ని నగరాలకే పరిమితం.

గత రెండు దశాబ్దాల నుంచి పట్టణ రంగంలో ప్రయివేటీకరణ విధానాల అమలుకు ప్రయత్నం చేస్తున్నారు. పథకాలు, నిధులు ఎరజూపి సంస్కరణల అమలుకు పూనుకుంటున్నారు. గతంలో జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎమ్ పథకం తీసుకొచ్చి దేశంలో 63 నగరాల్లో సంస్కరణల అమలుకు ప్రయత్నం చేశారు. కేంద్ర ఆర్థిక సంఘం నిధులను కూడా సంస్కరణలకు ముడిపెట్టి ఇస్తున్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణ సంస్కరణల అమలుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నది. అధికారంలోకి వచ్చిన వెంటనే స్మార్ట్ సిటీ పథకాన్ని 100నగరాల్లో అమలుకు ప్రయత్నం చేస్తున్నది. దేశంలో తొలిసారిగా స్మార్ట్ సిటీలో పథకం అమలుచేస్తున్న నగరాల్లో ఎన్నికైన కౌన్సిళ్లకు, స్మార్ట్ సిటీ కింద చేపట్టే ప్రాజెక్టులకు సంబంధం లేకుండా చేసింది. ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టాలో నిర్ణయించుకొనే అధికారం కూడా కౌన్సిల్‌కు లేకుండా చేశారు. నిర్వహణ మొత్తం వేరు చేశారు. ఈ పథకాన్ని పూర్తిగా స్పెషల్ పర్పస్ వెహికల్ ద్వారా నిర్వహిస్తున్నారు. ఈ పథకంలో చేపట్టిన పనుల్లో ఎక్కువ భాగం ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యం కింద చేపడుతున్నారు. దీని కింద ఖర్చు పెడుతున్న నిధులను తిరిగి వినియోగదారుల నుంచి తప్పనిసరిగా వివిధ రూపాల్లో వసూలు చేయాలన్న నిబంధన కూడా విధించారు.

మరొకవైపు నగరాల మధ్య పోటీ పెట్టి ర్యాంకులు ఇస్తూ... ప్రయివేటీకరణ విధానాల అమలు, మౌలిక సదుపాయాలకు సమీకృత పెట్టుబడి అనే దానిని కూడా ఏర్పాటు చేశారు. అన్ని రాష్ట్రాల్లో ఇటువంటి సంస్థలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్నది. ఆంధ్ర రాష్ట్రంలో ఇప్పటికే ఎ.పి అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థను ఏర్పాటుచేసింది. తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్నాటక, గుజరాత్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలు కూడా ఈ తరహా సంస్థలను ఏర్పాటు చేశాయి. మరొకవైపు ప్రపంచబ్యాంకు, ఎడిబి డిఎఫ్ఐఎ, యుఎస్ ఎయిడ్ వంటి సంస్థలన్నీ నేడు మనదేశ పట్టణ స్థానిక సంస్థలలో ప్రత్యక్ష జోక్యం చేసుకుంటున్నాయి. నిధుల సహకారం పేర పౌరసేవలన్నింటినీ ప్రయివేటీకరించాలని షరతులు విధిస్తున్నారు. కోవిడ్‌ను ఆసరా చేసుకొని మోడీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చే అప్పులకు పట్టణ సంస్కరణలకు ముడిపెట్టింది.

వాస్తవంగా పట్టణ రంగం రాష్ట్ర జాబితాలోనిది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర జాబితాలోని అనేక రంగాలను తన పరిధిలోకి బలవంతంగా గుంజుకుంటున్నది. మున్సిపల్ చట్టాలను మార్చేస్తున్నది. అన్ని స్థాయిల్లోని పట్టణాలన్నింటిలో ఈ సంస్కరణల అమలు లక్ష్యంగా కొత్తకొత్త పథకాలను ప్రవేశపెడుతున్నది.

సెల్:9490098792

ఒకప్పుడు వారు గుక్కెడు నీటి కోసం నాలుగైదు కిలోమీటర్లు నడిచి వెళ్ళే వారు. మహిళలంతా తలపై కడవలు పెట్టుకొని మోయలేని భారంతో అడుగులు వేస్తూ మంచినీటిని తెచ్చుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. రేణుకా కోటంబ్కర్, అశాతై కొష్మె, బబితా లిరోలియా, రాధా మీనా... వారి గ్రామాల్లో వాటర్ ఛాంపియన్‌లుగా నిలిచారు. వాటర్ ఎయిడ్ ఇండియా సహాయంతో తమ గ్రామాల్లో మంచినీటి పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ, తమ కమ్యూనిటీలలో స్థిరమైన మార్పును తీసుకురావడానికి, స్వచ్ఛమైన తాగునీటిని అందించడంలో సహాయం చేస్తున్నారు. వారు చేసిన ఈ పని వారి జీవితాల్లోనే కాదు చుట్టపక్కల గ్రామాల్లో కూడా ఎంతో మార్పు తెచ్చింది. ఆ వివరాలేంటో ఈ రోజు మానవిలో...

ఉమెన్ వాటర్ ఛాంపియన్స్



మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని కొన్ని మారుమూల గ్రామాల్లో మహిళలు ఓ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నారు. ఇది వారి జీవితాలనే కాదు వారి చుట్టూ ఉన్నవారిని సైతం విభిన్న మార్గాల్లో ప్రభావితం చేస్తుంది. వీరు గతంలో మంచినీటి కోసం నాలుగైదు కి.మీ వరకు నడిచే పోయేవారు. ఇప్పుడు ఆ ఉద్యమ ఫలితంగా స్వచ్ఛమైన మంచినీరు వీరికి అందుబాటులోకి వచ్చింది. స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ వారి కమ్యూనిటీలలో స్థిరమైన మార్పును ఆ మహిళలు ముందుండి నడిపిస్తున్నారు.

మహిళలకు శిక్షణ ఇస్తూ...


వాటర్ ఎయిడ్ ఇండియా అనేది ఓ స్వచ్ఛంధ సంస్థ. గ్లోబల్ వాటర్ ఎయిడ్ నెట్‌వర్క్‌లో భాగమైంది. USAID & Gap Inc ద్వారా విమెన్ + వాటర్ అలయన్స్ ('The W+W అలయన్స్) అనే ప్రాజెక్ట్‌లో భాగంగా మహిళలకు శిక్షణనిస్తోంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లోని ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాలలో వాటర్ ఎయిడ్ ఇండియా తన పని చేస్తుంది. ఈ ప్రాజెక్ట్ సామాజిక, ఆర్థిక అంశాలపై కూడా దృష్టిపెడుతుంది. UNDP ద్వారా మహిళలకు ఉమెన్ వాటర్ ఛాంపియన్స్ బిరుదును అందిస్తుంది. అంతేకాకుండా వ్యక్తిగతంగా వారు తమ కమ్యూనిటీలలో మార్పు కోసం కృషి చేసేలా ప్రోత్సహిస్తుంది. జల్ శక్తి మంత్రిత్వ శాఖ వారి జల్ జీవన్ మిషన్ పరిధిలోని అన్ని కమ్యూనిటీ కార్యక్రమాలు ప్రాజెక్ట్ ప్రాంతాలలో చేపట్టబడతాయి.

మార్పు కోసం కృషి

వాటర్‌ఎయిడ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ మాట్లాడుతూ "విమెన్ + వాటర్ అలయన్స్ అనేది USAID, గ్యాప్ ఇంక్‌ల మధ్య ఆరు సంవత్సరాల గ్లోబల్ డెవలప్‌మెంట్ అలయన్స్ (GDA). 2019 నుండి ఈ అలయన్స్‌లో భాగస్వామి అయిన వాటర్‌ఎయిడ్ ఇండియా దానికి కట్టుబడి ఉంది. మధ్యప్రదేశ్‌లోని సెహోర్, ఇండోర్, ధార్, దేవాస్‌ఖాండ్వా జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని వార్ధా, యవత్మాల్ జిల్లాల్లోని కమ్యూనిటీలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడం దీని లక్ష్యం. కమ్యూనిటీ స్థాయిలో మార్పు కోసం కృషి చేసే మహిళలు ఎంపిక చేయబడతారు. ఈ ప్రాజెక్ట్ కింద 13,834 మంది మహిళలు, యువతకు నీటి నాణ్యత పరీక్ష, ఫీల్డ్ టెస్ట్ కిట్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. 4,067 మంది మహిళలు భాగస్వామ్య ప్రణాళిక, గ్రామ కార్యాచరణ ప్రణాళికా అభివృద్ధిపై శిక్షణ పొందారు. నీటి భద్రత ప్రణాళిక, మూల స్థిరత్వంపై 135 మంది మహిళలు శిక్షణ పొందారు. గ్రామసభలో భాగస్వామ్యాన్ని పెంచడానికి 4,634 మంది మహిళలు శిక్షణ పొందారు. అలాగే 184 మంది మహిళలు సాంకేతిక నిపుణులుగా శిక్షణ పొందారు. వారి పనితో పాటు ఈ ప్రాజెక్ట్ ద్వారా వారి కమ్యూనిటీలు ఎలా ప్రభావితమయ్యాయో అర్థం చేసుకోవడానికి మేము కొంతమంది మహిళా వాటర్ ఛాంపియన్‌లతో మాట్లాడాము.

అట్టడుగు స్థాయిలో మార్పు

మహారాష్ట్రలోని వార్ధా జిల్లాలోని కోటంబ గ్రామ సర్పంచ్‌గా ఉన్న రేణుకా కోటంబ్కర్ ఆ గ్రామంలో మంచినీటి కోసం ఉద్యమించారు. "నా పెండ్లయ్యి గ్రామానికి వచ్చేటప్పటికి మహిళలు రెండుమూడు కి.మీ నడిచి తాగు నీటి కోసం వెళ్లాల్సి వచ్చేది. మహిళలను సమీకరించి చేతి పంపుల కోసం పంచాయితీ వారిని అడిగాను. తక్కువ కాలంలోనే మేము గ్రామంలో పబ్లిక్ కుళాయిని కూడా ఏర్పాటు చేసుకున్నాం" అని కోటంబ్కర్ గుర్తు చేసుకున్నారు. ఆమె సమిష్టి కృషిని చూసిన గ్రామస్తులు ఆమెను సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయవలసిందిగా కోరారు. అందరి మద్దతుతో ఆమె విజయవంతంగా గెలిచింది. ఇప్పుడు ఆమె రెండవ సారి కూడా గెలిచి కోటంబ్కర్ కోటంబలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తున్నారు. వాటర్‌ఎయిడ్ ఇండియా మద్దతుతో, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఉమెన్, చైల్డ్ అండ్ యూత్ డెవలప్‌మెంట్‌చే అమలు చేయబడిన విమెన్ + వాటర్ ప్రాజెక్ట్ మద్దతుతో ప్రభుత్వ భవనాలపై నిర్మించిన వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలపై ప్రధానంగా దృష్టి సారించారు. అలాగే గ్రామంలోని 285 కుటుంబాలకు పైపుల ద్వారా నీటి సరఫరా పథకం కింద కుళాయి నీటి కనెక్షన్లు ఏర్పాటు చేయడంలో రేణుక విజయం సాధించారు.



రేణుకా కోటంబ్కర్

"సంవత్సరాలుగా నీటిని సంరక్షించడంతో పాటు దాన్ని ప్రాముఖ్యతను మేము తెలుసుకున్నాము. ఎనిమిది పారామితుల ఆధారంగా నీటిని ఎలా పరీక్షించాలో మాకు నేర్పించారు. ప్రతి ఇంటికి నీటి ప్రవాహం ఉండేలా చూడడానికి, జల్ టాక్స్ వసూలు చేయడానికి, గ్రామంలో నీటి కొరత లేకుండా అవసరమైనప్పుడు జోక్యం చేసుకోవడానికి మేము మహిళల కమిటీని ఏర్పాటు చేసాము. కోటంబ్కర్ సమన్వయంతో జరిగిన ఈ ప్రయత్నాలు ప్రభుత్వ వనరులు, వ్యక్తిగత నిధులు, గ్రామస్తుల సమిష్టి కృషితో ఆచర సాధ్యమయ్యాయి. ఆర్థికంగా వెనుకబడిన అన్ని కుటుంబాలకు కుళాయి కనెక్షన్‌ని పొందేందుకు నేను కూడా వ్యక్తిగతంగా కొంత సహాయం చేసారు. రూ. 50 కంటే తక్కువ వాయిదాలలో చెల్లించడానికి అనుమతించారు. కోటంబ్కర్ కృషిని గుర్తించి మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మల్ గ్రామ్ అవార్డు, ఆదర్శ సర్పంచ్ అవార్డు, స్మార్ట్ విలేజ్ అవార్డు, ది. ఛత్రపతి అవార్డు ఇచ్చింది. వేసవిలో కూడా నీటి కొరత లేకుండా చేయగలిగితే అది గ్రామానికి గర్వకారణం. గ్రామాల్లోని అన్ని ఇండ్లకు ప్రయోజనం చేకూర్చేలా రెయిన్వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లను నెలకొల్పడమే మా ప్రణాళిక ఇప్పుడు" అని ఆమె చెప్పారు.

సామాజిక మార్పుకు



ఆశాతాయి

పదేండ్ల కిందట మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లాకు చెందిన ఆశాతాయి ప్రతిరోజూ నీటిని సేకరించేందుకు వ్యవసాయ పొలాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. "చాలా మంది మహిళలు బరువులు మోసి వెన్ను నొప్పితో బాధపడేవారు. నేను మహిళా గ్రామసభ సమావేశాన్ని నిర్వహించాను. దాని ద్వారా గ్రామానికి ప్రత్యేక పైప్‌లైన్ కోసం గ్రామ పంచాయతీ తీర్మానం చేయవలసి వచ్చింది" అని ఆమె చెప్పారు. ఇంటి స్థాయిలో సోక్ పిట్‌లను తయారు చేసేందుకు నాలుగు గ్రామాల్లోని మహిళల మద్దతు కూడగట్టడంతో ఆశాతాయి కృషి ఫలించింది. ప్రాజెక్ట్ బృందం మార్గదర్శకత్వంతో ఆమె 148 సోక్ పిట్‌లను తయారు చేయడంలో సహాయపడ్డారు. దీనితో పాటు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీన్ కింద 25 ఇండ్లకు మరుగుదొడ్ల నిర్మాణానికి మంజూరు కావడంలో ఆమె సహాయం చేశారు. బావి రీఛార్జ్ నిర్మాణం కోసం ప్రజలను చైతన్యపరిచారు. ఇప్పుడు వారి మంచి నీరు అందుబాటులోకి వచ్చింది. వాటర్ ఎయిడ్ ప్రాజెక్ట్‌తో జట్టుకట్టడం సామాజిక మార్పుకు నాంది పలికింది. "నీటిని ఎలా సంరక్షించాలో, పరీక్షించాలో నేర్చుకోవడమే కాకుండా సమానత్వ ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడానికి ఈ ప్రాజెక్ట్ మాకు సహాయపడింది. ఇంతకుముందు మహిళలు గ్రామసభ సమావేశాలకు హాజరయ్యే వారు కాదు. నిజానికి ఆడపిల్ల పుట్టిందంటే అందరూ నిరాశ చెందేవారు. చిన్న వయసులోనే పెండ్లి చేసేవారు. ఈ ప్రాజెక్ట్ మాకు సమానత్వం గురించి, స్థానిక పాలనలో ఎలా పాలుపంచుకోవాలో నేర్పింది" అని ఆమె చెప్పారు.

ధైర్యంగా మాట్లాడుతున్నారు

మధ్యప్రదేశ్‌లోని సెహోర్ జిల్లాలోని మహుకాల అనే గ్రామ నివాసి రాధా మీనా విమెన్ + వాటర్ సమ్మేళనం కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకురాలు. ప్రాజెక్ట్ కింద నీటి సమస్యలపై అనేక శిక్షణలు ఇచ్చారు. మీనా భర్త ఏడాది కిందట చనిపోయాడు. అప్పటి నుంచి ఆమె ఓ ఫ్యాక్టరీలో పని చేస్తూ పిల్లలను పోషించుకుంటుంది. అలాగే గ్రామంలోని కుళాయి నీటి పథకం పనులు కూడా చూసుకుంటోంది. గ్రామంలో మొత్తం 174 కుటుంబాలు ఉన్నాయి. మర్దాన్‌పూర్ గ్రామీణ నీటి సరఫరా కుళాయి నీటి పథకం ద్వారా తాగునీటి వ్యవస్థ జరుగుతోంది. 143 కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వడం ద్వారా పరిశుభ్రమైన, సమృద్ధిగా నీరు అందుతోంది. "నేను మర్దన్‌పూర్ రూరల్ గ్రూప్ వాటర్ సప్లై స్కీమ్‌ను పబ్లిక్ లాబీయింగ్ ద్వారా ఆమోదించడంలో సహాయం చేసాను. పథకం పరీక్ష నిర్మాణం, అమలును నిరంతరం పర్యవేక్షించడంలో కూడా నేను సహాయం చేశాను" అని ఆమె చెప్పారు. పైప్‌లైన్ సంబంధిత పనులైన సరైన ప్రదేశాల్లో చెక్ వాల్వ్‌ల ఏర్పాటు, అన్ని కుళాయిల్లో లీకేజీ సమస్య, ఇతర నాణ్యమైన పనుల్లో మీనా సహాయం చేస్తున్నారు. ఆమె తన అభ్యాసాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లింది. సమాజంలోని ఇతరులకు నీటి భద్రత గురించి కూడా బోధించింది. ఆమె మహిళలను వారి సమావేశాలలో పాల్గొనమని ప్రోత్సహించింది. కొన్నిసార్లు ఆమె స్వరం వినిపించేందుకు లౌడ్ స్పీకర్‌ను ఉపయోగిస్తుంది. "2019కి ముందు గ్రామీణ సమాజంలోని మహిళలు, ప్రజలకు తగినంత స్వచ్ఛమైన నీరు లభించలేదు. కానీ నేడు మహిళలు తమ కుటుంబాలను పోషించగలుగుతున్నారు, వారి పిల్లలతో తగినంత సమయం గడుపుతున్నారు. ఇది మాకు చాలా సంతోషాన్ని ఇచ్చే విషయం. గతంలో బయటకు వచ్చి మాట్లాగలిగే వాళ్ళం కాదు. ఇప్పుడు ధైర్యంగా బయటకు వస్తున్నాం. సమానత్వం గురించి మాట్లాగలుగుతున్నాం. ఈ ప్రాజెక్ట్ మంచినీటిపైన మాత్రమే కాకుండా మా జీవితంలో రావల్సిన అన్ని రకాల మార్పులపైన మాకు అవగాహన కల్పించింది" అని మీనా చెప్పారు.



రాధా మీనా

సవాళ్లను ఎదుర్కోవడం

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాలోని నయాపురా గ్రామానికి చెందిన బబితా లిరోలియాకు 'నీటి భద్రత' అనే పదానికి అర్థం కూడా సరిగా తెలియదు. అయినప్పటికీ తన గ్రామం నుండి శిక్షణా కార్యక్రమాలకు ఎంపిక చేయబడిన ఏకైక మహిళ. ఆమె సవాలును స్వీకరించింది. తన గ్రామంలో నీటి సంరక్షణ ప్రయత్నాలకు నాయకత్వం వహించింది. నేడు లిరోలియా అట్టడుగు స్థాయిలో చేసిన కృషికి నేషనల్ వాటర్ మిషన్, UNDP, స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ వాటర్ ఇనిస్టిట్యూట్‌చే మహిళా వాటర్ ఛాంపియన్‌గా గుర్తింపు పొందింది. ఆమె ప్రధాన పని నీటి నాణ్యతను పరీక్షించడం. చేతి పంపు మరమ్మత్తుపై శిక్షణా సెషన్‌కు కూడా ఎంపికయింది. లిరోలియా తన పని గురించి స్పష్టంగా, ఉత్సాహంగా ఉంది. గ్రామంలో పగిలిన నీటి పైపును బాగుచేసినప్పుడు ఆమె ఎంత సంతోషించిందో చెబుతూ "నేను నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్‌తో కలిసి పనిచేసినప్పటికీ నీటి సంరక్షణ గురించి ఆలోచన లేదు. ప్రాజెక్ట్ బృందం నీటిని అన్ని పారామితులు, నీటి నిల్వ మొదలైన వాటిపై పరీక్షించమని నాకు నేర్పింది" ఆమె చెప్పారు. త్వరలో లిరోలియా నయాపురా గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి నీరు సరిగ్గా నిల్వ చేయడం, పిల్లలకు అందుబాటులో లేకుండా పొడవాటి హ్యాండిల్స్‌తో టంబ్లర్‌లతో ఉపయోగించే విధంగా అవగాహన కల్పించింది. పరీక్షలను సులభతరం చేయడానికి, గ్రామంలోని చేతి పంపులు, కుళాయిల కోసం మ్యాప్‌ను గీసేందుకు, నీటి ప్రవాహాన్ని నియంత్రించడానికి క్రమం తప్పకుండా ప్రతి ఇంటిని సందర్శించేలా ఆమె 10 మంది మహిళల బృందాన్ని కూడా ఏర్పాటు చేసింది. "వానాకాలం ముందు, తర్వాత నీరు తాగడానికి సురక్షితంగా ఉందని నిర్ధారించుకోవడానికి మేము పరీక్షిస్తాము. వివిధ ప్రాంతాలకు వెళ్లి పగిలిన పైపులను పరిశీలించి వెంటనే మరమ్మతులకు ఏర్పాట్లు చేస్తున్నాం. మేము pH పరీక్ష గురించి ఇతరులకు నేర్పుతాము. నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు సమాజ ఆరోగ్యానికి ఎంతో హానికరం" ఆమె అంటున్నారు.



బబితా లిరోలియా

మోడీ నోరు విప్పాలి

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఇటీవల మ్యూనిచ్‌లో జరిగిన సెక్యూరిటీ కాన్ఫరెన్స్‌లో భారత ప్రధానిపై సోరస్ విమర్శలు చేశారు. అదానీ గ్రూపు సంక్షోభాన్ని తన ప్రసంగంలో ప్రస్తావించిన సోరస్.. స్టాక్స్ విషయంలో అదానీ మోసాలకు పాల్పడినట్టు హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికపై పార్లమెంట్‌లో మోడీ వివరణ ఇవ్వాలని అన్నారు. అదానీ సంక్షోభం మోడీని బలహీనపరచనున్నట్లు సోరస్ అభిప్రాయపడ్డారు. అదానీ ఘటనతో వ్యవస్థీకృత సంస్కరణలు చేపట్టాల్సి వస్తుందన్నారు. భారత్‌లో ప్రజాస్వామ్య పునరుజ్జీవనం తప్పదన్నారు. భారత్, రష్యా నుంచి చాలా తక్కువ ధరతో చమురు కొనుగోలు చేసి దానిపై చాలా డబ్బు సంపాదిస్తోందని వ్యాఖ్యానించారు. హిండెన్‌బర్గ్ రిపోర్టు ఇచ్చిన తర్వాత జనవరి 24వ తేదీ నుంచి అదానీకి చెందిన ఏడు కంపెనీలు ఇప్పటి వరకు స్టాక్ మార్కెట్లలో బిలియన్లు కోల్పోయాయి.

సోరస్ ఆర్థిక నేరస్తుదు : బీజేపీ

జార్జ్ సోరస్ ఆర్థిక యుద్ధ నేరస్థుడని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఆరోపించారు. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌ను మోసం చేసి, ఆ దేశంతో ఆర్థిక యుద్ధ నేరస్థుడిగా పేర్కొనబడిన వ్యక్తి అని అన్నారు. సోరస్ మోడీపైనే కాకుండా దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేస్తున్నారని విమర్శించారు.

కేసీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ



(మొదటిపేజీ తరువాయి)

విన్ వోయెన్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, సినీ హీరో మహేశ్‌బాబు తదితరులున్నారు. మరోవైపు బీఆర్ఎస్ ప్రధాన కార్యాలయమైన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నేతృత్వంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో మానసిక వికలాంగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ భవన్ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కట్టెల శ్రీనివాస యాదవ్ తదితరలు పాల్గొన్నారు. కేసీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన అధికారిక నివాసమైన ప్రగతి భవన్‌లో అక్కడి సిబ్బంది సంబురాలను నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో సీఎం వ్యక్తిగత కార్యదర్శి వెంకట నారాయణ, సీపీఆర్వో వనం జ్వాలా నర్సింహారావు, పీఆర్వో రమేశ్ హజారీ తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌తోపాటు లండన్, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, ఒరిస్సాలో కూడా కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించినట్టు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

కేంద్రమంత్రుల్లో కిషన్‌రెడ్డి 'ఆణిముత్యం'.. కేటీఆర్ ఎద్దేవా

(మొదటిపేజీ తరువాయి)

చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ట్వీట్ చేశారు. తొమ్మిది వైద్య కళాశాలలిచ్చామంటూ కిషన్‌రెడ్డి, అసలు తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలే రాలేదంటూ మన్‌సుఖ్‌మాండవీయ, రెండు ప్రతిపాదనలొచ్చాయంటూ నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారని కేటీఆర్ గుర్తు చేశారు. అబద్ధాలనైనా ఎప్పుడూ ఒకేలా చెప్పే విధంగా కేంద్ర మంత్రులకు శిక్షణ ఇవ్వాలని ఈ సందర్భంగా మోడీని కేటీఆర్ కోరారు. అసలు తెలంగాణలోనే లేని తొమ్మిది వైద్య కళాశాలలను సృష్టించిన ఘనత కిషన్‌రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఆయుష్ పేరిట హైదరాబాద్‌లో ఓ కల్పిత గ్లోబల్ సెంటర్ ఫర్ ట్రెడిషనల్ మెడిసిన్‌ను కూడా ప్రకటించారని తెలిపారు. కేంద్రమంత్రులందరిలో కిషన్‌రెడ్డి ఆణిముత్యమంటూ ఎద్దేవా చేశారు.

అచ్ఛేదిన్ కాదు..అంధకారం

(మొదటిపేజీ తరువాయి)

విజయన్ అన్నారు.

జాతీయస్థాయిలో కిసాన్‌సభ ఏర్పడక ముందే బెంగాల్‌లో జిల్లా, రాష్ట్రస్థాయిలో ఆర్గనైజింగ్ కమిటీలు ఏర్పడి పెద్దఎత్తున ఉద్యమాలు చేశాయని గుర్తుచేశారు. 1943 నాటి వినాశకర బెంగాల్ కరువు సమయంలో రైతు సంఘాల ఆధ్వర్యాన వేర్వేరు ప్రాంతాల్లో సహాయక శిబిరాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. బెంగాల్లో తెబాగ ఉద్యమం దేశ రైతాంగ పోరాటానికి మచ్చుతునకనీ, రైతు ఉద్యమ పునాదిని బలోపేతం చేయడంతోపాటు దోపిడీని అరికట్టిందని అన్నారు.

కేంద్రం, రాష్ట్రాల మత రాజకీయాలు

నేడు కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్నవారు పూర్తిగా మతపరమైన రాజకీయాలు చేస్తున్నారని విజయన్ అన్నారు. విచ్చలవిడి అవినీతి జరగుతున్నదని చెప్పారు. ప్రజలకు చెందాల్సిన డబ్బంతా టీఎంసీ అనుకూలుర చేతుల్లోకి వెళుతున్నదనీ, మహిళలపై భయంకర హింసాకాండ జరుగుతున్నదని విజయన్ ఆందోళన వ్యక్తం చేశారు. వందలాదిమంది కార్యకర్తలు హత్యకు గురయ్యారనీ, ఎక్కువ మందిని వారి గ్రామాల నుంచి వెళ్లగొట్టారని తెలిపారు. అక్రమ రైతు చట్టాలను తీసుకొచ్చి కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలను ఏడాదికాలం జరిగిన రైతు పోరాటం వెనక్కు కొట్టిందని ఆయన అన్నారు.

వ్యవసాయంపై కేంద్రానిది చిన్నచూపు

వ్యవసాయం పట్ల కేంద్రానికి చిన్నచూపు ఉన్నదనీ, బడ్జెట్లోనూ అది కనిపించిందని చెప్పారు. 1991లో నయా ఉదారవాద విధానాలు అమల్లోకి తెచ్చిన తర్వాత వ్యవసాయం పూర్తి సంక్షోభంలోకి వెళ్లిందని విజయన్ తెలిపారు. సరళీకరణ ఆర్థిక విధానాల గురించి వామపక్షాలు తొలి నుంచీ హెచ్చరిస్తూనే ఉన్నాయన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కేరళ ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గంలో పయనిస్తోందని చెప్పారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో ముందుందనీ, మత ఘర్షణలు లేని రాష్ట్రంగా నిలిచిందని అన్నారు. పాఠశాల విద్య, శాంతి భద్రతలు, అతితక్కువ శిశు మరణాలు రాష్ట్రంలో ఉన్నాయని తెలిపారు. ఉపాధి కల్పనలోనూ ముందుందన్నారు. వేతనాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రమని వివరించారు.

రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

కేంద్రం రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నదనీ, ఫెడరలిజం అర్థాన్నే మార్చేస్తున్నదని తెలిపారు. రైతు, కార్మిక వ్యతిరేక బిల్లులు తీసుకొస్తున్నదనీ, కనీసం రైతుల అభిప్రాయాలూ తీసుకోవడం లేదని అన్నారు. ఒకే దేశం, భాష, ఒకే ఎన్నికలు అనే నినాదంతో సమాఖ్య వ్యవస్థను దెబ్బతీస్తున్నదని వివరించారు. బీజేపీ వ్యతిరేక రాష్ట్రాల్లో గవర్నర్‌ను ఉపయోగించి అక్కడ విద్యావ్యవస్థలో బీజేపీ అనుకూల విద్యావిధానాన్ని జొప్పిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

మత దేశంగా మార్చే ప్రయత్నాలు

స్వాతంత్ర్యకాలంలో ఏర్పడిన భిన్న సంస్కృతీ సంప్రదాయాల భావన నేడు ప్రమాదంలో పడిందని చెప్పారు. మత దేశంగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. దేశాన్ని దోచుకుతింటున్న వారికి అధికారపార్టీ అండగా ఉంటున్నదని వివరించారు. బీబీసీ కార్యాలయంపై దాడి చేశారనీ, మోడీపై ఒక వార్తను ప్రసారం చేసిందనే ఉద్దేశంతో మీడియా స్వేచ్ఛను హరిస్తున్నదని వివరించారు.

ఐక్యపోరాటాలు రావాలి

బీజేపీకి వచ్చిన ఓట్లతో పోలిస్తే దాన్ని వ్యతిరేకించేవారి ఓట్లే ఎక్కువగా ఉన్నాయనే విషయాన్ని మర్చిపోకూడదని విజయన్ అన్నారు. హిందూత్వ శక్తులపై విజయం సాధించాలంటే ప్రజల జీవనోపాధి సమస్యల ఆధారంగా ఐక్య పోరాటాలు రావాల్సి ఉందని తెలిపారు. వ్యవసాయ కార్మికులు, రైతులు జాతీయ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని, భవిష్యత్‌లో నిర్వహించే పోరాటాల్లో వారిపాత్ర కీలకమని అన్నారు. ఇటువంటి కీలక తరుణంలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ నూతన పోరాటానికి, రాజ్యాంగాన్ని కాపాడేందుకు నాంది పలుకాలని చెప్పారు.

ఏప్రిల్‌లో చలో ఢిల్లీ

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రకటించారు. పెద్దఎత్తున కలిసి రావాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు విజయరాఘవన్ మాట్లాడుతూ.. కేరళ పాలనను ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు, అక్కడ సామాన్య ప్రజలకు రక్షణ ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం, ఏఐకేఎస్ నాయకులు బిమన్‌బసు, వ్యవసాయ కార్మిక సంఘం బెంగాల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమియపాత్రో తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ ఎంసీహెచ్‌కు జాతీయ గుర్తింపు

(మొదటిపేజీ తరువాయి)

మొదటి ప్రభుత్వ దవాఖానాగా బాన్సువాడ ఎంసీహెచ్ రికార్డ్ సాధించింది. శిశువుల ఆరోగ్యం కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) 10 ప్రమాణాలను నిర్దేశించింది. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వం మదర్స్ అబ్జల్యూట్ అఫెక్షన్ (ఎంఏఏ) పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నది. ఈ ప్రమాణాలకు అనుగుణంగా బ్రెస్ట్ ఫీడింగ్‌ను ప్రోత్సహిస్తున్న దవాఖానాలను యూనిసెఫ్, బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్ నెట్వర్క్ ఆఫ్ ఇండియా (బీపీఎన్ఐ), అసోసియేషన్ ఆఫ్ హెల్త్ ప్రొవైడర్స్ ఇండియా (ఏహెచ్ పీఐ) సంయుక్తంగా ఎంపిక చేసి బీఎఫ్‌హెచ్ఐ అక్రిడేషన్ ఇస్తున్నాయి. ఈ సర్టిఫికెట్ మూడేండ్ల పాటు అమల్లో ఉంటుంది.

బిడ్డ పుట్టిన అరగంటలోనే ముర్రుపాలు తగ్గించడంతో పాటు ఆరు నెలలపాటు తల్లిపాలు మాత్రమే తాగించాలని నిపుణులు సూచిస్తున్నారు. తద్వారా ఐదేండ్ల లోపు పిల్లల మరణాలను 22 శాతం నివారించవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం బ్రెస్ట్ ఫీడింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది. వైద్య సిబ్బంది, ఆశాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నది. బీపీఎన్ఐ సహకారంతో 35 మంది మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇచ్చింది. ప్రత్యేకంగా దేశంలోనే మొదటిసారిగా "వాలంటరీ లాక్టేషన్ వర్కర్స్"ను నియమించింది. వీరు ఆస్పత్రుల్లో గర్భిణులకు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించడంతోపాటు ప్రసవమైన అరగంటలోనే పిల్లలకు ముర్రుపాలు పట్టిస్తున్నారు. ప్రస్తుతం బాన్సువాడ ఎంసీహెచ్‌లో ముగ్గురు వాలంటీర్లు ఉన్నారు. రెండు దఫాల పరిశీలన అనంతరం, ఢిల్లీ నుంచి ఇటీవల వచ్చిన ప్రత్యేక బృందం బాన్సువాడ ఎంసీహెచ్‌ను సందర్శించింది. అన్ని రకాల ప్రమాణాలు పాటిస్తున్నట్టు నిర్ధారించుకొని.. అక్రిడిటేషన్ మంజూరు చేసింది. ప్రస్తుతం దేశంలో ప్రభుత్వ, ప్రయివేటు కలిపి నాలుగు ఆస్పత్రులకు మాత్రమే ఈ అక్రిడిటేషన్ ఉంది.

మంత్రి అభినందనలు

బాన్సువాడ ఎంసీహెచ్‌కు బీఎఫ్‌హెచ్ఐ అక్రిడేషన్ రావడం పట్ల వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్య సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మొక్కలు నాటిన హరీశ్‌రావు

నవతెలంగాణ -గజ్వేల్

సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా గజ్వేల్‌లో వినూత్న కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు శ్రీకారం చుట్టారు. గజ్వేల్ రింగు రోడ్డు చుట్టూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి, గజ్వేల్ శాసనసభ్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు 69వ జన్మదిన వేడుకల సందర్భంగా గజ్వేల్‌లో గల్లీగల్లీలో వేడుకలను ప్రజల సమక్షంలో నిర్వహించడం దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రూ.300 కోట్లతో 24 కిలోమీటర్ల దూరంతో చేపట్టిన గజ్వేల్ రింగ్ రోడ్డు మరో నెల రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో చైర్మెన్ శ్రీనివాస ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సైకా చిత్రపటం అందరిని ఆకర్షిస్తుందన్నారు. రక్తదాన శిబిరాలు, అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి గజ్వేల్ ప్రజలు, ప్రజాప్రతినిధులు సీఎంపై అత్మాభిమానాన్ని చాటుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఎస్పీ శ్వేత, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ డా.యాదవ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజా శర్మ, గజ్వేల్ స్పెషల్ అధికారి ముత్యం రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి, గ్రంథాల అభివృద్ధి సంస్థ చైర్మెన్ లక్కిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, వైస్ చైర్మెన్ జాకీర్, ఆత్మ కమిటీ చైర్మన్ చైర్మెన్ కష్టారెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీపై మరో కత్తిపోటు

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే ఏబీపీఎస్ సౌకర్యం ఉంది.

ఉపాధి హామీ అమలును నిశితంగా పరిశీలిస్తున్న జీన్ డ్రేజ్ వంటి ఆర్థికవేత్తలు, 57శాతం మంది కార్మికులు ఆధార్-ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఏబీపీఎస్)లో భాగం కారని చెప్పారు. ఇది సంక్లిష్ట నమోదు ప్రక్రియని పేర్కొంటున్నారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 100 రోజుల వరకు పని కల్పించే జాతీయ ఉపాధి పథకం కింద ప్రజలను పని డిమాండ్ చేయకుండా నిరోధించడానికి మోడీ ప్రభుత్వం తీసుకున్న మరో అడుగు అని అంటున్నారు. ఇప్పుడు కార్మికులకు బ్యాంకు, పోస్టల్ ఖాతాల ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారు. ఎబిపిఎస్‌ని అనుసరించడం గజిబిజిగా ఉండే ప్రక్రియ అని ఆర్థికవేత్త డ్రెజ్ అన్నారు. కొత్త వ్యవస్థను ముందుకు తీసుకురావడం వెనుక హేతుబద్ధతను ఆయన ప్రశ్నించారు. "సాధారణ బ్యాంకు ఖాతాలకు చేసిన చెల్లింపు కంటే ఎబిపిఎస్ ద్వారా చెల్లింపు మెరుగ్గా ఉంటుందని ఎటువంటి ఆధారాలు లేవు. ఇది మెజారిటీ కార్మికులకు పని లేకుండా చేసే నిర్లక్ష్య నిర్ణయం" అని ఆయన అన్నారు. "ఎబిపిఎస్‌తో చాలా సంక్లిష్టత ఉంది. అందుకే చాలా మంది కార్మికులు ఇంకా చేయలేదు"అని డ్రెజ్ తెలిపారు. ఆన్‌లైన్ హాజరు తప్పనిసరి అనే కొత్త విధానంతో ఉపాధి హామీ కార్మికులు ఇప్పటికే ఎదుర్కొంటున్న సమస్యలను కార్యకర్త నిఖిల్ డే ఎత్తి చూపారు. "పని ప్రదేశంలో కార్మికుడి ఫోటో తీయాలి. మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ ప్రక్రియ అస్తవ్యస్తమైన ఇంటర్నెట్ కనెక్టివిటీ కారణంగా నిలిచిపోయింది" అని అన్నారు.

మీ పేర్లు చేర్చం..

(మొదటిపేజీ తరువాయి)

కదలికలపైనా దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపింది.సుప్రీంకోర్టు ఫిబ్రవరి 10న నిర్వహించిన విచారణ సందర్భంగా, అదానీ గ్రూప్ స్టాక్ పతనం నేపథ్యంలో మార్కెట్ ఒడిదుడుకుల నుంచి భారతీయ పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడవలసిన అవసరం ఉందని తెలిపింది. దేశంలోని నియంత్రణ వ్యవస్థలను పటిష్ట పరచడానికి తీసుకోవలసిన చర్యలను సిఫారసు చేసేందుకు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఓ డొమైన్ ఎక్స్‌పర్ట్స్ కమిటీని ఏర్పాటు చేయడంపై పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి తెలిపింది. హిండెన్‌బర్గ్ నివేదిక జనవరి 24న విడుదలైంది. ఆ తర్వాత అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. గౌతమ్ అదానీ నేతృత్వంలోని ఈ కంపెనీలు ఇప్పటి వరకు 120 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువను కోల్పోయాయి.

గోరక్షకుల దాష్టీకం

(మొదటిపేజీ తరువాయి)



(ఫైల్)

పోలీసులకు ఫిర్యాదు చేశాయి. నజీర్, జునాలను అపహరించుకుపోయిన వారు బజరంగ్‌దళ్‌కు చెందినవారు అని తమ ఫిర్యాదులో పేర్కొన్నాయి. ఈ ఘటనకు సంబంధించి 12 మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని భరత్‌పూర్ రేంజ్ ఐజీ గౌరవ్ శ్రీవాస్తవ అన్నారు. ఎఫ్ఐఆర్‌లో పేర్లు నమోదైనవారు బజరంగ్ దళ్‌కు చెందినవారేననీ తెలిపారు. నిందితులపై ఐపీసీలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు భరత్‌పూర్ జిల్లా ఎస్పీ శ్యామ్ సింగ్ చెప్పారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నదని తెలిపారు. ఈ ఘటనపై రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ స్పందించారు. ఘటనను ఖండిస్తున్నట్టు ట్వీట్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని రాజస్థాన్ పోలీసులను ఆదేశించినట్టు చెప్పారు. రాష్ట్ర మంత్రి ఝహీదా ఖాన్ ఘట్మీకా గ్రామానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ దారుణ ఘటనను మైనారిటీ లీడర్లు, సామాజికవేత్తలు, పౌరహక్కుల కార్యకర్తలు ఖండించారు. నిందితులను కఠినంగా శిక్షించాలనీ, హిందూత్వ శక్తుల ఉన్మాద చర్యలకు అడ్డుకట్ట వేయాలని పిలుపునిచ్చారు. కాషాయమూకలు శాంతియుతంగా ఉన్న వాతావరణాన్ని చెడగొట్టి ప్రజల మధ్య మతపరంగా విభేదాలు తెచ్చే కుట్రలకు తెరలేపుతున్నారనీ, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

సాహితీ పురస్కారాలకు సూచనలు పంపండి

నవతెలంగాణ-కల్చరల్

ప్రతీ సంవత్సరం వలెనే 2021 సంవత్సరానికి గాను తెలుగు విశ్వవిద్యాలయం వివిధ ప్రక్రియలలో పురస్కర ఎంపిక కు సూచనలు పాఠకులు, రచయితలు నుంచి కోరుతున్నట్టు రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ప్రకటించారు. 2018 జనవరి నుంచి 2020 డిసెంబర్ వరకు వెలువడిన వచన కవిత, పద్య కవిత,బాల సాహిత్యం, నవల, నాటకం లేదా నాటికల సంపుటి, సాహిత్య విమర్శ, అనువాద సాహిత్యం, వచన రచన, రచయిత్రి ఉత్తమ గ్రంథం పది విభాగాల్లో సూచనలను రిజిస్టర్, తెలుగు విశ్వవిద్యాలయం,హైదరాబాద్ 500004 కు 20 మార్చి 2023 లోగా పంపాలి. సూచన లో రచయిత పేరు, గ్రంథం పేరు, ప్రక్రియ పేరు, చిరు నామా, పేజీ ల సంఖ్య ప్రచురణ సంవత్సరం, ప్రచురణ కర్త పేరు తెలపాలి. గ్రంథ రచయితలు కూడా తమ గ్రంథ వివరాలు పరిశీలన కోసం పంపవచ్చు. ఇతర వివరాలు విశ్వవిద్యాలయం కార్యాలయంలో తెలుసు కోవచ్చని ఆచార్య రమేష్ తెలిపారు.

ఘనంగా ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-వనస్థలిపురం

బంగారు తెలంగాణే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, సోనీ,పద్మ , వెన్నెల, రామేశ్వరమ్మ రవికుమార్, పరమేష్ రాంబాబు, రామకృష్ణ,



సురేష్,రాజేందర్,ధీరజ్ ,భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఏండ్లు గడుస్తున్నా అభివృద్ధికి ఆమడ దూరం

- కాలనీలో డ్రయినేజీలు, రోడ్లు లేవు
- దుర్వాసనతో రోగాల బారిన పడుతున్న జనం

నవతెలంగాణ-బడంగ్‌పేట్

కాలనీ ఏర్పడి ఎన్నో ఎండ్లు గడుస్తున్న అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ప్రభుత్వాలు మారిన ప్రజా ప్రతినిధులు మారిన కాలనీ అభివృద్ధిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కాలనీలో ఎక్కడ సరియైన డ్రయినేజీలు, రోడ్లు కనిపించవు. అంతేగాక ఎక్కడ చూసిన రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీరు ప్రజలు దుర్గంధపు వాసనతో రోగాల బారిన పడుతున్నారు. అది ఎక్కడో కాదు హైదరాబాద్ నగరానికి అనుకొని ఉన్న మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని వాది హే హుదా కాలనీ. ఈ కాలనీ ఏర్పడి ఎన్నో ఎండ్లు గడుస్తున్న నేటికీ ఈ కాలనీ అభివద్ధికి ఆమడ దూరంలో ఉంది. ప్రభుత్వాలు మారిన ప్రజా ప్రతినిధులు మారిన కాలనీ వాసులకు మౌలిక సదుపాయాలు కల్పనను ఎవ్వరు పట్టించుకోవటం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ఎక్కడ చూసిన రోడ్లపై పారుతున్న



మురుగునీరుతో పాటు దుర్వాసనతో దోమలకు నిలయాలుగా మారడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. కనీసం రోడ్డు సౌకర్యమూ లేదని, రాత్రి సమయంలో ఇంటిలో నుంచి బయటకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. విద్యుత్ దీపాలు, తాగునీటి సౌకర్యం కూడా సక్రమంగా అమలు చేయడంలో ప్రజా ప్రతినిధులు, అధికా రులు విఫలమైనట్టు కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కారం చేయాలని ఎన్నోసార్లు ప్రజా ప్రతినిదు లకు, అధికారులకు మొరపెట్టుకోన్న ఎవరూ పట్టించుకోవటంలేదని, ఇప్పటి కైన జిల్లా ప్రజా ప్రతినిధులు అధికారులు స్పదించి ప్రత్యేక నిధులు మంజూరు చేసి.. మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలి : కాలనీ అధ్యక్షులు హుస్సేన్

కాలనీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. డ్రయినేజీలు, సీసీ, బీటీ రోడ్లు లేవు, ప్రతి నిత్యం ఇండ్ల నుంచి వచ్చే మురుగునీరు కాలనీ రోడ్డుపై ప్రవహించి దుర్వాసన వస్తున్నది.

మున్సిపల్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం : మున్సిపల్ కమిషనర్ వసంత

మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులో ఉన్న కాలనీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేకంగా కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించారు. త్వరలో కాలనీలో డ్రయినేజీలు, రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రదాత, కార్యదీక్షాపరుడు కేసీఆర్

నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లెలగూడ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 1008 కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం లలిత నగర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి.. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రదాత, కార్యదీక్షాపరుడు కేసీఆర్ అని కొనియాడారు. దేశ్ కి నేత భావి భారత ప్రధానిగా.. త్వరలో కావడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జటావత్ శ్రీను నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్, స్థానిక కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



వీధికుక్కల స్పెషల్ డ్రైవ్ నిర్వహించండి

కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి

నవతెలంగాణ-వనస్థలిపురం

హయత్‌నగర్ డిజిజన్‌లోని ప్రతి కాలనీలో వీధి కుక్కలకు సంబంధించిన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేశారు. డ్రైవ్‌లో పట్టుకున్న కుక్కలను ప్రజలకు దూరంగా విడిచి పెట్టాలని ఆయన కోరారు. ఈ మేరకు శుక్రవారం డివిజన్ పరిధిలోని కమల నగర్‌లో వీధి కుక్కలతో కాలనీ వాసుల ప్రాణాలకు హానికరంగా మారాయని సమాచారం అందడంతో వెంటనే అక్కడికి కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి చేరుకున్నారు. కాలనీవాసులతో మాట్లాడారు. వెంటనే సమస్యను పరిష్కరించారు. దీంతో కాలనీ వాసులు ఊపిరి పిల్చుకున్నారు.



ఫ్లైఓవర్‌ను వెంటనే ప్రారంభించాలి



- దర్పల్లి రాజ శేఖర్ రెడ్డి

నవతెలంగాణ-ఎల్బీనగర్

ఎల్బీనగర్ చౌరస్తాలో నిర్మించిన ఫ్లైఓవర్‌ను వెంటనే ప్రారంభించి.. ప్రజల ఇబ్బందులను తొలగించాలని లింగోజీ గూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజ శేఖర్ రెడ్డి కోరారు. శుక్రవారం ఎల్బీనగర్‌లోని ఫ్లైఓవర్‌ను వివిధ కాలనీ వాసులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దర్పల్లి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ.. అభివద్ధి ఎక్కడ ఆగకూడదని స్థానిక ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి వ్యాఖ్యల పట్ల కార్పొరేటర్ రాజశేఖర్ రెడ్డి విస్మయం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చెప్తున్న మాటలకు.. కట్టుబడితే వెంటనే పూర్తయిన ఎల్బీనగర్ ఫ్లైఓవర్ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి.. ట్రాఫిక్ అంతరాయం లేకుండ చూడాలని కోరారు.

ఫ్లై ఓవర్ పనులు పూర్తయిన సందర్భంగా.. వాహనాలు వెళ్లే విధంగా అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రారంభోత్సవ వేడుకలు ముహూర్తం చూసుకోని ఘనంగా జరుపుకోవచ్చునని, వెంటనే ఫ్లైఓవర్‌పై అడ్డంగా ఉన్న బారికేడ్లను తొలగించి వాహనాలకు అనుమతించాలని జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి కోరారు.

శానిటేషన్ పట్ల జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం

నవతెలంగాణ-వనస్థలిపురం

కమలానగర్, భూ లక్ష్మీ నగర్, హుడా సాయి కాలనీ, ఆటో సాయినగర్, హైకోర్టు కాలనీతోపాటు పలు కాలనీలో సరిపడా పారిశుధ్య కార్మికులు, అవసరమైనటు వంటి యంత్రాంగాలు లేకపోవడంతో కాలనీలో ఎక్కడిక క్కడ చెత్తాచెదారం పేరుకుపోవడంపై స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులపై మండిపడ్డారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారంతో దుర్వాసన, దోమలు విజృంభిస్తున్నాయని, ఇది కాలనీ వాసుల ఆరోగ్యానికి హానికరంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారులు ఇప్పటికైనా జనాభా సంఖ్యకు అనుగుణంగా పారిశుద్ధ కార్మికులను విధులోకి తీసుకోవాలని, సరిపడా యంత్రాలను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. అదేవిధంగా పారిశుద్ధ్య సూపర్‌వైజర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించేలా చూడాలని అధికారులకు సూచించారు.



కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రానికి పునర్వైభవం



- డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి

నవ తెలంగాణ- సరూర్‌నగర్

కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రానికి పునర్ వైభవం వస్తుందని రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి అన్నారు.శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో అభియాన్ పాదయాత్రలో భాగంగా మూడవ రోజు రామకృష్ణాపురం డివిజన్‌లో యాదవ్ నగర్ కాలనీలో గడప గడపకు తిరుగుతూ కరపత్రాలు అందజేస్తూ.. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయంతో గెలుపొందుతుందని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, బడంగ్‌పెట్ మున్సిపల్ కార్పొరేషన్ నాయకులు చిగురింత నర్సింహారెడ్డి, బంగారు బాబు, వంగేటి ప్రభాకర్ రెడ్డి, రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత , నల్లెంకి ధనరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భాష్యం లిటిల్ చాంప్స్ 12వ వార్షికోత్సవం

నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురంలోని భాష్యం లిటిల్ చాంప్స్ 12వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవంలో చిన్నారులు వివిధ రకాల నృత్య ప్రదర్శనలు చేసి వీక్షితులను ఆకట్టుకున్నారు. ఈ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిలుగా చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.శ్రీధర్, సైకాలజిస్ట్ డాక్టర్ శోభ విచ్చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థు ల్లో నైపుణ్యతను చూసి ఎంతగానో అభినందించారు. విద్యా సంబంధమైన, హాజరు, చేతిరాత ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు వారు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ అంకమ్మరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యా యురాలు సుజాత, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు హేమంత్ లక్ష్మి. విద్యార్థుల నైపుణ్యతను చూసి అభినందించారు.



భరోసా సెంటర్‌ను సందర్శించిన కెనడా కాన్సులేట్ జనరల్ ప్రతినిధి బృందం



నవతెలంగాణ-సిటీబ్యూరో

కెనడాకు చెందిన కాన్సులేట్ జనరల్ ప్రతినిధి బృందం శుక్రవారం బంజారాహిల్స్‌లోని (టీఎస్‌పీఐసీసీసీ) తెలంగాణ స్టేట్ పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. భరోసా సెంటర్‌ను సందర్శించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ పనివిధానాన్ని అడిగి తెలుసుకున్నారు. సీపీ కెమెరాల అనుసంధానంతో వస్తున్న ఫలితాలను సీపీ సీవీ ఆనంద్ వారికి వివరించారు. అత్యాధునిక టెక్నాలజీతో నేరాల కట్టడి, నేరస్తుల నివారణకు చేపడుతున్న చర్యలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు టీఎస్‌పీఐసీసీసీపై సంతృప్తిని వ్యక్తం చేశారు. హైదరాబాద్ పోలీసులు తీసుకుంటున్న చర్యలను ప్రత్యేకంగా అభినందించారు.

త్వరలో వాహనాల వేలంపాట

ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వరు

నవతెలంగాణ-హయత్‌నగర్

ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనివార్య కారణాల వల్ల పలు కేసుల్లో ఉన్న ద్విచక్రవాహనాలను త్వరలో వేలం వేయనున్నామని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మొత్తం 21 గుర్తు తెలియని బైకులు ఉండగా.. వీటిని వేలం వేస్తామని ఆయన చెప్పారు. సదరు బైక్ యజమానులు వచ్చి తమ వాహన పత్రాలు చూపించి వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లు క్లియర్ చేసి తీసుకు వెళ్లాలని, లేనిపక్షంలో ఈ వాహనాలను త్వరలోనే వేలం వేస్తామని ఆయన తెలిపారు. మరింత సమాచారం కోసం ఫోన్: 04027853927కు సంప్రదించాలని సూచించారు.

మలిపెద్దికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన మేయర్

నవతెలంగాణ-బోడుప్పల్

మాజీ శాసన సభ్యులు మలిపెద్ది సుధీర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను అభిమానులు, కార్యకర్తల సమక్షంలో ప్రతాపసింగారంలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నేతలు అధిక సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.



బాల్యాన్ని తీర్చిదిద్దుతే భవిష్యత్తు అద్భుతం

నవతెలంగాణ-బోడుప్పల్

బాల్యాన్ని తీర్చిదిద్దుతే పిల్లల భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని బచ్ పన్ స్కూల్ రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు..ఉప్పల్ (మల్లిఖార్జున నగర్)బచ్ పన్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు బాగ్ లింగంపల్లిలోని ఆర్.టి.సి. కళాభవన్ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు సరికొత్త విద్య తీసుకొచ్చి వారి భవిష్యత్తుకు బాటలు బచ్ పన్ తోనే సాధ్యమయిందని తెలిపారు..దీనిని రాష్ట్రం మొత్తం వ్యాపింపచేసి అందరికి మెరుగైన విద్యను అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఆపరేషన్ అండ్ టెక్నికల్ రీజినల్ డైరెక్టర్ కేశిక్ రెడ్డి మాట్లాడుతూ మూసపాటి విద్యవిదానంతో కాకుండా విద్యార్థుల ఆలోచనలు ఏవిదంగా ఉన్నాయో గుర్తించి దానికి అనుగుణంగా బోదించాలని తెలిపారు. డైరెక్టర్ అకాడమిక్స్ రూపారెడ్డి,రీజినల్ అకాడమిక్ కో-ఆర్డినేటర్ సునీత,ఉప్పల్ స్కూల్ అడ్మినిస్ట్రేషన్ ఇంచార్జీలు ప్రవీణ లక్ష్మి ,హేమ,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు















నవతెలంగాణ-సరూర్‌నగర్

సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షులు మహేందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అనిత దయాకర్‌రెడ్డి, సుదర్శన్ ఆధ్వర్యంలో శుక్రవారం చెరుకుతోట కాలనీ, ప్రాథమిక పాఠశాల, ఉర్దూ మీడియం స్కూల్, మాజీ కార్పొరేటర్ అనిత దయాకర్ రెడ్డి నివాసం వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బేరా బాలకిషన్ (బాలన్న), యువజన విభాగం మాజీ అధ్యక్షుడు లోక్సాని కొండల్ రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షులు ఇంటూరి అంకిరెడ్డి, సిరిపురం రాజేష్ గౌడ్, ఇస్మాయిల్, సిలివేరు వెంకట్ గౌడ్ పాల్గొన్నారు.

ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో శుక్రవారం చిత్రా లే అవుట్‌లోని అనాథ విద్యార్థి వసతి గృహంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్, బీరెల్లి వెంకటరెడ్డి, రామ చారి, శ్రీనివాస్‌రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, ఎం.ఎ.సాజిద్, జగిని, రమేష్ గుప్తా, పాల్గొన్నారు.

హస్తినాపురం : హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గజ్జెల మధు సూధన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఆందోజ్ సత్యం చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ మేరెడ్డి ఉదయ్ కుమార్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ నాగిరెడ్డి, సీనియర్ నాయకులు రఘుమా రెడ్డి,గోపిరెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి, నారగోని శ్రీనివాస్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, కంచర్ల శివా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోడుప్పల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం పీర్జాదీగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కీసర గుట్టలో మొదట పూజలు నిర్వహించి రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డిలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పీర్జాదీగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్పొరేటర్లతో కలిసి కేక్ కటింగ్ చేసి వేడుకలు వైభవంగా నిర్వహించారు.

బడంగ్ పేట్‌లో : అధ్యక్షులు రాంరెడ్డి.మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రాష్ట్ర విద్య శాఖ మంత్రి పి.సబిత ఇంద్రా రెడ్డి ఆదేశం మేరకు శుక్రవారం సీఎం కేసీఆర్ జన్మదినం వేడుకలు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సూర్లగంటి అర్జున్, యాతం పవన్ కుమార్ యాదవ్, సంరెడ్డి స్వప్న వెంకట్ రెడ్డి, లిక్కీ మమత కష్టారెడ్డి,ముత్యాల లలిత కృష్ణ, కోఆప్షన్ సభ్యులు రఘునందనాచారి,గుర్రం ప్రసన్న వెంకట్ రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బోడుప్పల్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కారణ జన్ముడు అని.. నేడు దేశానికే దిక్సూచిగా నిలిచిన మహా నాయకుడని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను బోడుప్పల్ అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగులకు నిత్యావసర వస్తువులను అందించారు. అనంతరం మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిర్విరామంగా పోరాటం చేసిన మహానాయకుడు కేసీఆర్ అని.. నేడు దేశానికే దిక్సూచిగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ గౌడ్, కార్పొరేషన్ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సరూర్ నగర్ : తెలంగాణ జాతిపిత కేసీఆర్ జన్మదినం సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన వేడుకల్లో మహేశ్వరం బీఆర్ఎస్ మైనార్టీ సీనియర్ నాయకుడు, ఉద్యమ నాయకుడు మహమ్మద్ సలీం పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ భవన్ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎడ్ల మహేందర్ గౌడ్, కె. మల్లేష్ పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-తుర్కయాంజల్

ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పుట్టినరోజు వేడుకలు తుర్కయంజాల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వేముల అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపాలిటీలో గల కేర్ వారియర్స్ ఫౌండేషన్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిదులుగా రంగారెడ్డి జిల్లా రైతుబంధు అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కందాడ ముత్యంరెడ్డిలు హాజరై అనాథ పిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం పిల్లలకి పండ్లు పంపిణీ చేసి వారితో కలిసి అల్పాహారం చేశారు. సాయంత్రానికి భోజనం ఏర్పాట్లు చేస్తామని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ కళ్యాణ్ నాయక్, అబ్దుల్లాపూర్ మెట్ మండల రైతు కన్వీనర్ కందాల బలదేవా రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండూరి వెంకటేష్, యూత్ అధ్యక్షుడు కొత్తకుర్మ కార్తీక్, కౌన్సిలర్లు భాగ్యమ్మ-ధనరాజ్, కీర్తన-విజయ్ ఆనంద్ రెడ్డి, వేముల స్వాతి-అమరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చెవుల దశరథ, నాయకులు రొక్కం ప్రభాకర్ రెడ్డి, పొలిశెట్టి ప్రేమ్ కుమార్, నక్క రమేష్ గౌడ్, కొండ్రు శ్రీనివాస్, మర్రి సంపతీశ్వర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ ప్రధాని కావాలి

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్తా.

నవతెలంగాణ-నాగోల్.

తెలంగాణ రాష్ట్ర ప్రదాత, అపర భగీరథుడు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ భవిష్యత్తు లో దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తూ దేశ ప్రధాని అయ్యి నిరుపేదల గోస తీర్చాలని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాసగుప్త కోరారు.శుక్రవారం కేసీఆర్ జన్మదిన పురస్కరించుకొని నాగోలులోని వాత్సల్య ఫౌండేషన్ అనాథ ఆశ్రమం కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఉప్పల శ్రీనివాస గుప్త పాల్గొని ఆశ్రమంలోని చిన్నారులతో కలిసి జన్మదిన కేకును కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం చిన్నారులందరికీ ఉప్పల్ శ్రీనివాస గుప్త ఉదయం అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అన్ని వర్గాలకు బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం సమాన హక్కులను కల్పిస్తుందని ఆయన తెలిపారు . దేశంలోని రైతులు బీదల బాధలు తెలిసిన ఒకే ఒక నాయకుడు తెలంగాణ సీఎం కేసీఆర్ అని అటువంటి వ్యక్తి దేశ రాజకీయాల్లో పెళ్లి ప్రధాని అయితే దేశం ఎంత బాగుపడుతుందోనని అర్థం చేసుకోవాలని అన్నారు. భవిష్యత్తుపై ముందు చూపు ఉన్న కేసీఆర్ బి ఆర్ ఎస్ తో జాతీయ రాజకీయాల్లో రానిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



నవతెలంగాణ 7
మల్కాజిగిరి
శనివారం 18 ఫిబ్రవరి 2023

బైక్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ నాచారం

రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని బైక్ ఢీకొనడంతో అతను గాయాలపాలై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గుర్తు తెలియని వ్యక్తి(50) ఈ నెల 12వ తేదీన రాత్రి పది గంటల సమయంలో మల్లాపూర్ నోమ థియేటర్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం (టీఎస్ 08 జేజీ 4584) అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దాంతో అతనికి తీవ్ర గాయాలై రక్తస్రావం కావడంతో వెంటనే స్థానికులు సహాయంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం మరణించినట్టు వైద్యులు వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హాత్ సే హాత్ జోడోయాత్రలో పాల్గొన్న శ్రీకాంత్ గౌడ్



నవతెలంగాణ-నాచారం

ఎంపీ, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సారథ్యంలో నిర్వహిస్తున్న హాత్ సే హాత్ జోడో యాత్రలో కాంగ్రెస్ మల్లాపూర్ డివిజన్ యూత్ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలు, రైతులు, బడుగు బలహీన వర్గాల ప్రజల పడుతున్న గోస తెలుసుకునేందుకు రేవంత్ రెడ్డి హాత్ సే హాత్ జోడోయాత్ర కొనసాగిస్తూ ప్రజలతో మమేకమవుతూ పేదల కష్టాలను తెలుసుకుంటున్నారన్నారు. రేవంత్ రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి సారథ్యంలో కొనసాగుతున్న హాత్ సే హాత్ జోడోయాత్ర ప్రజల కష్టాలు తీర్చే యాత్రగా అభివర్ణించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు, పేద ప్రజలపై మోపుతున్న పెను భారాన్ని తెలుసుకొని రాబోయే కాలంలో ప్రజలకు అండగా నిలిచేందుకు రేవంత్ రెడ్డి చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రకు సకల జనం సంఘీభావం ప్రకటించి ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులు సంస్కృతి సంప్రదాయాలను అలవర్చుకోవాలి

- జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు కె. కృష్ణదేవ్ రావ్
- జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ రాంపల్లిలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు





నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

విద్యార్థులు చదువుతో పాటు విలువలు, సంస్కృతి సంప్రదాయాలను అలవర్చుకోవాలని జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ కె. కృష్ణదేవ్ రావ్ అన్నారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ రాంపల్లిలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ కె. కష్ణదేవ్ రావ్ , జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ,జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ రాంపల్లి శాఖ చైర్మెన్ టి. హరిశ్చంద్ర ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ప్రసన్న లక్ష్మి స్వాగతోపన్యాసం చేస్తూ ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణదేవ్ రావ్‌ను సభకు పరిచయం చేశారు. 2016 లో ప్రారంభమైన ఈ పాఠశాలలో క్యాంటీన్, ఆర్గానిక్ ఫామ్, సి.సి టివి, విశాలమైన క్రీడా ప్రాంగణం ,మినరల్ వాటర్ సదుపాయాలున్నాయని తెలిపారు. అదే విధంగా అనతి కాలంలో పాఠశాలకు లభించిన పురస్కారాలను, పాఠశాల సాధించిన ఘనతను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. చదువుతో పాటు విద్యార్థులకు విలువలు, సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. హరిశ్చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభివృద్ధికి కషి చేస్తున్నందుకు అభినందిస్తూ, ప్రతీ తరగతి విద్యార్థులు సాంస్కతిక కార్యక్రమాల్లో పాల్గొని వికాసాభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో పేరెంట్ డే వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే విద్యార్థుల ప్రగతి పథంలో తల్లిదండ్రుల పాత్ర కూడా ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు కూడా బాగా చదివి సమాజంలో వృద్ధి చెందాలని సూచించారు. జూబ్లీ హిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ కృష్ణదేవ్ రావ్ మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని సదుపాయాలను కల్పించే వనరుగా ఉండాలని, విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న అంశాన్ని ఎంచుకుని దానిలో ప్రగతిని సాధించాలని తెలిపారు. అలాగే తల్లిదండ్రులు విద్యార్థులకు వివిధ అంశాల పట్ల అవగాహనను ఏర్పరచాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అపర భగీరథుడు, అభివృద్ధి ప్రదాత కేసీఆర్

- ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



నవతెలంగాణ-మల్కాజిగిరి

అపర భగీరథుడు, అభివృద్ధి ప్రదాత కేసీఆర్ అని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శుక్రవారం సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఆనంద్ భాగ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం దగ్గర ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్,సునీత రాముయాదవ్,మీనా ఉపేందర్ రెడ్డి,శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా కిషోర్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, నాయకులు జీఎన్‌వీ సతిష్ కుమార్, పిట్ల శ్రీనివాస్, రాముయాదవ్, గుండా నిరంజన్, ఉపేందర్ రెడ్డి, ఆమీనుద్దిన్, సంతోష్ రాందాస్, మోహన్ రెడ్డి, సత్తయ్య, పీవీ సత్యనారాయణ, నర్సింగ్ రావు, సూరి, సందీప్ గౌడ్, కన్నాతదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో సమ్మర్ క్యాంపుల నిర్వహణకు సన్నాహాలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డ్ ప్రాంతంలో సమ్మర్ హాకీ క్యాంపు నిర్వహించేందుకు శుక్రవారం బోర్డు సీఈవో నామినేటెడ్ సభ్యుడు జయరామకృష్ణులు క్రీడాకారులతో కలిసి బోర్డ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోర్డు పరిధిలో ఉన్న అన్ని గ్రౌండ్లలో ఈ సమ్మర్ క్యాంపులను నిర్వహించేందుకు తీర్మానించారు అంతేకా కుండా నిష్ణాతులైన క్రీడాకారుల సలహాలు సూచనలు తీసుకుని ఈ క్రీడలను నిర్వహించాలని తీర్మానించారు. బొల్లారం బోయిన్‌పల్లి మాడ్ ఫోర్ట్ గ్రౌండ్‌లతో పాటు మరి ఇతర గ్రౌండ్‌లో కూడా ఈ సమ్మర్ కోచింగ్‌లు నిర్వహి స్తారని పేర్కొన్నారు. హాకీ ఒలింపిక్స్‌లో 3 సార్లు భారత దేశానికి ప్రాతినిధ్యం వహించిన ముఖేష్ (అర్జున్ అవార్డు గ్రహీత), అనుప్ (స్కేటింగ్) అర్జున్ అవార్డు గ్రహీత, అముల్‌రాజ్ (మాజీ ఇండియన్ ఫుడ్ బాల్ ప్లేయర్), రంజిత్ (హైదరాబాద్ ఫిట్‌నెస్ కోచ్) భరత్ (ఖరాటే పోలీస్ అకాడమీ), సాయి యాదవ్ (రెజ్లర్), జనార్దన్ (వాలీబాల్), నాగరాజ్ (బ్యాడ్మింటన్), హరీష్ (క్రికెట్ కోచ్) దిలీప్ (క్రికెట్ కోచ్), బాదల్ (బాడీ బిల్డర్), వినోద్ కుమార్ (హాకీ), అనిల్ (హాకీ), మోహన్ (బిఎస్ఎన్ఎల్ ఫుట్‌బాల్ ప్లేయర్ కోచ్‌లు పాల్గొన్నారు.

నామినేటడ్ సభ్యుడు రామకృష్ణ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ బోర్డ్ ప్రాంతంలో మొదటిసారిగా సమ్మర్ క్రీడలు నిర్వహిస్తున్నారని, యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కంటోన్మెంట్ క్రీడలను ప్రోత్సహించేందుకు సమ్మర్ కోచింగ్ ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చిందని అంతే కాకుండా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా కంటోన్మెంట్ క్రీడలను ప్రోత్సహించేందుకు నడుము కట్టారు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఖేల్ ఇండియా ద్వారా క్రీడాలను ప్రోత్సహిస్తుందని ఈ సందర్భంగా రామకృష్ణ వివరించారు

బ్రూనో హత్యకు వ్యతిరేకంగా సత్యాన్వేషణ దినోత్సవం



నవతెలంగాణ-కాప్రా

భూ కేంద్ర సిద్ధాంతాన్ని కాదని క్రైస్తవ మతాచార్యులకు వ్యతిరేకంగా సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్నాడని, అలాగే విశ్వంలో అనేక నక్షత్రాలు ఉన్నాయని అవి కూడా సూర్యులేనని వాటి చుట్టూ గ్రహాలు తిరుగుతున్నాయని ప్రబోధించాడని ఇటాలియన్ తత్వవేత్త బ్రూనోను సజీవంగా మత పెద్దలు తగుల పెట్టారని.. బ్రూనోను హతమార్చిన రోజును సత్యాన్వేషణ రోజుగా కమలానగర్ ఆఫీసులో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్రూనో చిత్రపటానికి ప్రముఖ విద్యావేత్త న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ లో రిటైర్డ్ అయిన అధికారి ప్రసాద్ బాబు, ప్రముఖ విద్యావేత్త ఈసీఐఎల్ రిటైర్డ్ అధికారి నాగయ్య పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. నాగయ్య మాట్లాడుతూ 400 ఏండ్ల క్రితం బ్రూనోను అతికిరాతకంగా శాస్త్ర విజ్ఞానాన్ని సమాధి చేయాలనే సంకల్పంతో మత గురువులు బ్రూనోను అతికిరాతకంగా అతని సిద్ధాంతం తప్పని ఒప్పుకోవాలని ఒత్తిడి పెడుతూ కొంచెం కొంచెం కాల్చి హతమార్చారని అయినప్పటికీ తన సిద్ధాంతం తప్పు కాదని సత్యం ఏనాటికైనా నిజమని తెలుస్తుందని తను ఆహుతి అయ్యాడన్నారు. శాస్త్ర విజ్ఞానానికి ఆయన ఆత్మ త్యాగం ఎన్నో ఆవిష్కరణకు దోహద పడిందని అన్నారు. కోమటి రవి మాట్లాడుతూ బ్రూనో స్వయంగా క్రైస్తవ మతస్థుడైనప్పటికిని తప్పును సరిదిద్దటానికి ప్రయత్నించినప్పుడు మతోన్మాదం పెచ్చురిల్లి దుర్మార్గానికి ఒడిగట్టిందని అన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ తన రచనలలో మూఢనమ్మకాలకు వ్యతిరేకం గాను దేవుడి అస్తిత్వాన్ని ప్రశ్నించారని చెప్పారు. ఎక్కడైతే మత మందిరాలు ఎక్కువ ఉంటాయో అక్కడ శాస్త్ర విజ్ఞానం వెనక పడుతుందని చెప్పారన్నారు. నేడు భారతదేశంలో ఇదే ప్రక్రియ కొనసాగుతుందని దానికి వ్యతిరేకంగా నిలబడాలని చెప్పారు. ప్రసాద్‌బాబు మాట్లాడుతూ మనుషులలో భౌతిక వాద దక్పథం పెరగాల్సిన అవసరం ఉందని, మత భావనలతో మనిషి అస్తిత్వం దిగజారి పోతుందని అన్నారు. బ్రూనో హత్యోన్మాదం ప్రపంచానికి అనేకమైన దుర్మార్గాలకు ప్రతీకగా నిలిచిందని అన్నారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఏదైతే క్రైస్తవ మతం బ్రూనోను హత్య చేసిందో అదే క్రైస్తవ మతం తన తప్పును ఒప్పుకొని అదే స్థానంలో పెద్ద నిర్మాణం చేశారని చెప్పారు. క్రైస్తవ మతాధిపతి అయిన పోప్ కూడా దానిని ఖండించి, అది సరికాదని ఒప్పుకోవడం జరిగిందని చెప్పారు. కార్యక్రమం అనంతరం బ్రూనో చిత్రపటానికి సభికులందరూ పూలను అర్పించి నివాళి చేశారు. కార్యక్రమంలో ఆఫీస్ కార్యదర్శి శ్రీనివాసరావు , భాస్కర్ రావు, వెంకట్, వి స్వామి, వీబీ శంకర్రావు, సాంబశివరావు, శోభ తదితరులు పాల్గొన్నారు.



కీసరలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



సీఎం కేసీఆర్ పుట్టినరోజు పురస్కరించుకొని కీసర మండల కేంద్రంలోని ఈకో పార్కులో వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. జిల్లాలోని బీఆర్ఎస్ నేతలు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామివారిని ఎంపీ సంతోష్ కుమార్, మంత్రి మల్లారెడ్డిలు దర్శించుకున్నారు ఇరువురికి మండపంలో స్వామివారి ఆశీర్వచనాలను అందజేసి సన్మానించారు కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ తటకం రమేష్ శర్మ ,జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ బెస్త వెంకటేష్ , కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా, కీసర సర్పంచ్ నాయకపు మాధురి, ఉప సర్పంచ్ తటకం లక్ష్మణ్ శర్మ , తదితరులు పాల్గొన్నారు.

నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఏసీపీ శంకర్‌రాజు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని బేగం పేట్ ట్రాఫిక్ ట్రెనింగ్ సెంటర్ ఏసీపీ శంకర్‌రాజు తెలిపారు. శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కాలేజీతోపాటు డీడీ కాలనీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెూటెల్ మేనేజ్‌మెంట్ కాలేజీ విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. అనుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా చదువులో రాణించాలని విద్యార్థులకు సూచించారు. చిన్న వయసు నుంచే క్రమశిక్షణ, ఏకాగ్రత అవసరమన్నారు. అత్యాధునిక టెక్నాలజీలో సైతం నేరాలు పెరిగి పోతున్నాయని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని యువతీ, యువకులకు సూచించారు. ముఖ్యంగా ఆర్థిక లావాదేవీలను గుర్తుతెలియని వ్యక్తులతో పంచుకోవద్దన్నారు. ఓటీపీ ఎవరికి చెప్పొద్దన్నారు. అంతేకాకుండా ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు పాటించకపోవడంతోనే రోడ్డు ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. చిన్నప్పటి నుంచి నేరాలపై పిల్లల్లో అవగాహన కల్పించాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యాలయంలో ఆసీఫ్‌నగర్, హుమాయూన్ నగర్, అంబర్‌పేట, కాచిగూడా పోలీస్ అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కాని అడ్డగుట్ట

- టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సందీప్

నవతెలంగాణ-బేగంపేట్




ప్రజలకు కలబొలి మాటలు చెబుతూ ఓట్లు దండుకుంటున్న బీఆర్ఎస్ పార్టీకి ఈసారి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని టీపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ సందీప్ రాజ్ అన్నారు. తన పుట్టినరోజు పురస్కరిం చుకొని అడ్డగుట్ట డివిజన్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించడంలో బీఆర్ఎస్ వైఫల్యం చెందిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అందరికీ కార్పొరేట్ వైద్యం అందిస్తామని తెలిపారు. ఉచిత ఆరోగ్య శిబిరానికి ప్రజలు ఎంతో ఆసక్తి కనబడుచారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, ఏఐసీసీ మెంబర్ ఆదం ఉమాదేవి, గంటరాజు సంతోష్, హరి ,సోహెల్, నవీన్, బాలు, అనంతకృష్ణ, సాయి చందర్, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

వాడవాడలా కేసీఆర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నాచారం

సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల ముత్యంరెడ్డి, అంజి, బుచ్చి గౌడ్, చంద్రశేఖర్, విఠల్ యాదవ్, కాటిపల్లి రవీందర్ రెడ్డి, సువర్ణ సుగుణాకర్ రావు, సత్యనారాయణ, గణేష్,



రాజబాబు, సుజాత, శ్రీలత, వాణి తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు వార్డు కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి అనంతరం మల్లాపూర్ సూర్య నగర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు రాపోలు సతీష్, వాసుదేవ్ గౌడ్, పీఆర్ ప్రవీణ్, ఉపేందర్ రావు, ధర్మారెడ్డి, కోటేశ్వరీ, ఎల్లు బాయ్, రాజిరెడ్డి, పీరు నాయక్, జబ్బార్, పద్మా రెడ్డి, చంద్రశేఖర్, మహేందర్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు బీఎల్ఆర్ ట్రస్టు చైర్మెన్ బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నాచారం పారిశ్రామిక వాడలోని సాధన మానసిక వికలాంగుల ఓల్డ్ ఏజ్ హెూమ్‌లో జరిపారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగుల పిల్లలకు, వద్దులకు పండ్లు పంపిణీ చేసి అన్న వితరణ చేశారు. దశాబ్దాల వివక్షత నుంచి తెలంగాణకు విముక్తి కల్పించిన ప్రదాత కేసీఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధులు కటార్ల భాస్కర్, శ్రీశైలం యాదవ్, మాస శేఖర్, కిట్టు, గణేష్, శబీర్, నిఖిల్ సాయి, సురేష్ గౌడ్, దీపక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



నాచారం కార్మిక రాజ్య బీమా ఈఎస్ఐ ఆస్పత్రిలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఈఎస్ఐ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. రోగులకు పండ్లు పంపిణీ చేసి, కేక్ కట్ చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సూపరిటెండెంట్ డాక్టర్ కమల మాట్లాడుతూ



కేసీఆర్ ప్రజలకు సేవ చేసేందుకు ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సతీష్, డాక్టర్ వెంకట్ రెడ్డి, డాక్టర్ రజ్వంత్, డాక్టర్ వెంకటేష్ బాబు, డాక్టర్ మాధవి, డాక్టర్ ప్రశాంతి ఉన్నారు.

బేగంపేట : సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను చైతన్యపురి డివిజన్‌లో ఘనంగా నిర్వహిం చారు. కేక్ కట్ చేసి అనంతరం పారిశుధ్య కార్మికులకు చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి చీరలు పంపిణీ చేశారు. పార్టీ డివిజన్ నాయకులతో కలిసి సీఎం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు .

కంటోన్మెంట్ : పాతబోయినపల్లిలో కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఓల్డ్ బోయిన్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో భారీ కేక్‌ను కట్ చేశారు అంతకు



ముందు స్థానిక వైష్ణవి మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం బాణాసాచాలను కాల్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఇజాజ్, హరినాథ్, కర్ర జంగయ్య, లావణ్య, నార్సింగ్ బుర్రి



యాదగిరి, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

కంటోన్మెంట్ పికెట్ యూపీహెచ్‌సీలో టీఎస్ ఎస్ఐడీసీ చైర్మెన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ వేడుకలు నిర్వహించారు హైదరాబాద్ జిల్లా వైద్య అధికారి వెంకట్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విశాల్, సిబ్బంది పాల్గొన్నారు అనంతరం పికెట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు.

కాప్రా : సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ,స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌లు శుక్రవారం చర్లపల్లి డివిజన్ చక్రిపురం చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, మహంకాళి దేవాలయంలో కేసీఆర్ పేరుపై ప్రత్యేక



పూజలు నిర్వహించారు. అనంతరం చక్రి విద్యానికేతన్‌లో మొక్క నాటి, విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, చర్లపల్లి డివిజన్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే పార్టీ కాంగ్రెస్

నవతెలంగాణ-బంజారాహిల్స్



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీరీ నెరవేరుస్తుందని ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి అన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్రను కొనసాగింపుగా టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్న హాత్ సే హాత్ జోడో యాత్ర ద్వారా సందేశాన్ని ప్రజలకు తెలియజేయడానికి శుక్రవారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఫిలింనగర్‌లోని దీన్ దయాల్ నగర్, సైదప్ప బస్తీ, గౌతమ్ నగర్ (జూబ్లీహిల్స్ డివిజన్)లలో హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా కుట్టు మిషన్ జ్యూస్ నుంచి పాదయాత్ర ద్వారా వెళ్లారు.

న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శివరాజ్ శర్మ, న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ ఇన్‌చార్జి దుర్గేష్, వైద్యాధికారులు డాక్టర్ కె.శ్రీనివాసరావుచ, డాక్టర్ మహమ్మద్ బేగం, డాక్టర్ మధులత పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయుష్ ఆరోగ్యకర దీపిక పుస్తకంను ఆవిష్కరించి అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరావు 130 మంది రోగులను పరీక్షించి అన్ని రకాల వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఫార్మసిస్ట్ డి.సుధారాణి, ఒమరాన శంకర్, రాజమణి పాల్గొన్నారు.

భగత్‌సింగ్ నిజమైన దేశభక్తుడు

- 'భారత విప్లవ కెరటం భగత్‌సింగ్' పుస్తకావిష్కరణలో వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నేతలు
- 'రెడ్ బుక్ డే' సందర్భంగా 21 నుంచి మార్చి 23 వరకు అధ్యయనం
- నవతెలంగాణ బుక్‌హౌస్ ఎడిటర్ ఆనందాచారి

నవతెలంగాణ-సిటీబ్యూరో



పాఠ్య పుస్తకాల్లో భగత్‌సింగ్ చరిత్రను లేకుండా చేయడానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్ర చేస్తున్నాయనీ, భగత్‌సింగ్‌కు మతాన్ని అంటగట్టేందుకు ప్రయత్నిస్తున్నారని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నేతలు పేర్కొన్నారు. వరల్డ్ రెడ్ బుక్ డే సందర్భంగా నవతెలంగాణ పబ్లిషింగ్‌హౌస్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ సహచరులు శివవర్మ రాసిన 'భారత విప్లవ కెరటం భగత్‌సింగ్' పుస్తకాన్ని సుందరయ్య విజ్ఞాన కేంద్రం (నవతెలంగాణ బుక్ హౌస్) వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెడ్‌బుక్ డే ప్రాధాన్యతను నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ కె.ఆనందాచారి వివరించారు. ప్రపంచంలోని అన్ని లెఫ్ట్ వరల్డ్ పబ్లిషింగ్ హౌస్‌లు, తెలంగాణలోని వామపక్ష పబ్లిషింగ్ హౌస్‌ల ఆధ్వర్యంలో 'భారత విప్లవ కెరటం భగత్‌సింగ్' పుస్తకాన్ని అందరూ చదివేలా కార్యక్రమాన్ని తీసుకోవాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ రెడ్ బుక్ అధ్యయన కార్యక్రమాన్ని ఈ నెల 21 నుంచి భగత్‌సింగ్ వర్ధంతి మార్చి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న ముప్పు, ప్రమాదం, ఫాసిస్టు చర్యలు, రచయితలు, కవులు, కళాకారులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో రెడ్ బుక్ డే అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ప్రజల్లో స్ఫూర్తి, చైతన్యం నింపడానికి భగత్‌సింగ్ ఆశయాలు, ఆయన పోరాట చరిత్రను అధ్యయనం చేయించాలని సూచించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్‌సింగ్ పాత్ర మరువలేదనీ, ఆయన చరిత్రను అధ్యయనం చేయడమే నిజమైన నివాళి అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లావుద్దీన్ మాట్లాడుతూ భగత్‌సింగ్ స్వాతంత్ర్యం కావాలని మాత్రమే పోరాడలేదనీ, సమసమాజం కోపం పోరాడు అన్నారు. భగత్‌సింగ్‌ను హిందూత్వశక్తులు హైజాక్ చేస్తున్నాయనీ, భగత్‌సింగ్ ఉరికి ముందు భగవద్గీతను అధ్యయనం చేసినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అశాస్త్రీయ భావజాలాన్ని భగత్‌సింగ్‌కు అంటగట్టే చర్యలను వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆచరించిన విలువలు, ఆశయాలు, ఆలోచన విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విద్యార్థులు, యువజనులు కృషి చేయాలన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో దోపిడీ, మతోన్మాదం, ఉన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం సుధాకర్ మాట్లాడుతూ దేశంలో కాషాయీకరణ, దోపిడీ, అసమానతలు పెరిగిపోతున్నాయనీ, వీటన్నిటిపై పోరాటం చేయడమే భగత్‌సింగ్‌కు నిజమైన నివాళి అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న భగత్‌సింగ్, ఉద్యమకారుల చరిత్రను అణగదొక్కేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలు చేస్తోందన్నారు. ఎలాంటి ఉద్యమంలో పాల్గొనని సావర్కర్, గాడ్సేల జయంతి, వర్ధంతులను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా జరపడం శోచనీయం అన్నారు. భగత్‌సింగ్ జయంతి, వర్ధంతిని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు లెనిన్‌గువెరా, అశోక్‌రెడ్డి, నవతెలంగాణ బుక్‌హౌస్ మేనేజర్ డి.కిష్టారెడ్డి, సిబ్బంది రఘు, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టీఐపై అవగాహనా కార్యక్రమం



నవతెలంగాణ-ఓయూ

ఓయూ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, లీగల్ సెల్ సంయుక్తంగా "సమాచార హక్కు చట్టంపె శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టంపై ఉన్న అపోహలు, సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమం డైరెక్టర్స్, డీన్లు, ప్రిన్సిపాల్స్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, డిప్యూటీ రిజిస్ట్రార్లు, ఎగ్జామినేషన్ బ్రాంచ్ కంట్రోలర్లు, విద్యార్థులు, ఎస్. ప్రొఫెసర్, కెకె.నాయర్, ఈసీఈ ఆడిటోరియంలో జరిగిన హాఫ్ డే కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గుగులోత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ ఆర్టీఐ చట్టంలోని నిబంధనలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. బీఆర్ అంబేద్కర్ చేసిన సేవలను ఆయన గుర్తు చేసుకున్నారు. అజ్ఞానంతో సమాచార హక్కు చట్టంపై ఉన్న భయాందోళనలు, కళంకాలను అధిగమించాలని ఆయన సభ్యులను ఉద్బోధించారు. ఒకే దరఖాస్తుకు ప్రత్యుత్తరం ఇవ్వడంతో సులువుగా పరిష్కరించగలిగే విషయాలు నెగిటీ కారణంగా పది దరఖాస్తులకు అందుతాయనీ, గతంలో చాలా సందర్భాలు ఉన్నాయని చెప్పారు. చట్టంలోని కొన్ని నిబంధనలపై అవగాహన ఉంటే పని ప్రదేశాల్లో అవాంఛనీయ వాదనలు, చిరాకులను నివారించవచ్చని తెలిపారు. ఆర్టీఐ ఏసీలోని అన్ని నిబంధనలు, సెక్షన్ల గురించి ఆయన చాలా వివరణాత్మకంగా వివరించారు. యూనివర్సిటీల నుంచి ఎక్కువ దరఖాస్తులు రావడం లేదన్నారు. ప్రైవేట్ సంస్థలు కొన్ని సమయాల్లో చట్టంలోని నిబంధనలను తమకు అనుకూలంగా మలుచుకునేలా తప్పుగా అర్థం చేసుకుంటాయన్నారు. నిరక్షరాస్యులతో సహా చిన్నపిల్లల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టం పరిధిలో సమాచారాన్ని పొందేందుకు అర్హులని తెలిపారు. వ్యయాలు, పత్రాల ఖర్చులు, డాక్యుమెంటేషన్, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ పాత్ర, చట్టంలో పేర్కొన్న తగిన కాలమ్లతో రిజిస్టర్ నిర్వహించాల్సిన అవసరం వంటి విధానపరమైన అంశాలను ఆయన వివరించారు. ఆయన ప్రసంగం ముగిశాక ప్రశ్నోత్తరాల సెషన్ లో చర్చల్లో పాల్గొని చట్టంలోని వివిధ నిబంధనలపై వివరణలు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారి ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ ముఖ్య అతిథి కృషిని కొనియాడారు. ఆర్టీఐ చట్టం, ఎక్స్ఆర్ గురించి అవగాహన కల్పించడంలో అతని ఉత్సాహాన్ని ప్రశంసించారు. యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ ప్రారంభోపన్యాసం చేస్తూ ఆర్టీఐ చట్టంలోని నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలనీ, తన అనుభవాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొ.రెడ్యా నాయిక్ అధ్యాపకులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

జిందా తిలిస్మాత్ స్టాల్‌కు విశేష స్పందన



- లక్కీడ్రాలో మొదటి విజేతకు రూ.5 లక్షలు, రెండో విజేతకు రూ.3లక్షల బహుమతి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అఖిల భారత పారి శ్రామిక ప్రదర్శన (నుమాయిష్)లో ఏర్పాటు చేసిన జిందా తిలిస్మాత్ స్టాల్ సందర్శకుల నుంచి విశేష స్పందన లభించిందని జిందా తిలస్మాత్ సంస్థ సభ్యులు జనాబ్ అవేసుద్దీన్ ఫారూఖీ, జనాబ్ సాధ్ ఫారూ ఖీ తెలిపారు. ఎగ్జిబిషన్‌లోని జిందా తిలిస్మాత్ స్టాల్‌లో నిర్వహించిన బంపర్ ప్రైజ్, లక్కీ డ్రాలను తీసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి సాయినాథ్, దయా, కృష్ణశాస్త్రి, బీపీ చక్రవర్తి డ్రా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ లక్కీ డ్రాలో మొదటి బహుమతిని శ్రీనివాస్‌కు రూ.5 లక్షల బంపర్ బహుమతి, రెండో బహుమతిగా రూ.3 లక్షల నగదును సంగీతా శర్మన్, మూడో బహుమతిగా రూ.2 లక్షలను మహ్మద్ అహ్మద్‌లు దక్కించుకున్నారు. అంతే కాకుండా పలువురు ప్రోత్సాహక బహుమతులను సొంతం చేసుకున్నారని తెలిపారు. వీక్లీ డ్రాలో భాగంగా గులామ్ మహమ్మద్ హెూండా ఆక్టివాను, డైలీ డ్రాలో భాగంగా సయ్యద్ అహ్మద్ గోల్డ్ కాయినన్ను గెలుచుకున్నారని తెలిపారు. ప్రతి ఏడాదీ జిందా తిలిస్మాత్ స్టాల్స్‌కు వచ్చే కొనుగోలుదారులకు కూపన్లు అందించి బంపర్ ప్రైజ్, లక్కీ డ్రాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు.



సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా బల్కంపేట నేచర్ క్యూర్ హాస్పిటల్ ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి, రోగులకు పండ్లు పంపిణీ చేసిన టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్. నవతెలంగాణ-నసత్‌నగర్



సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మహేంద్ర ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ అంబర్‌పేట ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పులి జగన్, గరిగంటి శ్రీదేవి రమేష్, పద్మావతి దుర్గాప్రసాద్‌రెడ్డి, సీనియర్ నాయకులు మురళీకృష్ణ పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట



మెట్టుగూడలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్

నవతెలంగాణ-ఓయూ

ప్రజా గోస బీజేపీ భరోసాలో భాగంగా సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మెట్టుగూడ డివిజన్‌లో 'స్ట్రీట్ కార్నర్ మీటింగ్' నిర్వహించారు. బీజేపీ కార్యక్రమంలో మహంకాళి జిల్లా అధ్యక్షులు బి.శ్యామ్ సుందర్ గౌడ్, శారదామల్లేష్, మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి, శక్తి కేంద్రం ఇన్‌చార్జి బి.అంజయ్య, సహ ఇన్‌చార్జి కె.రమేష్, పోలింగ్ బూత్ అధ్యక్షులు రమేష్, గోవింద రాకేష్, శేషికళ, వెంకటమ్మ లక్ష్మీ, అరుణ, సింహాచలం బాబు, మహేష్, విజయ్, కె.హరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిశు సంరక్షణ కేంద్రంలో 'ఎస్ఏఎఫ్' లోగో ఆవిష్కరణ

- కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కటింగ్

నవతెలంగాణ-అంబర్‌పేట



సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా సికింద్రాబాద్‌లోని మహేంద్రహిల్స్‌లోని విద్యాస్ సెంటర్‌లో ప్రత్యేక పిల్లల కోసం శైలజ ఆర్యన్ ఫౌండేషన్, ఎస్ఏఎఫ్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఏఎఫ్ లోగోను ఆవిష్కరించి కేసీఆర్ కేక్ కట్ చేశారు. ఎస్ఏఎఫ్ సెంటర్‌లోని శారీరక, మానసిక వికలాంగుల ప్రత్యేక పిల్లల నృత్యాలు, పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రముఖ సామాజిక, వ్యాపారవేత్త ఎస్ఏఎఫ్ వ్యవస్థాపకురాలు శైలజా రెడ్డి తమ ఫౌండేషన్ సిద్ధాంతాలు, ఫౌండేషన్‌ను ప్రారంభించడానికి మూలకారణాన్ని వివరించారు. ఇతరుల గురించి మనుషుల్లో ఎలాంటి నైతికత, సెంటిమెంట్లు లేకుండా సమాజంలో జరుగుతున్న తప్పుల పట్ల ఆమె తన బాధను వ్యక్తం చేశారు. తమ ఫౌండేషన్ భవిష్యత్తులో తమ కార్యకలాపాలతో యువతను చైతన్యవంతం చేయాలన్నారు. వెటర్నినరీ డాక్టర్ దిశా కేసుతో తనకు ఏమైంది అని అడగడానికి ఎవరూ తమ వాహనాలను ఆపలేదనీ, ఆమె నగర శివార్లలో తన వెనుక బైక్‌తో చీకటిలో ఎందుకు ఉంటోందని శైలజ సమాజంలోని మానవుల సాధారణ మనస్తత్వాన్ని చిత్రీకరించారు. ఇంకా రోడ్డు ప్రమాదాల బాధితులకు అంబులెన్స్ లేదా పోలీసుల కోసం ఎదురుచూడకుండా ఆదుకోవాలని ఆమె ప్రజలకు మానవత్వం సందేశాన్ని అందించింది. ఆమె స్వామి వివేకానంద వచనాన్ని "మానవజాతికి సేవ చేయడం దేవుడికి సేవ చేయడం" అని తెలిపింది. ఈ సందర్భంగా ఆమె మానవాళిలో మానవాళికి మేలు చేసే విధానాలను నాటి జన్మదిన పురుషుడు, కాబోయే జాతీయ నాయకుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. ఎస్ఏఎఫ్ ఫౌండేషన్ మన మధ్య మరింత అవగాహన కోసం అలాగే తరులకు సహాయం చేయడానికి అవగాహన పెంచడం కోసం పబ్లిక్, యువకుల సున్నితత్వాన్ని మెరుగుపరచడానికి పని చేస్తుంది. సెంటర్‌లోని పిల్లలకు విరాళాల కోసం శ్రీ విద్యాస్ సెంటర్ వెబ్‌సైట్ http://www.srividhyaschool.org సంప్రదించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఎస్ఏఎఫ్ వైస్ ప్రెసిడెంట్ వివేక్, సత్యనారాయణ, జ్యోతిరెడ్డి, శివసింగ్ పాల్గొన్నారు.

హ్యాండ్‌లూమ్ వస్త్రోత్పత్తులకు పెరుగుతున్న ఆదరణ

- వర్ధమాన నటి తారాదేవి
- సత్యసాయి నిగమాగమంలో ఆరంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో



గ్రామీణ హస్తకళా వికాస్ సమితి నేతృత్వంలో శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయినిగమాగమంలో ఏర్పాటైన జాతీయ పట్టు వస్త్ర ప్రదర్శన-2023ని వర్ధమాన నటి తారాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్‌లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందనీ, నేటికీ వాటిపై వన్నె తగ్గలేదన్నారు. నేటితరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. డిజైనర్లు సైతం దేశంలో చేనేతకారులు నేస్తున్న ఈ హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను సృజనాత్మకంగా డిజైన్ చేస్తున్నారని చెప్పారు. నిర్వాహకులు జయేష్ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో దేశంలోని 14 నగరాల నుంచి చేనేతకారులు, చేతిపని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 50 వేల రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచామని వివరించారు. చేనేతను మరింత ఆదరించాల్సిన అవసరం ఉందనీ, పరోక్షంగా నేతకారులను ఆదుకున్న వారవుతామన్నారు.

మహాశివరాత్రికి శ్రీ లక్ష్మణేశ్వర స్వామి ఆలయం ముస్తాబు



- మహాశివరాత్రికి అన్ని ఏర్పాట్లు పూర్తి
- ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మెన్ రాజలింగం

నవతెలంగాణ-సిటీబ్యూరో

పాతబస్తీ, ఛత్రినాక శివగంగానగర్‌లో ఉన్న 300 ఏండ్ల లింగాకారంలో ఉన్న అతి పురాతన శ్రీ లక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 18, 19 తేదీల్లో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేశామనీ, ఈ మేరకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశామని ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మాచునూరి రాజలింగం, పాలక మండలి సభ్యులు ఎం.మహేష్, గిట్టి రమేష్, కె.స్వరూప నాయక్, ఏ.శీకాంత్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పి.రమేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి జి.మహేందర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆలయాన్ని ప్రత్యేక పులా అలంకరణలు, స్వాగత తోరణాలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించామనీ, శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన అభిషేకాలను నిర్వహిస్తున్నామనీ, మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తుల మనోభావాలకు తగిన రీతిలో ఏర్పాట్లు చేశామని వారు తెలిపారు. అత్యంత భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా జరిగే ఈ మహాశివరాత్రి ఉత్సవాలకు పరిసర ప్రాంతాలకు చెందిన శివభక్తులతో పాటు ప్రతి ఒక్కరూ అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. నేడు ప్రాత కాలమున 3.30 నిమిషములకు సుప్రభాత సేవ, దీపారాధన, గణపతి పూజతో ఉత్సవాన్ని ప్రారంభిస్తారనీ, ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు అభిషేకములు, అర్చనలు నిర్వహింపబడుతాయనీ, సాయంత్రం 7 గంటలకు శ్రీశ్రీశ్రీ ఉమామహేశ్వరి సహిత లక్ష్మణేశ్వర స్వామి కళ్యాణం జరుగుతుందనీ, రాత్రి 8 గంటలకు మహిళామణుల మంగళహారతులతో వైభవంగా పల్లకి సేవ జరుగుతుందనీ, రాత్రి 12 గంటలకు లింగోద్భవ పూజ జరుగుతుందని తెలిపారు. 19వ తేదీన ప్రాత్ణ కాల సేవలు తదుపరి మంగళహారతి, తీర్థప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు ఎస్.వి. శ్రీకాంత్ ఆచార్యులు, అర్చకులు రంజీ పాండేలు తెలిపారు.

శాంతిని బోధించే మార్గం గొప్పది : వకులాభరణం



నవతెలంగాణ-బంజారాహిల్స్

శాంతిని బోధించి మానవుని నిత్యజీవితంలో నిజమైన మార్గాలను ఏ విధంగా అనుసరించాలో తెలిపే బ్రహ్మకుమారిస్ ప్రతి ఏటా నిర్వహించే శివరాత్రి జ్యోతిర్లింగ అభిషేకానికి హాజరైన బీసీ కమిషన్ చైర్మెన్ వకులాభరణం మాట్లాడుతూ చెడు మార్గాన్ని విడనాడి మంచిని అనుసరించే మార్గాన్ని తెలిపే బ్రహ్మకుమారిస్ సంకల్పం గొప్పది అన్నారు. ఉపవాసాలు జాగారాలు సాంప్రదాయాలకు నిలువుటద్దమనీ, అయితే బ్రహ్మకుమారిస్ ఉపవాసాలు జాగారాలతో మోక్షం లభించాలని దేవుని ధ్యానంతో పాటు ప్రజలకు సేవలు అందిస్తూ మంచి మార్గాన్ని ఏర్పటు చేసే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రెండు రోజులు నిర్వహించే ఈ ప్రత్యేక కార్యక్రమానికి జాతీయ నాయకులతో పాటు బ్రహ్మకుమారిస్లోని రాధా బెహన్ పలువురు పోలీసు అధికారులు భాగస్వాములవుతారని తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఖైరతాబాద్‌లోని తెలంగాణ ప్రభుత్వ పాఠ్య పుస్తక ముద్రణాలయం వెనకాల గల క్వార్టర్స్ వర్షపు నీరు వెళ్లడానికి తమ ముద్రణాలయ స్కూటర్ స్టాండ్ నుంచి అధికారులు నాలా లైను నిర్మాణం చేశారు. ఈ నేపథ్యంలో స్కూటర్ స్టాండ్‌కు నష్టం జరిగిందనీ వెంటనే మరమ్మతులు చేయించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సర్కిల్ 17 అధికారికి తెలంగాణ ప్రభుత్వ పాఠ్య పుస్తక ముద్రణాలయం జాయింట్ యాక్షన్ కమిటీగా మెమోరండం అందజేసింది. ఈ సందర్భంగా అధికారులు సానుకూలంగా స్పందించి వెంటనే నిర్మాణం చెపడుతామని హామీనిచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆర్.ఈశ్వర్, జి.మల్లికార్జున్, యస్.విశ్వసేన, కె.శ్రీకాంత్, జి.శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

కేసీఆర్ జన్మదినం సందర్భంగా పుస్తకాలు పంపిణీ, 2కే రన్

నవతెలంగాణ-ఓయూ



సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఓయూ బీఆర్ఎస్వీ నేత కొంపెల్లి నరేష్ ఆధ్వర్యంలో ఉద్యోగాలకు ప్రిపరేషన్ విద్యార్థులకి గ్రూప్స్ పుస్తకాలు పంపిణీ చేసి, మొక్కలు నాటి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ ప్రధాన కార్యదర్శులు శిగా వెంకటేష్, ఎర్రవండ్ల కృష్ణ, మేకల రవి, బూరుగు నవీన్, విద్యార్థి నాయకులు, కార్యదర్శి రాజు యాదవ్, కార్యదర్శి గంటపాక మురళి, యాదాద్రి జిల్లా అధ్యక్షులు ఒగ్గు శివ, భాస్కర్, క్యాదాసు రవి, చారి పవన్ హరి ప్రసాద్, కార్తీక్ పాల్గొన్నారు.

యూనివర్సిటీ ఆవరణలో 2కె రన్



సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఓయూలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ చైర్మన్‌లు అనిల్ కుర్మచలం, దూదిమెట్ల బాలరాజు, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ యూనివర్సిటీ ఆవరణలో 2కే రన్ ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శులు దశరథ్, శ్రీకాంత్ గౌడ్, జంగయ్య ప్రశాంత్ శ్రీమన్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

నందకిషోర్ ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ధూల్‌పేట్

సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నందకిషోర్ వ్యాస్ బిలాల్, నాయకులు, కార్యకర్తలు కలిసి ఘనంగా నిర్వహించారు. గోషామహల్ బేగం బజార్ పార్టీ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్, అనిత సైలెస్ కుర్మా నియోజకవర్గ నాయకులతో కలిసి కేక్ కటింగ్ చేశారు. అనంతరం చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి తలసానితో కలిసి సంబురాలు చేశారు.

తొమ్మిదేండ్ల కేసీఆర్ పాలనలో విద్యావ్యవస్థ సర్వ నాశనం

- బహుజన విద్యార్థి నాయకులు
- ఆర్ట్స్ కాలేజీ ఎదుట నల్ల బెలున్స్ ఎగరవేత

నవతెలంగాణ-ఓయూ

తొమ్మిదేండ్ల పాలనలో సీఎం కేసీఆర్ విద్యావస్థను భ్రష్టుపట్టించారని బహుజన విద్యార్థి నాయకులు సంజయ్, తిరుపతి అన్నారు. విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేయడంతో ప్రభుత్వ బడులలో కనీస సౌకర్యాలు లేవనీ, సరిపడా టీచర్లు లేక పిల్లలకు నాణ్యమైన విద్య అందడం లేదని శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట నల్ల బెలూన్స్ ఎగరేశారు. మాధ్యమిక, ఉన్నత విద్యను ప్రయివేట్ వారికి అప్పచెప్పారనీ, ప్రభుత్వ విశ్వవిద్యాలయాను బలోపేతం చేయకుండా పుట్టగొడుగుల్లా ప్రయివేటు విశ్వవిద్యాలయాలకు పర్మిషన్లు ఇచ్చి వాటిని ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాలు విద్యకు అధిక ప్రాధాన్యం ఎక్కువ నిధులు కేటాయిస్తే తెలంగాణలో మాత్రం విద్యకు 7శాతం శాతం నిధులు కూడా కేటాయించడం లేదన్నారు. ఇలా తెలంగాణలో మొత్తం విద్యా వ్యవస్థను సర్వ నాశనం చేస్తున్నారని చెప్పారు. ఓయూ బహుజన విద్యార్థి సంఘాలుగా ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిరసనగా ప్లకార్డులు, నల్ల బెలూన్లు ఎగరా వేసే ప్రయత్నం చేయగా బహుజన స్టూడెంట్స్ జాక్ చైర్మన్ వేల్పుల సంజయ్, ఓయు జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతిలను పోలీసులు అరెస్ట్ చేశారు. రాష్ట్రంలో విద్యకు బడ్జెట్‌లో 25శాతం నిధులు కేటాయించి వాటిని ఖర్చు చేయాలనీ, యూనివర్సిటీలలోని ఖాళీలను కామన్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా కాకుండా ఏ యూనివర్సిటీకి సంబంధించిన పోస్టులను ఆయా యూనివర్సిటీలే భర్తీ చేసే పాతవిధానం ఉండాలనీ, యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని కాపాడాలన్నారు. దళిత గిరిజన బడుగువర్గాల హక్కులను కాలరాస్తున్న ఓయూ వీసీ రవీందర్ యాదవ్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-దుండిగల్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ఏడుగురు లబ్దిదారులకు శాసనమండలి విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శుక్రవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో రూ.3.05 లక్షల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
మాజీ ఎంపీపీ, టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా 12వ రోజు కార్యక్రమంలో భాగంగా "హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర" శుక్రవారం కుత్బుల్లాపూర్ 131వ డివిజన్ పరిధిలోని గణేష్ నగర్, పద్మా నగర్, సురేందర్‌రెడ్డి నగర్, పాపయ్య యాదవ్‌నగర్, సూర్యనగర్, రామ్ రెడ్డి నగర్‌లలో యాత్ర సాగింది.

ఘనంగా సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు















నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన పురస్కరించుకొని శుక్రవారం కుత్బుల్లాపూర్, గాజుల రామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ మగ్దూం నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయం ప్రాంగణంలో కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. సంక్షేమ ఫలాల ప్రదాత, కారణజన్ముడు కేసీఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు బింగి ఇందిరాగౌడ్, బీసీ సెల్ అధ్యక్షులు పి.విట్టల్ ముదిరాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు సి.హెచ్. దాసు, నాయకులు అప్పల శ్రీను, విట్టల్, నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మేయర్
దుండిగల్ : బంగారు తెలంగాణ నిర్మాత, బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకుడు మన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మ దినోత్సవం సందర్భంగా మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్-2 శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద శుక్రవారం మొక్కలను నాటి కేసీఆర్‌కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ఎన్నో అద్భుత విజయాలను ముఖ్యమంత్రి పాలనలో సాధించడం జరిగింది. బంగారు తెలంగాణగా మార్చిన కేసీఆర్ ప్రభుత్వం, అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ నినాదంతో పట్టుసడలని ఉక్కుసంకల్పంతో ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా దేశాన్ని మార్చే శక్తి కేసీఆర్‌కే సాధ్యమవుతుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్ పద్మప్రసాద్, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సబితా జలంధర్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ వైస్ ప్రెసిడెంట్ రాము, స్థానిక డివిజన్ బీఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, జనరల్ సెక్రెటరీ బట్ట మురళి, జాయింట్ సెక్రెటరీ ఎల్‌బిసి శ్రీనివాస్, పబ్లిసిటీ సెక్రెటరీ రమేష్, 12వ డివిజన్ బీఆర్ఎస్ అనుబంధ కమిటీల సభ్యులు చంద్రమౌళి, లడ్డు, సురేష్, రమేష్, స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు, ఇతర ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో
బాలానగర్ : బాలానగర్ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ 69వ పుట్టినరోజు వేడుకలు కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బాణాసంచా కాల్చి కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం కేసీఆర్ ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో నూరేళ్ళు జీవించాలని కాలభైరవ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యులు చందర్, డివిజన్‌కు సంబంధించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు బస్తీ, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఫతేనగర్ కార్పొరేటర్ పండాల ఆధ్వర్యంలో...
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 69వ జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం ఫతేనగర్ పరిధిలోని పైప్ లైన్ రోడ్ వద్ద జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ స్థానిక వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కేసీఆర్ భవిష్యత్తు లో దేశానికి సారథ్యం వహించాలని, అదేవిధంగా ఆయన అయు ఆరోగ్యలతో ఉండాలని కోరారు. ఫతేనగర్ డివిజన్ లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు, సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

శాసనమండలి విప్ శంబిపూర్ రాజు ఆధ్వర్యంలో
దుండిగల్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను శాసనమండలి విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు కుతుబుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్‌లోని (స్ఫూర్తి ఫౌండేషన్ స్కూల్) అనాథశ్రమం విద్యార్థులతో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లు, నోటు పుస్తకాలను పంపిణీ చేసి విద్యార్థులందరికి స్వయంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో
కుత్బుల్లాపూర్ : సుభాష్ నగర్ 130 డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి కార్యాలయంలో సీఎం కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే
ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా సుభాష్‌నగర్ 130 డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్‌లో పీపుల్స్ ఫస్ట్ అండ్ సెంటర్ వద్ద టీఎస్ సీపీడబ్ల్యూఏ ప్రెసిడెంట్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరము శుక్రవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు డివిజన్ల అధ్యక్షులు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు

3 నామినేషన్లు దాఖలు

నవతెలంగాణ-సిటీబ్యూరో
హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా రెండో రోజు శుక్రవారం ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు 3 నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో దేవన్నగిరి మల్లారెడ్డి, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, గుర్రం చెన్నకేశవరెడ్డిలు ఒక్కొక్క సెట్టు నామినేషన్లు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలాకు అందజేశారు. ఇప్పటి వరకు ఆరుగురు అభ్యర్థులు మొత్తం 9 సెట్ల నామినేషన్లు దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి తెలిపారు. హైదరాబాద్ లోకల్ అథారిటి ఎన్నికకు రెండోరోజూ ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలా తెలిపారు.

ప్రభుత్వ సెలవు దినాలలో నామినేషన్లు స్వీకరించబడవు
హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గం, హైదరాబాద్ లోకల్ అథారిటీ నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినాల్లో నామినేషన్లను స్వీకరించబడవని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలా ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం సూచన మేరకు ఈ నెల 18, 19 తేదీలలో ప్రభుత్వ సెలవులు ఉన్నందున నామినేషన్లు స్వీకరించడం జరగదని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

ముజీబ్ ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో
సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, వల్లబ్ నగర్ సబ్ రిజిస్టర్ డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని (ముజీబ్) ఆధ్వర్యంలో వల్లబ్ నగర్ కార్యాలయంలో ముఖ్యఅతిథి బోయిన్‌పల్లి కార్పొరేటర్ ఎం.నర్సింగ్ యాదవ్ సమక్షంలో కేక్ కటింగ్ చేశారు. అనంతరం డాక్టర్ ముజీబ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని కృషి చేసిన కార్యసాధకుడు కేసీఆర్ అని అన్నారు. ఆయన నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, బంగారు తెలంగాణ అభివృద్ధి ధ్యేయంగా మరింత ముందుకుసాగాలని ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

మ్యాన్‌హోళ్ల పైకప్పులు వేయించిన అధికారులు

నవతెలంగాణ కథనానికి స్పందించిన అధికారులు ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
రంగారెడ్డి నగర్ డివిజన్, గిరినగర్ ప్రధాన రహదారి మధ్యలో 'ప్రమాదభరితంగా మ్యాన్ హోల్' అనే శీర్షికన బుధవారం ప్రచురించిన వార్తకు అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించారు. శుక్రవారం రెండు చోట్ల మ్యాన్ హోళ్ల పైకప్పులు సిబ్బందితో వేయించారు. పత్రికలో ప్రచురించినందుకు గాను నవతెలంగాణ పత్రిక ప్రతినిధులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పట్ల నిరంతరం అండగా ఉండేది నవతెలంగాణ అని ప్రశంసించారు.



ముందు



తరువాత

ఎన్ఎస్‌యుఐ జాతీయ కోఆర్డినేటర్‌గా దాసరి అజయ్‌కుమార్



నవతెలంగాణ- కూకట్‌పల్లి
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి ఎన్నికల పరిశీలకుడిగా ఎన్ఎస్‌యూఐ జాతీయ కోఆర్డినేటర్ దాసరి అజయ్‌కుమార్ శుక్రవారం రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ ఇన్‌చార్జి అక్షయ్ లక్రా ననియమిస్తూ నియామక పత్రాన్ని దాసరి అజయ్ కుమార్‌కు అందజేశారు. యూనివర్సిటీలో జరుగుతున్న ఎన్నికలకు పరిశీలకుడిగా అజయ్‌ను నియమిస్తున్నట్టు ఆయన అధికార పూర్వకంగా ప్రకటించారు. అనంతరం అజయ్ కుమార్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు, తనపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా క్రియాశీలకంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.
తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ఎన్ఎస్‌యుఐ నాయకులకు, కాంగ్రెస్ నాయకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

బీఆర్ఎస్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని కృషి కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు విజయ్ భాస్కర్ షాపూర్ నగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో యాక్సిడెంట్ కారణంగా చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ శుక్రవారం హాస్పిటల్‌కి వెళ్లి ఆయనను పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. విజయ్ భాస్కర్‌కు ఆందోళన చెందొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నుంచి వచ్చే స్పెషల్ నిధులు గిరిజనులకు విడుదల చేయాలి

- **గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడ్ ధర్మానాయక్**

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
కేంద్రం నుంచి వచ్చే స్పెషల్ నిధులు గిరిజనులకు విడుదల చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడ్. ధర్మానాయక్ అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీలో మేడ్చల్ జిల్లా 3వ మహాసభ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జెండాను జిల్లా అధ్యక్షులు జే.శివనాయక్ ఎగురవేశారు. సభ అధ్యక్షులుగా కే.కృష్ణ నాయక్, రాజు నాయక్ వ్యవహరించిన ఈ కార్యక్రమానికి ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇండ్లు లేని గిరిజనులకు ఇండ్లు ఇచ్చి గిరిజన బంధు ఇవ్వాలన్నారు. కేంద్రం అన్నీ ప్రైవేటీకరణ చేస్తూ గిరిజనుల అభివృద్ధిని ఆటంకపరుస్తూ నిధులన్నీ పక్కదారిన మళ్లిస్తున్నారన్నారు 275 ఆర్టికల్ ప్రకారం కేంద్రం నుంచి స్పెషల్ నిధులు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ గిరిజనుల అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన వ్యతిరేకి ప్రభుత్వంగా ఉన్నదని ఇప్పటికీ ఎరువులలో కోత పెట్రోల్ డీజిల్‌లో కోత ఆహారపు సబ్సిడీలలో కోత విధించిందని అన్నారు. ఉపాధి కూలీలకు పనిదినాలు పెంచి, నిధులు పెంచాల్సింది పోయి కోత విధిస్తే పేద ప్రజలు ఏ విధంగా జీవనం గడుపుతారో అర్థం కాని పరిస్థితి ఉన్నదని అన్నారు. ఇప్పటికి కేంద్రం ఇచ్చే కొన్ని పథకాలు ఇది ఒకటని దీన్ని పూర్తిగా నీరుగారిచే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం 10 శాతంపై జీవో విడుదల చేసిందని హర్షం వ్యక్తం చేశారు. కానీ 10 శాతం అన్ని డిపార్ట్‌మెంట్లలో బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇప్పటికీ ముఖ్యమంత్రి గిరిజనబంధు ఇస్తానని ప్రకటించారని, దానికి గిరిజనులు స్వాగతించాలని అన్నారు. భూమిలేని వాళ్లకు మాత్రమే ఇస్తానని చెప్పడం సరి అయింది కాదని, ఐదు ఎకరాల లోపు ఉన్న ప్రతి గిరిజనుడికి గిరిజన బంధు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గిరిజనులకు కేటాయించే నిధుల్లో పూర్తిగా విద్యకే ఎక్కువ కేటాయించి అందులో నాణ్యత లేకుండా చేస్తున్నారన్నారు. హైదరాబాద్, మేడ్చల్, కూకట్‌పల్లి ప్రాంతంలో వలస వచ్చినటువంటి గిరిజనులు అద్దె ఇంట్లో ఉంటూ కాలం వెళ్లదీస్తున్నారని, వారిని గుర్తించి అర్హులైనటువంటి వాళ్ళకందరికీ డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వాలని వారు కోరారు. అనంతరం తెలంగాణ గిరిజన సంఘం మూడవ జిల్లా మహాసభలు నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జె.శివ నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.చిరంజీవి. ఉపాధ్యక్షులుగా కే.కృష్ణ నాయక్, శంకర్ నాయక్, పి.మాత్య, జానకిరామ్, సహాయ కార్యదర్శిగా బాష, బోజయ, మంగ్య, శ్రీను కృష్ణ లక్ష్మణ్ నరేష్‌తో పాటు 15 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బాలపీరు, రాజు, బాష, రాము, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ రాజేంద్రపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి

జాతీయ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బూదాల బాబూరావు



నవతెలంగాణ - బాలానగర్
కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పోలీస్ స్టేషన్లోని ఎస్సై ఎస్. రాజేంద్ర, బాధితురాలు కవిత, నెల రోజులుగా స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవడంతో బాధితురాలు జాతీయ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు బూదాల బాబురావును ఆశ్రయించింది. దీంతో బాబూరావు బాధితురాలికి న్యాయం చేయాలని డీసీపీ, ఏసీపీ దృష్టికి తీసుకెళ్లారు. కేపీహెచ్ బీ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి విషయమై బాబూరావు ప్రస్తావించగా ఎస్ఐ రాజేంద్ర అసభ్యకరమైన పదజాలంతో దుర్భాషలాడడం పట్ల ఉన్నతాధి కారులు ఎస్సై రాజేంద్ర పై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డీసీపీ చొరవతో కవిత కుటుంబ సభ్యులపై కేసునమోదు చేసినట్లు బాబూరావు తెలిపారు. కేసు నమోదు ద్వారా మహిళలకు న్యాయం జరిగిందని, ఓపక్క ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటూ ఇలా అసభ్యకరంగా మాట్లాడడం తెలంగాణ పోలీసులు తిరిగి పునరావృతం కాకుండా చూడాలని బాబూరావు కోరారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు శుభాకాంక్షలు తెలిపిన కోలన్ గోపాల్ రెడ్డి



నవతెలంగాణ-దుండిగల్
తెలంగాణ శాసనమండలి విప్‌గా నియమితులైన మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి శుక్రవారం వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిప వారిలో ఎన్ఎంసి బీఆర్ఎస్, కార్పొరేటర్లు ఆగం రాజు ముదిరాజ్, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆవుల జగదీష్ యాదవ్, బక్క మల్లేష్ ఎన్ఎంసి బీఆర్ఎస్ జాయింట్ సెక్రెటరీ దండుగుల స్వామి, 31వ డివిజన్ బీఆర్ఎస్ ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ రవీందర్ నాయక్, ఇతర ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ముస్తాబైన శివాలయాలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్, గాజుల రామారం జంట సర్కిళ్ల పరిధిలోని ఆయా ప్రాంతాల్లోని శివాలయాలు రెండు రోజులుగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. జగద్గిరిగుట్ట, రంగారెడ్డి నగర్, చింతల్, గాజులరామారం, కుత్బుల్లాపూర్, డివిజన్లో పలు ప్రాంతాలలో శివాలయాలు ఆలయ నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించారు. జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్య నగర్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున శివాలయం మిరుమెట్లు గొలిపే విద్యుత్ దీపాల మధ్య సర్వాంగ సుందరంగా ఆలయ కమిటీ చైర్మెన్ నల్లగోపుల బాబుగౌడ్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ముస్తాబు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించారు.

కేసీఆర్ చెస్ చాంప్ శరణ్య

క్రికెటర్లు త్రిష, యశశ్రీ సహా ఖేలో ఇండియా విజేతలకు సన్మానం

నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి మహిళా చెస్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ఎల్బీ స్టేడియంలో ఘనంగా ముగిశాయి. రెండు రోజుల మెగా చెస్ చాంపియన్‌షిప్స్‌లో తొలి రోజు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించగా.. రెండో రోజు రాష్ట్ర స్థాయిలో పోటీలు జరిగాయి. రాష్ట్ర స్థాయి ఫైనల్స్‌లో గాదె శరణ్య (రంగారెడ్డి జిల్లా) ఓవరాల్ విజేతగా నిలిచింది. ఇతర విభాగాల్లో దీక్షిత, క్రితిక, అభిరామి, రేణుక, జ్ఞానత, విజేత, షరిష్మా ప్రతిభ కనబరిచి నగదు ప్రోత్సాహకాలు అందుకున్నారు. మండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాశ్, క్రీడా శాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, శాట్స్ చైర్మెన్



ఆంజనేయ గౌడ్‌లు చెస్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఖేలో ఇండియాలో పతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులు, ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ విజేతలు త్రిష, యశశ్రీలను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

చేతన్ శర్మ రాజీనామా



ముంబయి : ఓ టీవీ చానెల్ శూల శోధన (స్టింగ్ ఆపరేషన్)లో భారత క్రికెట్‌లో పలు అంశాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన చేతన్ శర్మ తన పదవికి రాజీనామా చేశాడు. బీసీసీఐ ఆల్ ఇండియా సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మెన్ పదవికి రాజీనామా చేస్తూ బోర్డు కార్యదర్శి జై షాకు లేఖ పంపాడు. చేతన్ శర్మ రాజీనామాను బోర్డు ఆమోదించినట్టు తెలుస్తోంది. డ్రెస్సింగ్‌రూమ్‌లో విభేదాలు, కోహ్లి కెప్టెన్సీ తొలగింపు సహా ఫిట్‌నెస్ లేకపోయినా బరిలోకి దిగుతున్నారంటూ చేతన్ శర్మ పిచ్చాపాటిగా మాట్లాడాడు. రహస్య కెమెరాలో చేతన్ శర్మ మాట్లాడిన వ్యాఖ్యలు బయటకు రావటంతో బోర్డు ఇరకాటంలో పడింది. వివరణ ఇచ్చుకునేందుకు చేతన్ శర్మకు ఓ అవకాశం ఇచ్చే ఆలోచనలో బోర్డు కనిపించినా.. చేతన్ శర్మ రాజీనామా సమర్పించాడు. 2022 ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భారత్ వైఫల్యంతో సెలక్షన్ కమిటీ బోర్డు రద్దు చేసినా.. ఈ ఏడాది జనవరిలో చేతన్ శర్మకు మరోసారి చీఫ్ సెలక్టర్ అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే.

ఐపీఎల్ హంగామా 59 రోజులు

- మార్చి 31న తొలి మ్యాచ్, మే 28న ఫైనల్
- ఇండియన్ ప్రీమియర్ లీగ్ 16 షెడ్యూల్ విడుదల



ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2023 షెడ్యూల్ వచ్చేసింది. 10 జట్లు పోటీపడుతున్న ఐపీఎల్ 16 సీజన్ 59 రోజుల పాటు జరుగనుంది. వారాం తాల్లో రెండు మ్యాచులు నిర్వహిం చనున్న సీజన్‌లో లీగ్ దశలో 70 (ఓవరాల్‌గా 74) మ్యాచులు జరుగనున్నాయి. మార్చి 31న డిఫెండింగ్ చాంపియన్స్ గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ ఆరంభ మ్యాచ్‌లో తలపడనున్నాయి. మే 28న అహ్మదాబాద్ వేదికగా ఐపీఎల్ 16 ఫైనల్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఐపీఎల్ నిర్వాహకులు శుక్రవారం షెడ్యూల్ విడుదల చేశారు. ఐపీఎల్ 16 ప్లే ఆఫ్స్ షెడ్యూల్ ప్రకటించాల్సి ఉంది. ఇక రెండేండ్ల విరామం అనంతరం ఐపీఎల్ ఇంటా, బయటా ఫార్మాట్‌లో జరుగనుంది.

రెండు గ్రూపులే, కానీ కొత్తగా! : పది జట్ల ఐపీఎల్ లీగ్‌ను గతంలో తరహాలోనే రెండు గ్రూపులు విభజించారు. కానీ గతంలో సొంత గ్రూప్‌లోని జట్లతో రెండు సార్లు, ఆవల గ్రూప్‌తో ఓ సారి ఆడేవారు. కానీ ఈ సీజన్‌లో అందుకు భిన్నంగా ఆడనున్నారు. సొంత గ్రూప్‌లోని జట్లతో ఓ మ్యాచ్‌లో ఆడనుండగా, మరో గ్రూప్‌లోని జట్లతో రెండేసి మ్యాచుల్లో తలపడతాయి. గ్రూప్-ఏలో ముంబయి ఇండియన్స్, కోల్‌కత నైట్‌రైడర్స్, రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్‌జెయింట్స్ ఉండగా.. గ్రూప్-బిలో చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్, గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ చోటు చేసుకున్నాయి. లీగ్ దశలో ప్రతి జట్టు 14 మ్యాచులు ఆడనున్నాయి.

ఏప్రిల్ 2 నుంచి హైదరాబాద్‌లో.. : ఐపీఎల్ హంగామాకు రెండేండ్లు దూరమైన హైదరాబాద్ ఈ ఏడాది కొత్తగా ముస్తాబవుతోంది. ఐపీఎల్ 16 సీజన్ మ్యాచులు హైదరాబాద్‌లో ఏప్రిల్ 2 నుంచి ఆరంభం కానున్నాయి. 2022 రన్నరప్ రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ సీజన్‌ను ఆరంభించనుంది. ఏప్రిల్ 9న పంజాబ్ కింగ్స్, 18న ముంబయి ఇండియన్స్, 24న ఢిల్లీ క్యాపిటల్స్, మే 4న కోల్‌కత నైట్‌రైడర్స్, 13న లక్నో సూపర్‌జెయింట్స్, 18న రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంతగడ్డపై ఆడనుంది. చెన్నై సూపర్‌కింగ్స్‌తో ఒకే మ్యాచ్‌లో తలపడనున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆ మ్యాచ్‌ను చెన్నై చెపాక్‌లోనే ఆడనుంది. దీంతో ఎం.ఎస్ ధోని చివరి ఐపీఎల్ సీజన్‌లో హైదరాబాద్‌కు రావటం లేదు!.

ఇక బ్యాటర్ల వంతు!

ఫిరోజ్ షా కోట్లలో బౌలర్లు కదం తొక్కారు. తొలి రోజు పిచ్ నుంచి లభించిన అనుకూలతను సద్వినియోగం చేసుకున్న ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 263 పరుగుల మెరుగైన స్కోరు నమోదు చేసింది. పేసర్ మహ్మద్ షమి (4/60) నిప్పులు చెరగగా.. అశ్విన్ (3/57), జడేజా (2/68) మాయజాలం కొనసాగింది. కంగారూలను బౌలర్లు తొలి రోజే కుప్పకూల్చటంతో.. ఇక టెస్టుపై పట్టు బిగించే బాధ్యత బ్యాటర్లు తీసుకోవాల్సి ఉంది. నేడు భారత బ్యాటింగ్ రెండో టెస్టు గమనాన్ని నిర్దేశించనుంది.



- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 263/10
- రాణించిన షమి, అశ్విన్, జడేజా
- భారత్ తొలి ఇన్నింగ్స్ 21/0
- భారత్, ఆసీస్ రెండో టెస్టు తొలి రోజు

నవతెలంగాణ-న్యూఢిల్లీ

మహ్మద్ షమి (4/60), రవిచంద్రన్ అశ్విన్ (3/57), రవీంద్ర జడేజా (3/68) త్రయం రెచ్చిపోయింది. షమి పదునైన పేస్‌తో హడలెత్తించగా.. అశ్విన్, జడేజా మాయకు కంగారూలకు దిమ్మతిరిగింది. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 263 పరుగులు చేసింది. ఓపెనర్ ఉస్మాన్ ఖవాజ (81, 125 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్), పీటర్ హ్యాండ్స్‌కాంబ్ (72 నాటౌట్, 142 బంతుల్లో 9 ఫోర్లు) అర్థ సెంచరీలతో ఆస్ట్రేలియాకు మంచి స్కోరు అందించారు. పిచ్ నుంచి బ్యాటర్లకు సహకారం దక్కినా.. భారత బౌలర్లు 78.4 ఓవర్లలోనే ఆస్ట్రేలియాను ఆలౌట్ చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 21/0తో కొనసాగుతుంది. ఓపెనర్లు రోహిత్ శర్మ (13 బ్యాటింగ్), కెఎల్ రాహుల్ (4 బ్యాటింగ్) అజేయంగా క్రీజులో ఉన్నారు. భారత్ మరో 242 పరుగుల వెనుకంజలో కొనసాగుతుంది.

సెషన్ 1 : మెరిసిన షమి, అశ్విన్

పొగమంచు అప్పుడప్పుడే తొలుగుతుండగా బ్యాటింగ్‌కు వచ్చిన ఆస్ట్రేలియా తొలి గంట ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. ఓపెనర్లు డెవిడ్ వార్నర్ (15), ఉస్మాన్ ఖవాజ (81) వికెట్ నిలుపుకున్నారు. ఆరంభంలో వికెట్లు ఆశించిన భారత్‌కు కాస్త నిరాశ తప్పలేదు. ఓ ఎండ్‌లో వార్నర్ నెమ్మదించినా.. ఉస్మాన్ ఖవాజ పరుగుల వేటలో దూకుడు ప్రదర్శించాడు. ఓపెనర్లు తొలి వికెట్‌కు 50 పరుగులు జోడించారు. ఇక్కడే పేసర్ మహ్మద్ షమి బ్రేక్ సాధించాడు. డెవిడ్ వార్నర్‌ను వెనక్కి పంపించాడు. మార్నస్ లబుషేన్ (18)తో కలిసి ఖవాజ పోరాటం కొనసాగించాడు. కానీ ట్రంప్‌కార్డ్ అశ్విన్ ఒకే ఓవర్లో రెండు వికెట్లతో అదరగొట్టాడు. తొలుత లబుషేన్‌ను వికెట్ల ముందు బోల్తా కొట్టించిన అశ్విన్.. స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ (0)ను డకౌట్‌గా వెనక్కి పంపాడు. మూడు బంతుల వ్యవధిలో రెండు వికెట్లు పడగొట్టిన అశ్విన్ తొలి సెషన్లో భారత్‌కు పైచేయి సాధించాడు. లంచ్ విరామ సమయానికి ఆస్ట్రేలియా 94/3తో నిలిచింది.

సెషన్ 2 : నిలిచిన ఖవాజ, హ్యాండ్స్‌కాంబ్

లంచ్ బ్రేక్ అనంతరం ఆస్ట్రేలియాకు మరో షాక్ తగిలింది. ట్రావిశ్ హెడ్ (12)ను షమి సాగనంపాడు. 108/4తో ఆస్ట్రేలియా మరోసారి కష్టాల్లో కూరుకుంది. ఈ సమయంలో ఓపెనర్ ఖవాజకు తోడుగా నిలిచిన పీటర్



హ్యాండ్స్‌కాంబ్ (72 నాటౌట్) ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఈ జోడీ ఐదో వికెట్‌కు విలువైన పరుగులు జోడించింది. 12 ఫోర్లు, ఓ సిక్సర్‌తో దూకుడుగా పరుగులు సాధించిన ఖవాజ ఇన్నింగ్స్‌ను జడేజా ముగించాడు. దీంతో 59 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (0) నిరాశపరిచాడు. వరుస ఓవర్లలో ఖవాజ, అలెక్స్ కేరీ నిష్క్రమించటం ఆసీస్‌ను మరింత దెబ్బకొట్టింది. కెప్టెన్ పాట్ కమిన్స్ (33) అండతో టీ విరామ సమయానికి మరో వికెట్ పడకుండా జాగ్రత్త వహించాడు పీటర్ హ్యాండ్స్‌కాంబ్. ఈ సెషన్లో 105 పరుగులు సాధించిన ఆస్ట్రేలియా మూడు కీలక వికెట్లు కోల్పోయింది.

సెషన్ 3 : ఆసీస్‌ను కుప్పకూల్చారు

తొలి రెండు సెషన్లలో 6 వికెట్లకు 199 పరుగులు చేసిన ఆస్ట్రేలియా.. చివరి సెషన్లో నాలుగు వికెట్లు కోల్పోయి 64 పరుగులే చేసింది. జడేజా ఓవర్లో పీటర్ హ్యాండ్స్‌కాంబ్ క్యాచౌట్‌గా నిష్క్రమించాల్సిన వచ్చినా.. నో బాల్ కావటంతో విలువైన జీవనదానం లభించింది. అక్కడ్నుంచి రెచ్చిపోయిన హ్యాండ్స్‌కాంబ్ ఆసీస్‌కు మంచి స్కోరు కట్టబెట్టాడు. ఆరు ఫోర్లతో 110 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన హ్యాండ్స్‌కాంబ్ ఓ ఎండ్‌లో అజేయంగా నిలిచాడు. కెప్టెన్ పాట్ కమిన్స్ 33 పరుగులతో రాణించాడు. టెయిలెండర్లను జడేజా, షమిలు వరుసగా అవుట్ చేయటంతో ఆసీస్ కథ 263 పరుగుల వద్ద ముగిసింది. కమిన్స్, టాడ్ మర్ఫీ (0)లను జడేజా.. నాథన్ లయాన్ (0), మాథ్యూ (6)లను షమి అవుట్ చేశారు.

ఇక మూడో సెషన్లో చివర్లో బ్యాటింగ్‌కు వచ్చిన భారత్ వికెట్ నష్టపోకుండా 21 పరుగులు జోడించింది. కెప్టెన్ రోహిత్ శర్మ (13 నాటౌట్, 34 బంతుల్లో 1 ఫోర్), కెఎల్ రాహుల్ (4 నాటౌట్, 20 బంతుల్లో) అజేయంగా ఆడుతున్నారు. కెప్టెన్ పాట్ కమిన్స్ ఒక్కడే ఆసీస్ శిబిరంలో పేస్ బౌలర్. ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్లతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా నేడు భారత బ్యాటర్లను ఏ విధంగా నిలువరిస్తుందనేది ఆసక్తికరం. ఇక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ రెండో టెస్టు ఆరంభానికి ముందు టీమ్ ఇండియా స్టార్ బ్యాటర్ చతేశ్వర్ పుజారను బీసీసీఐ ఘనంగా సత్కరించింది. కెరీర్ వందో టెస్టు ఆడుతున్న పుజారకు సునీల్ గవాస్కర్ బోర్డు తరఫున జ్ఞాపిక అందజేశాడు.

స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : డెవిడ్ వార్నర్ (సి) భరత్ (బి) షమి 15, ఉస్మాన్ ఖవాజ (సి) రాహుల్ (బి) జడేజా 81, లబుషేన్ (ఎల్బీ) అశ్విన్ 18, స్టీవ్ స్మిత్ (సి) భరత్ (బి) అశ్విన్ 0, ట్రావిశ్ హెడ్ (సి) రాహుల్ (బి) షమి 12, పీటర్ హ్యాండ్స్‌కాంబ్ నాటౌట్ 72, అలెక్స్ కేరీ (సి) కోహ్లి (బి) అశ్విన్ 0, పాట్ కమిన్స్ (ఎల్బీ) జడేజా 33, టాడ్ మర్ఫీ (బి) జడేజా 0, నాథన్ లయాన్ (బి) షమి 10, మాథ్యూ కుహ్నేమాన్ (బి) షమి 6, **ఎక్స్‌ట్రాలు :** 16, **మొత్తం :** (78.4 ఓవర్లలో ఆలౌట్) 263.

వికెట్ల పతనం : 1-50, 2-91, 3-91, 4-08, 5-167, 6-168,7-2278-2279-246, 10-263.

బౌలింగ్ : మహ్మద్ షమి 14.4-4-60-4, మహ్మద్ సిరాజ్ 10-2-30-0, రవిచంద్రన్ అశ్విన్ 21-4-57-3, రవీంద్ర జడేజా 21-2-68-3, అక్షర్ పటేల్ 12-2-34-0.

భారత్ తొలి ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ బ్యాటింగ్ 13, కెఎల్ రాహుల్ బ్యాటింగ్ 4, **ఎక్స్‌ట్రాలు :** 4, **మొత్తం :** (9 ఓవర్లలో) 21.

బౌలింగ్ : పాట్ కమిన్స్ 3-1-7-0, మాథ్యూ కుహ్నేమాన్ 4-1-6-0, నాథన్ లయాన్ 2-0-4-0.

ముంబయిపై అహ్మదాబాద్ గెలుపు



హైదరాబాద్ : బెంగళూర్‌లో మిశ్రమ ఫలితాలు చవిచూసిన అహ్మదాబాద్ డిఫెండర్స్.. హైదరాబాద్‌లో అదిరే విజయం సాధించింది. ప్రైమ్ వాలీబాల్ లీగ్ రెండో సీజన్‌లో శుక్రవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన గ్రూప్ దశ మ్యాచ్‌లో ముంబయి మెటియర్స్‌పై అహ్మదాబాద్ డిఫెండర్స్ 4-1తో ఘన విజయం సాధించింది. 14-15, 15-12, 15-14, 15-13, 15-14తో అహ్మదాబాద్ డిఫెండర్స్ గెలుపొందింది. అహ్మదాబాద్‌కు ఇది రెండో విజయం కాగా, ముంబయికి మూడో ఓటమి. అహ్మదాబాద్ తరఫున నందగోపాల్, రామస్వామి సూపర్ స్పైక్‌లతో అదరగొట్టారు. ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో నేడు హైదరాబాద్ బ్లాక్‌హాక్స్‌తో చెన్నై బ్లిట్జ్ తలపడనుంది.

సార్‌కి.. ప్రేక్షకుల బ్రహ్మరథం



వెంకీ అట్లూరి, సూర్యదేవర నాగవంశీ

తమిళ అగ్ర కథానాయకుడు ధనుష్ నటించిన ద్విభాషా చిత్రం 'సార్'(వాతి). ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మించింది.

శ్రీకర స్టూడియోస్ సమర్పించిన ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ధనుష్ సరసన సంయుక్త మీనన్ నటించింది.

భారీ అంచనాలతో శుక్రవారం థియేటర్లలో విడుదలైంది. గురువారం సాయంత్రం ప్రదర్శించిన ప్రీమియర్ షోల నుంచే ఈ చిత్రం పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. ప్రేక్షకులు, విశ్లేషకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తుండటంతో తాజాగా చిత్ర బృందం విలేకర్ల సమావేశం నిర్వహించి, తమ ఆనందాన్ని షేర్ చేసుకున్నారు.

నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ, "చాలా ఆనందంగా ఉంది. నాకు సంవత్సరం తర్వాత డిస్ట్రిబ్యూటర్ల నుంచి హౌస్ ఫుల్ అని ఫోన్లు వస్తున్నాయి. నిన్న ప్రీమియర్లకు మంచి టాక్ రావడంతో.. చిన్న చిన్న ఏరియాలలో కూడా మార్నింగ్ షోలు హౌస్ ఫుల్ అయ్యాయి. ప్రతి షోకి వసూళ్ళు పెరుగుతున్నాయి. గతేడాది ఫిబ్రవరిలో విడుదలైన 'భీమ్లా నాయక్, డీజే టిల్లు' సినిమాలకు హౌస్ ఫుల్స్ అని ఫోన్లు వచ్చాయి. మళ్ళీ సంవత్సరం తర్వాత ఇప్పుడు ఈ సినిమాకు అంత మంచి స్పందన రావడం సంతోషంగా ఉంది. మొదట ఒకట్రెండు ప్రీమియర్‌లు అనుకున్నాం. ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందనతో షోలు పెంచుకుంటూ పోయాం. ఒక్క హైదరాబాద్‌లోనే 25 ప్రీమియర్ షోలు వేశాం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కలిపి మొత్తం 40 షోలు వేశాం. ధనుష్ 'రఘువరన్ బి.టెక్' తెలుగులో టోటల్ రన్ మీద ఎంత వసూలు చేసిందో ఆ మొత్తం ఒక్కరోజులోనే ఈ చిత్రానికి వస్తాయి. తమిళ్‌లో కూడా అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఓవరాల్‌గా ధనుష్ కెరీర్‌లో రికార్డు స్థాయి వసూళ్ళు వచ్చే అవకాశముంది' అని అన్నారు.

'2018 లో వచ్చిన నా మొదటి సినిమా 'తొలిప్రేమ' తర్వాత మళ్ళీ ఇప్పుడే అందరి నుంచి ఫోన్లు వస్తున్నాయి. విడుదలకు ముందు నిద్ర కూడా సరిగా పట్టేది కాదు. కానీ ప్రీమియర్లకు వచ్చిన స్పందన చూశాక ప్రశాంతంగా నిద్రపోయాను. ఉదయాన్నే చెన్నై వెళ్లి మార్నింగ్ షో కూడా చూసొచ్చాను. నేను ఇంతవరకు ఎప్పుడూ చూడలేదు. చివరి 15 నిమిషాలు ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. నేను భాగమైన సినిమాకి ప్రేక్షకుల నుంచి ఇంతమంచి స్పందన రావడం గర్వంగా ఉంది. ఈ ఆలోచనను ముందుకు తీసుకు వెళ్లిన వంశీకి ధన్యవాదాలు. ఆయన చెప్పినట్లుగా ముందు రెండు ప్రీమియర్లు అనుకున్నాం.. కానీ అవి పెరుగుతూ 40 షోల వరకు వెళ్లాయి. ఈ 40 షోలకు వచ్చిన స్పందనతో తమిళ్‌లో భారీ ఓపెనింగ్స్ వచ్చాయి. ఓ మంచి సినిమాని ప్రేక్షకులకు అందించినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇంత మంచి అవకాశాన్ని ఇచ్చిన ధనుష్, సంయుక్తా మీనన్, నాగవంశీ, చినబాబు (సూర్యదేవర రాధాకృష్ణ), త్రివిక్రమ్‌గారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని దర్శకుడు వెంకీ అట్లూరి చెప్పారు.

నవచిత్రం

భారీ స్థాయిలో విడుదల



హ్రిదు హరూన్

ప్రముఖ కొరియోగ్రాఫర్ బృందా గోపాల్ దర్శకత్వంలో హ్రిదు హరూన్‌ను హీరోగా పరిచయం చేస్తూ ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కించిన చిత్రం 'కోనసీమ థగ్స్'. సింహ, ఆర్ కె సురేష్, మునిష్ కాంత్, అనస్వర రంజన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ షిబు తమీన్స్ తనయురాలు రియా షిబు హెచ్ ఆర్ పిక్చర్స్ బ్యానర్ పై జియో స్టూడియోస్ భాగస్వామ్యంతో భారీ స్థాయిలో నిర్మించారు.

టాలీవుడ్‌లో అగ్ర నిర్మాణ సంస్థ అయిన మైత్రి మూవీ మేకర్స్ ఇటీవలే మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి పేరిట పంపిణీ రంగంలోకి కూడా ప్రవేశించారు. సంక్రాంతికి విడుదలై ఘనవిజయం సాధించిన భారీ చిత్రాలు 'వాల్తేరు వీరయ్య', 'వీర సింహా రెడ్డి'ని నిర్మించడమే కాకుండా ఒకే సమయంలో నైజాం ఏరియాలో రిలీజ్ చేసి సంచలనం సృష్టించారు. ఆద్యంతం ఉత్కంఠ రేపేలా రూపొందిన ఈ చిత్రానికి సంబంధించి ట్రైలర్, పోస్టర్స్, అమ్మన్ సాంగ్ చూసి ఇంప్రెసై తెలుగు వెర్షన్‌ను మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి ద్వారా అన్ని ఏరియాల్లోనూ రిలీజ్ చేస్తున్నారు. ట్రైలర్‌తో అంచనాలు పెంచేసిన 'కోనసీమ థగ్స్' ఇటీవల విడుదలైన 'అమ్మన్' పాటతో అన్ని వర్గాల ప్రేక్షకుల్లో సినిమా పట్ల మంచి బజ్ క్రియేట్ చేసింది. ఇప్పుడు మైత్రి సంస్థ జత కలవడంతో, చిత్రం భారీ స్థాయిలో ఈనెల 24న ప్రపంచవ్యాప్తంగా అత్యధిక థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ నెల 19న ప్రీ రిలీజ్ వేడుకను చిత్ర బృందం హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది.

వాస్తవం కోసం గతం చేసిన యుద్ధం



సృష్టి దాంగే

వివివి ప్రొడక్షన్స్ పతాకంపై ఎం.ఏ.చౌదరి దర్శకత్వంలో కె.కోటేశ్వరరావు నిర్మించిన చిత్రం 'వీరఖడ్గం'. చరిత్ర శిథిలమైనా, దాని మూలాలు ఎక్కడో ఒక చోట మిగిలే ఉంటాయి. పగ కూడా అంతే. ఒక మనిషిని నాశనం చేయాలనుకుంటే ఎన్ని జన్మలైన సరే, దాన్ని సాధించే వరకు మనిషి జీవితం మసి అయినా, ఆ శవమే మృగమై వెంటాడుతుంది. వాస్తవాన్ని వెంటాడుతూ గతం చేసిన యుద్ధమే ఈ 'వీరఖడ్గం' సినిమా అని మేకర్స్ తెలిపారు.

లైన్ ప్రొడ్యూసర్ మారిశెట్టి సునీల్ కుమార్ మాట్లాడుతూ, 'సినిమా అద్భుతంగా వచ్చిందని ప్రీమియర్ చూసిన సినీ ప్రముఖులు ప్రశంసించారు. ఎమ్.ఏ చౌదరి స్క్రీన్ ప్లే, డైరెక్షన్ ఈ చిత్రాన్ని ఇంకో స్థాయికి తీసుకెళ్లాయి. రైటర్ ఘటికాచలం మాటలు, షయాక్ పార్వాజ్ స్వరాలు, నందు, దేవరాజ్ మాస్టర్ పోరాటాలు అద్భుతంగా వచ్చాయి. మార్చి మొదటి వారంలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు.

ఆ.. పాయింట్ ఏంటి?



విశ్వంత్ దుద్దుంపూడి

దండమూడి బాక్సాఫీస్ బ్యానర్‌పై రూపొందుతున్న తొలి చిత్రం 'కథ వెనుక కథ'. విశ్వంత్ దుద్దుంపూడి, శ్రీజిత గౌష్, శుభ శ్రీ ప్రధాన తారాగణంగా నటించారు.

కృష్ణ చైతన్య దర్శకత్వంలో ఈ చిత్రాన్ని అవనింద్ర కుమార్ నిర్మిస్తున్నారు. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్ర టీజర్‌ను అగ్ర దర్శకుడు గోపీచంద్ మలినేని శుక్రవారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'టీజర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. సినిమా పెద్ద హిట్ కావాలని ఆశిస్తున్నాను' అని తెలిపారు. ఓ యంగ్ డైరెక్టర్ (విశ్వంత్) మరో పాత్రకు ఓ క్రైమ్ కథను చెప్పటంతో టీజర్ స్టార్ట్ అవుతుంది. సిటీలో చాలా వరకు మిస్సింగ్ కేసులుగా నమోదు అవుతున్న అమ్మాయిలను ఎవరో హత్య చేస్తుంటారు. ఇంత భయంకరమైన హత్యలను చేస్తున్న హంతకుడెవరో పోలీసులకు అంతు చిక్కదు. దీంతో వారు కేసుని సత్య (సునీల్) అనే సిన్సియర్ పోలీస్ ఆఫీసర్‌కి అప్పగిస్తారు. ఆ తర్వాత సత్య ఈ కేసుని ఎలా ఛేదించాడు?, అతను టీజర్‌లో చెప్పినట్లు మిస్ అయిన ఓ పాయింట్ ఏంటి? అనే విషయాలను తెలుసుకోవాలంటే 'కథ వెనుక కథ' సినిమాని చూడాల్సిందే అన్నట్టుగా టీజర్‌ని మేకర్స్ కట్ చేశారు. నిర్మాత దండమూడి అవనీంద్ర కుమార్ ఈ చిత్రాన్ని అన్‌కాంప్రమైజ్డ్‌గా, ప్రెస్టీజియస్‌గా రూపొందించినట్లు విజువల్స్ చూస్తే క్లియర్ కట్‌గా అర్థమవుతుంది. ఈ సస్పెన్స్ థ్రిల్లర్ ఆడియోను ఆదిత్య మ్యూజిక్ రిలీజ్ చేస్తుంది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ఎనౌన్స్ చేస్తామని చిత్ర యూనిట్ తెలియజేసింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

'బట్టీ'ల్లోనే బతుకులు బుగ్గి

కార్మికుల్ని వేధిస్తున్న ఇటుకబట్టీల యజమానులు

- చాలీచాలని కూలితో వెట్టి
- లేబర్‌యాక్ట్, వాల్టా చట్టాలకు తూట్లు
- దర్గాతండాలో ఏడుగురు బాలికలపై లైంగిక వేధింపులు
- నిందితుల అరెస్ట్

ఇటుక బట్టీల్లో వలస కార్మికుల బతుకులు బుగ్గిపాలవుతున్నాయి. చాలీచాలని కూలి ఇస్తూ వెట్టి చేయించుకుంటున్నారు. బట్టీల యజమానులు దుర్మార్గంగా వ్యవహరిస్తూ బాలికలు, మహిళలను లైంగికంగా వేధిస్తు న్నారు. దుమ్ముధూళిలో వలస కార్మికులతో రాత్రింబవళ్లూ వెట్టి చేయించు కుంటూ బానిసల కన్నా హీనంగా చూస్తున్నారు. అనుమతుల్లేకున్నా బట్టీలు పెట్టడమే కాకుండా మట్టి, కలప, బొగ్గు, యాస్‌ను తరలిస్తున్నారు. బాల కార్మికులతో పనులు చేయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్, మైనింగ్, లేబర్ కమిషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇందుకు దర్గాతండాలో ఏడుగురు వలస కార్మిక బాలికలపై లైంగిక వేధింపుల ఘటనే ఉదాహరణ. ఆ కార్మికులు వారి రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేయడం.. వారు ఇక్కడికి మెయిల్ పంపడంతో రాష్ట్ర అధికారులు స్పందించారు. ఈ ఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ కొనసాగుతోంది.





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పట్టణీకరణ, గృహనిర్మాణ రంగం పెరుగుదలతో ఇటుకకు డిమాండ్ పెరిగింది. కోట్ల రూపాయల లాభాలు గడించే అవకాశ ముండటంతో ఇటుకబట్టీలు విస్తరిస్తున్నాయి. సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్, మెదక్, ఆందోల్, నర్సాపూర్, హుస్నాబాద్, సిద్దిపేట, గజ్వేల్, బెజ్జంకి, వట్‌పల్లి, మునిపల్లి, కల్హేర్ వంటి ప్రాంతాల్లో 500 వరకు ఇటుక బట్టీలు నడుస్తున్నాయి. ఇటుక తయారీ, బట్టీ కాల్చడం, ఎగుమతి పనులన్నీ వలస కార్మికులే చేస్తారు. స్థానికంగా లేబర్ డిమాండ్ ఉందనే నెపంతో ఇతర రాష్ట్రాల నుంచి ఏజెంట్ల ద్వారా చౌకగా లేబర్‌ను తీసుకొస్తున్నారు. వీరికి కనీస వేతనాలు, సదుపాయాలేవీ కల్పించట్లేదు.

వలస కార్మికులతో వెట్టి చాకిరీ

బతుకుదెరువు కోసం ఎక్కడెక్కడి నుంచో కార్మికులు వలసలొచ్చి సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో బట్టీల్లో పనిచేస్తున్నారు. అడవులు, పొలాలు, గుట్టల ప్రాంతాల్లోని బట్టీల వద్ద చిన్న చిన్న పాకల్లో ఉంటూ రాత్రింబవళ్లూ పనిచేస్తారు. ఒడిషా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, జార్ఖండ్, బీహార్ ప్రాంతాల కూలీలు ఇక్కడి బట్టీల్లో పనిచేస్తున్నారు. కుటుంబంతో సహా వచ్చే కార్మికులకు ఒక రేటు ఇస్తామని యజమానులు ఒప్పందం చేసుకుంటారు. అడ్వాన్స్‌గా కొంత ఏజెంట్‌కు చెల్లించి ఇటుక తయారీ నుంచి బట్టీ కాల్చే వరకు కార్మికులతో పనిచేయించుకుంటారు. అడ్వాన్స్ సొమ్ము ఇచ్చిన యజమానులు నెలల తరబడిగా కూలీలకు డబ్బులివ్వడం లేదు. డబ్బులిస్తే కూలీలు వెళ్లిపోతారనే నెపంతో కనీస అవసరాలైన బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలకు కూడా డబ్బులివ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. ఒక్కసారి ఇక్కడ పనికి కుదిరితే తిరిగి బయటపడటం కష్టమని కూలీలు చెబుతున్నారు. అలా ప్రయత్నిస్తే దాడి చేయడం, వేధింపులకు గురి చేయడం పరిపాటిగా మారిందంటున్నారు. రాత్రుళ్ల చీకట్లోనే మగ్గుతారు. నీటి వసతి ఉండదు. అనారోగ్యం పాలైతే మందుగోలికి కూడా డబ్బులివ్వరని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దర్గాతండా బట్టీలో 72 మంది ఒడిషా కార్మికులు పనిచేశారు. వీరికి రూ.10 లక్షల అడ్వాన్స్‌గా ఇచ్చి తీసుకొచ్చారు. ఏజెంట్‌కు డబ్బులిచ్చిన యజమాని మూడు నెలలుగా పనిచేస్తున్న కార్మికులకు పైసా ఇవ్వకుండా వేధించాడు. పిల్లలపైనా లైంగిక వేధింపులకు పాల్పడటంతో కార్మికులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

అనుమతులుండవు.. చట్టాలేవీ పట్టవు

ఇటుకబట్టీలు పెట్టాలంటే గ్రామ పంచాయతీ అనుమతి పొందాలి. లేబర్ పనిచేస్తున్నట్టు కార్మిక శాఖలో నమోదు చేయాలి. మట్టి తరలింపుకు రెవెన్యూ, భూగర్భ జల శాఖ అనుమతి పొందాలి. చెట్లు నరకడం, రవాణా చేయడానికి అటవీ, చెక్‌పోస్ట్ అనుమతులుండాలి. భారీ లైట్లు, మోటర్లు నడిపేందుకు విద్యుత్ కనెక్షన్‌కు అనుమతుండాలి. పొల్యూషన్ సర్టిఫికెట్ తీసుకోవాలి. ఇటుక రవాణాకు రవాణా శాఖ అనుమతి పొందాలి. బాల కార్మికులు పనిచేయకూడదు. బట్టీ కాల్చడం, కూలీల నివాసం వద్ద అగ్ని ప్రమాదాలు జరిగితే రక్షించుకునే ఏర్పాట్లున్నా యని ఫైర్ సర్టిఫికెట్ ఉండాలి. నీటిని వినియోగించేందుకు, చెర్వు మట్టి తవ్వేందుకు ఇరిగేషన్ పర్మిషన్ తీసుకోవాలి. కానీ..! ఉమ్మడి మెదక్ జిల్లాలో బట్టీల్లో ఇవేవీ పట్టకుండా ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. ఇటుక బట్టీలు నడిపే యజమానులు స్థానిక ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకుల అండ ఉంటే చాలు అనే ధోరణిలో ఉన్నారు.

మట్టిలో మగ్గుతున్న బాల కార్మికులు

విద్యా హక్కు చట్టం ప్రకారం 6-14 సంవత్సరాల పిల్లలంతా బడిలో ఉండాలి. కానీ..! ఇటుక బట్టీల వద్ద వలస కార్మికుల పిల్లలు పనిలో ఉంటున్నారు. వారితో ట్రాక్టర్ నడపడం, నీళ్లు పట్టడం, పొట్టు, యాస్, ఇటుకలు మోసే పనులు చేయిస్తున్నారు. చైల్డ్ ప్రొటక్షన్ అధికారులు, విద్యా శాఖ తనిఖీలు చేయట్లేదు. ఇటీవల వట్‌పల్లి, నారాయణఖేడ్, సంగారెడ్డిలో బాల కార్మికులు పనిచేసే చోట తనిఖీలు చేసిన అధికారులు యజమానులు ఇచ్చిన ముడుపులు తీసుకుని వదిలేశారన్న ఆరోపణలున్నాయి. నిజాంపేట మండలంలోని దర్గాతండాలోని ఎస్ఆర్‌బీ బ్రిక్స్ యజమాని అక్కడ పనిచేసే ఒడిషాకు చెందిన ఏడుగురు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని కేసు నమోదైంది. కార్మికుల ఫిర్యాదుతో బట్టీ యజమానులైన శంకర్, గంగాధర్, రమేష్, పరమేష్‌పై 354, 354ఎ ఐపీసీ పోస్కో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఇతర పరీక్షల నిమిత్తం బాలికల్ని సఖీ సెంటర్‌లో ఉంచారు. ఇలాంటివి వెలుగు చూడని సంఘటనలెన్నో.

నిరంతరం తనిఖీ చేయాలి



ఇటుక బట్టీలను నిరంతరం అధికారులు తనిఖీ చేయాలి. కార్మికులకు కనీస వేతనాలివ్వ కపోతే యజమానులపై చర్యలు తీసుకోవాలి. దర్గాతండా వలస కార్మికుల పిల్లల్ని లైంగికంగా వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి. యజమానులిచ్చే డబ్బులు తీసుకుని అధికారులు తనిఖీలు చేయట్లేదు. వలస కార్మికులకు రక్షణ, భద్రత కల్పించాలి. లేబర్, రెవెన్యూ, అటవీ, మైనింగ్, పొల్యూషన్, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్లనే బట్టీ యజమానులు మాఫియాలా వ్యవహరిస్తున్నారు.

అతిమెల మాణిక్యం- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

అనుమతుల్లేకపోతే చర్యలు

ఇటుక బట్టీలు గ్రామ పంచాయతీ అనుమతి తీసుకోవాలి. అనుమతుల్లేకుండా నడిపితే చర్యలు తీసుకుంటాం. దర్గాతండా ఎస్ఆర్‌బీ బ్రిక్స్‌ను అనుమతులున్నాయి. లేబర్‌ను ఇబ్బందులు పెట్టినందుకు చర్యలు తీసుకుంటాం.

సురేష్‌మోహన్- సంగారెడ్డి డీపీఓ

భారత్‌లో గూగుల్ 450 మందిపై వేటు

న్యూఢిల్లీ : ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ భారత్‌లో 450 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. ప్రపంచ వ్యాప్తంగా 12,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు గడిచిన జనవరిలో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే భారత్‌లో కోతలు ప్రారంభించినట్టు సమాచారం. భారత్‌లోని వివిధ విభాగాల్లో పనిచేసే 450 మంది ఉద్యోగులను తొలగిస్తుందని రిపోర్టులు వస్తున్నాయి. గూగుల్ ఇక్కడ హైదరాబాద్, బెంగళూరు, గుర్‌గావ్‌లో ప్రధాన కార్యాలయాలను కలిగి ఉంది. గూగుల్ నుంచి తమను అర్ధంతరంగా తొలగించారని పలువురు ఉద్యోగులు లింక్డిన్‌లో పోస్ట్ చేస్తున్నారు. గూగుల్ ఇండియాలో ఇటీవల చేపట్టిన లేఆఫ్స్‌లో అధిక నైపుణ్యాలు కలిగిన టాలెంటెడ్ కొలీగ్స్ కొలువులు కోల్పోయినట్టు తెలిసిందని గూగుల్ ఇండియా ఉద్యోగి రజనీష్‌కుమార్ ఓ పోస్ట్‌లో పేర్కొన్నారు. గూగుల్ ఇండియా లేఆఫ్స్‌లో తాను బాధితుడినయ్యానని గూగుల్ ఇండియాలో అకౌంట్ మేనేజర్ కమల్ దవే పేర్కొన్నారు.

భారత్‌లో ట్విటర్ ఆఫీసుల మూత

సోషల్ మీడియా దిగ్గజం ట్విట్టర్ భారత్‌లోని తన మూడు కార్యాలయాల్లో రెండింటిని మూసి వేస్తున్నట్టు సమాచారం. దేశ రాజధాని ఢిల్లీ, ముంబయిలోని ఆఫీసులను మూసివేస్తుందని రిపోర్టులు వస్తున్నాయి. ఈ కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బందిని ఇంటి నుంచి పని చేయాలని సూచించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా.. ఎక్కువ మంది టెక్ ఇంజనీర్లు పని చేస్తున్న బెంగళూరులోని కార్యాలయాన్ని మాత్రం కొనసాగించాలని నిర్ణయించింది. ట్విట్టర్‌ను ఎలన్ మస్క్ కొనుగోలు చేసినప్పటి నుంచి అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా సగం పైగా ఉద్యోగులను తొలగించారు. భారత్‌లో ఏకంగా 90 శాతం మంది సిబ్బందికి కోత పెట్టారు.

రూపాయి ఢీలా

- దాలర్‌తో రూపాయి విలువ 14 పైసలు పతనం



న్యూఢిల్లీ : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి మారకం విలువ మళ్లీ ఒత్తిడికి గురి అవుతోంది. శుక్రవారం సెషన్‌లో డాలర్‌తో రూపాయి విలువ 14 పైసలు కోల్పోయి 82.84కు దిగజారింది. ఉదయం ఇంత్రకితం సెషన్‌లో 82.70 వద్ద ముగిసింది. దేశీయ మార్కెట్లలో స్తబ్దత, ఎఫ్ఐఐల రాకలో తగ్గుదల రూపాయిని ఒత్తిడికి గురి చేస్తుంది. డాలర్ విలువ పెరగడం, ఆసియన్ మార్కెట్ల పతనం రూపాయి విలువపై ఒత్తిడిని పెంచుతుందని బీఎన్‌పీ పరిబాస్‌కు చెందిన షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరీ పేర్కొన్నారు. డాలర్ పటిష్టం కావడం ద్వారా రూపాయి విలువ మరింత పడిపోవచ్చన్నారు.

భర్త మృతికి కారకులైన.. ఎస్ఐ, కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని వినతి



నవతెలంగాణ-మెదక్ టౌన్

చోరీ కేసులో అరెస్టు చేసి నిందితుడైన తన భర్తను తీవ్రంగా కొట్టి.. తన మరణానికి కారణమైన మెదక్ పట్టణ ఎస్ఐ, కానిస్టేబుళ్లపై హత్య కేసు నమోదు చేయాలని మృతుని భార్య సిద్దేశ్వరి శుక్రవారం మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. చోరీ కేసులో ఖాదర్ ఖాన్‌ను గత నెల 29వ తేదీన అరెస్టు చేసి, అదే రోజు రాత్రి ఇంట్లో విడిచిపెట్టినట్టు తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఖాదర్‌ఖాన్‌ను మెదక్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా, గురువారం రాత్రి అతని పరిస్థితి విషమించి మృతి చెందినట్టు తెలిపారు. తన భర్తపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి అవయవాలు అన్ని దెబ్బతినేలా చేసి ఆయన మరణానికి కారణమైన ఎస్ఐ రాజశేఖర్, కానిస్టేబుల్ ఆర్ ప్రవీణ్ కుమార్, బొరకల ప్రశాంత్‌పై హత్య కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని బాధితురాలు సిద్దేశ్వరి మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుత్ ఉద్యోగుల రక్తదానం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు 69వ జన్మదినం సందర్భంగా విద్యుత్ ఉద్యోగులు శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యుత్ సౌధలో ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్‌శర్మ, టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. పీవీ నర్సింహారావు మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్, టీఎస్ జెన్‌కో సంయుక్తాధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యుత్ ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా విద్యుత్ ఉద్యోగులు మంచి కార్యక్రమం చేపట్టారని సునీల్‌శర్మ, ప్రభాకరరావు కొనియాడారు. రక్తదాన ప్రాధాన్యతను వివరించారు. రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాలను ప్రస్తావించారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితోనే రాష్ట్రంలో 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా సాధ్యమైందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ శివాజీ, టీఎస్ జెన్‌కో జేఎమ్‌డీ సీ శ్రీనివాసరావు, డైరెక్టర్ అశోక్‌కుమార్, పీవీ నర్సింహారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సీఈఓ డాక్టర్ ఎన్వీ సుధాకరన్, సివిల్ సర్జన్ ధీరజ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు బీజేపీ పెద్దపీట

ఎనిమిదేండ్లలో లక్షల కోట్ల అప్పులు మాఫీ : బీజేపీపై మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

- కేంద్ర మంత్రులు తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు



నవతెలంగాణ-గజ్వేల్

బడా వ్యాపారులకు, కార్పొరేట్లకు బీజేపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడా వ్యాపారులు ఎన్ని అప్పులు తీసుకున్న వాటిని కేంద్ర ప్రభుత్వం మాఫీ చేస్తోందని, అంతేకాకుండా రెడ్ కార్పొరేట్లకు ఎనిమిదేండ్లుగా రూ.లక్షల కోట్లు కేటాయించడమే కాకుండా రూ.12 లక్షల కోట్ల అప్పులను మాఫీ చేసిందని ఆరోపించారు. కానీ ఉపాధి హామీ పని దినాలను పెంచకుండా.. బడ్జెట్‌లో నిధులు పెంచకుండా పేద ప్రజలను ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతీస్తున్నదన్నారు. తెలంగాణలో ఉపాధికి రూ.30 వేల కోట్లు కోత పెట్టిందని, రాష్ట్రానికి బడ్జెట్‌లో ఏమాత్రం నిధులు కేటాయించలేదని తెలిపారు.

పైగా మంత్రులు నిర్మలా సీతారామన్, కిషన్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారని ఆరోపించారు. ఖమ్మం, కరీంనగర్ జిల్లాలకు మెడికల్ కాలేజీలు మంజూరు చేయాలని ఎన్నో ఏండ్లుగా కోరుతున్నప్పటికీ.. అసలు ప్రతిపాదనలే రాలేదని కేంద్ర మంత్రి చెప్పడం సిగ్గు చేటన్నారు. 150 కళాశాలను ఇతర రాష్ట్రాలకు కేంద్రం కేటాయించినప్పటికీ.. తెలంగాణకు మాత్రం ఒక్కటి కూడా ఇవ్వలేకపోయిందన్నారు. త్వరలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండు జిల్లాల్లో మెడికల్ కాలేజ్‌లను ఏర్పాటు చేయనుందన్నారు.

కేంద్ర ప్రభుత్వం తీరును ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో లెక్కల ద్వారా చెప్పారని.. అది నూటికి నూరు శాతం వాస్తవమని తెలిపారు. బీజేపీ నెలకు రూ.లక్ష కోట్లు ఖర్చు పెడుతుందని, 8 ఏండ్లలో 100 లక్షల కోట్లు ఖర్చుపెట్టి దేశాన్ని లూటీ చేసిందని ఆరోపించారు. విభజన చట్టంలో భాగంగా తెలంగాణకు రావాల్సిన రూ.1350 కోట్లు రావటం లేదన్నారు. రైతులు గ్రామాల్లో నిర్మించుకున్న కల్లాల నిధులు రూ.150 కోట్లు రాష్ట్రానికి రావాల్సినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కింద కేవలం రూ.20 లక్షలు మాత్రమే ఖర్చు పెడుతున్నదన్నారు. కేంద్ర బడ్జెట్లో రైతులకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో కరీంనగర్, ఖమ్మం జిల్లా ప్రజలు బీజేపీ నాయకులకు కర్రు కాల్చి వాత పెడతారని తెలిపారు. విలేకరుల సమావేశంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజా శర్మ, ఎఫ్‌డీసీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్, జిల్లా గ్రంధాల సంస్థ చైర్మెన్ లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ గాడిపల్లి భాస్కర్ తదితరులు ఉన్నారు.

కాసం వెడ్డింగ్‌మాల్‌లో నకిలీ పోచంపల్లి ఇక్కత్ చీరలు

- ఈడీ, సీబీఐకు ఫిర్యాదు చేశాం : దాసు సురేశ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాసం వెడ్డింగ్ మాల్‌లో నకిలీ పోచంపల్లి ఇక్కత్ చీరలు అమ్ముతూ దేశ ప్రతిష్టను మసకబారుస్తున్నారంటూ ఈడీ, సీబీఐలకు ఫిర్యాదు చేశామని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్ తెలిపారు. ఒకే వ్యక్తి 30 మేరకు షాపులను నిర్వహిస్తూ మనీ లాండరింగ్, ఇన్ సైడ్ ట్రేడింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టుబడిన నకిలీ పోచంపల్లి ఇక్కత్ చీరలను ప్రదర్శించారు. కాసం వెడ్డింగ్ మాల్ యజమానులు అగ్రశ్రేణి సినీతారలతో ప్రచారం చేయిస్తూ ప్రజలను నమ్మించి వేల కోట్ల ఆదాయాన్ని అక్రమంగా ఆర్జిస్తున్నారని ఆరోపించారు. చేనేత కార్మికుల సంపదను కార్పొరేట్ షాంపింగ్ మాల్స్ ఈ రకంగా దోచుకుంటున్నాయని విమర్శించారు. వాటి మోసాన్ని ఆధారాలతో సహా పీఎంఓ కార్యాలయం, కేంద్ర మంత్రులు నిర్మలాసీతారామన్, పీయూష్‌గోయల్ కార్యాలయాలకు, ఎంఫోర్సు మెంట్ డైరెక్టర్‌కు, సీబీఐ డైరెక్టర్‌కు, జాతీయ బీసీ కమిషన్ చైర్మెన్‌కు, హ్యాండ్లూమ్ బోర్డు కమిషనర్‌కు తెలియ జేశామన్నారు. భవిష్యత్తులో ఎవరైనా చేతి వృత్తి దారుల శ్రమను కొల్లగొడితే కటకటాలపాలు చేస్తా మని హెచ్చరించారు. చేనేత వస్త్రాలకు, మిల్లు వస్త్రా లకు ఒకే ట్యాక్స్ స్లాబ్ ను కొనసాగించడం వల్లనే వ్యాపారసంస్థలు అక్రమాలకు పాల్పడుతున్నాయని వివరించారు. మిల్లు వస్త్రాలపై 12 శాతం ట్యాక్సును విధించాలనీ, చేనేతపై పన్ను మినహాయించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

ప్యాడ్స్‌కూ పైసలియ్యట్లే..

కేజీబీవీలకు కాస్మోటిక్ బిల్లులకు మంగళం

- కోవిడ్ నుంచి హెల్త్ కిట్లకు రాంరాం
- ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు



నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కస్తుర్బాగాంధీ బాలికల(కేజీబీవీ) విద్యార్థినులకు కాస్మోటిక్ ఛార్జీలు అందడం లేదు. ప్రతి విద్యార్థినికి నెలకు రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉన్నా.. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పైసా ఇవ్వలేదు. ఫలితంగా ఈ విద్యాలయాల్లో విద్యనభ్యసిస్తున్న బాలికలకు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చివరకు ప్యాడ్స్ కొనేందుకు సైతం డబ్బుల్లేని పరిస్థితి నెలకొంది. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన హెల్త్ కిట్‌లో.. విద్యార్థినులకు అవసరమైన సబ్బులతో పాటు నూనెడబ్బా, ప్యాడ్స్, బొట్టుబిళ్లలు, పౌడర్ తదితర వస్తువులను అందిస్తుంది. ఈ కిట్ కొంత ఉపయోగకరమయ్యింది. కానీ అవి హఠాత్తుగా ఆగిపోయ్యాయి. అధికారుల నుంచి సమాచారమూ లేదు. సందేంట్లో సడేమియాలా కేజీబీవీల్లో ప్యాడ్స్‌ను ఒకరి దగ్గరే కొనాలంటూ కేజీబీవీ ఉన్నతాధికారి ఒత్తిడి చేస్తున్నట్టు తెలిసింది.

నిజామాబాద్ జిల్లాలో మొత్తం 25 కేజీబీవీలున్నాయి. ఇందులో మొత్తం 5,652 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. కాస్మోటిక్ ఛార్జీల కింద ఒక్కో విద్యార్థికి నెలకు రూ100 చొప్పున విడుదల చేస్తామన్న సర్కారు.. ఇప్పటికీ నయా పైసా చెల్లించలేదు. విద్యాసంవత్సరం చివరకు వచ్చిన ఈ సమయంలో విద్యార్థినులకు ఖాతాలు ప్రారంభించే పని చేస్తున్నారు. జిల్లాలో 5652 మంది విద్యార్థులకు నెలకు వంద చొప్పున ప్రతి నెలా రూ.5,65,200 చొప్పున సంవత్సరానికి రూ.67 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి డబ్బులు రాకపోవడంతో కుటుంబ సభ్యులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కేజీబీవీల్లో బలహీన సామాజిక వర్గాలకు చెందిన పేద విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు.

కేజీబీవీల్లో ప్యాడ్స్ దందా...

కేజీబీవీల్లో హెల్త్ కిట్ నిలిచిపోవడంతో ఇదే అదునుగా కేజీబీవీ ఉన్నతాధికారి ఒకరు తమకు సంబంధించిన వారి వద్ద నుంచి ప్యాడ్స్ కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. ఒక్కో ప్యాడ్ కిట్టు రూ.399 చొప్పున వసూలు చేస్తున్నట్టు తెలిసింది. ఇదే విషయమై సెక్టోరియల్ అధికారిని వివరణ అడగగా.. పెన్నులు, బుక్కులు అమ్మడానికి వచ్చినట్టే.. ప్యాడ్స్ అమ్మేందుకు వస్తున్నారేమోనని, తనకు తెలీదని అన్నారు. అధికారుల అనుమతి లేకుండా బయటి వ్యక్తులు కేజీబీవీల్లో ఎలా అడుగుపెడతారని ప్రశ్నించగా.. సమాధానం రాలేదు. ప్యాడ్స్ కొనుగోలు ఒత్తిడిపై ఆరా తీస్తామని ఎస్ఓ వనిత తెలిపారు.

కాస్మోటిక్ ఛార్జీలు విడుదల కాలేదు

కేజీబీవీల్లో కాస్మోటిక్ ఛార్జీలు విడుదల కాలేదు. కాస్మోటిక్ ఛార్జీలను నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రస్తుతం ఖాతాలు తీస్తున్నాం. ఖాతాలు ప్రారంభించిన తరువాత విద్యార్థినుల అటెండెంట్స్ ఆధారంగా జూన్ నుంచి డబ్బులు వేస్తారు.

సింగం వనిత(సెక్టోరియల్ అధికారి)

విద్యుత్ కార్మికుడి మృతి

- స్తంభంపై నుంచి జారి పడ్డారంటున్న అధికారులు
- కరెంట్ షాక్‌తోనే మృతిచెందాడని కుటుంబీకుల ఆరోపణ


నాగరాజు(ఫైల్)

నవతెలంగాణ - సిరిసిల్ల క్రైం

విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి ఓ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగింది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం తీగలపల్లి గ్రామానికి చెందిన వనమాల నాగరాజు(22) సిరిసిల్ల పట్టణం సెస్ పరిధిలో జరుగుతున్న విద్యుత్ మరమ్మతు పనుల్లో తాత్కాలిక కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేపడుతున్న సమయంలో ఒక్కసారిగా కింద పడిపోయాడు. వెంటనే గమనించిన తోటి కార్మికులు సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నాగరాజు మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరగా.. మరమ్మతులు చేసే సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేసినట్టు తెలిపారు. మృతుడి శరీరంపై షాక్ తగిలిన గాయాలు ఏమీ లేకపోవడంతో ప్రమాదవశాత్తు జారిపడి మరణించి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. కానీ మృతుడి కుటుంబీకులు మాత్రం నాగరాజు కరెంట్‌షాక్‌తోనే చనిపోయాడని ఆరోపిస్తున్నారు. చేతికొచ్చిన కొడుకు మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తోటి కార్మికులు కోరుతున్నారు.

సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

నవతెలంగాణ-నాగోల్



సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని హైదరాబాద్‌లోని శివరాంపల్లిలో గల రాఘవేంద్ర కాలనీలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ విభాగం, తలసేమియా ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తాలు హాజరై మాట్లాడారు. ఈ మెగా రక్తదాన కార్యక్రమం తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులకు, స్వచ్ఛంద సంస్థ సభ్యులకు సర్టిఫికెట్లు అందజేసి సన్మానించారు. శిబిరా నికి వచ్చిన వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. 'ప్రతి ఒక్కరమూ రక్తదానం చేద్దాం.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుద్దాం.. ఇదే మన ప్రజా నాయకుడికి అందించే అ పూర్వ కానుక' అన్నారు. రాజేం ద్రనగర్ కార్పొరేటర్ అర్చన, తలసేమియా సొసైటీ సీఈఓ సుమా జైని, రత్నావళి, కమిటీ సభ్యులు ఐవీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ నష్టపరిహార గడువు పెంచాలి..

- లోక్‌సభలో కేంద్రం తీరుపై ఆయా రాష్ట్రాలు అసంతృప్తి

న్యూఢిల్లీ : రాష్ట్రాలకు జీఎస్టీ నష్టపరిహారాల చెల్లింపు గడువు పెంచాలనే అంశం లోక్‌సభలో మళ్లీ చర్చనీయాంశమైంది. ఈ అంశంపై కేరళకు చెందిన వివిధ పార్టీల ఎంపీలు లేవనెత్తారు. ఆ రాష్ట్రానికి బీజేపీ ఎంపీలు సైతం గడువు పెంచాలని కేంద్రాన్ని కోరటం గమనార్హం.

రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలంటే జీఎస్టీ నష్టపరిహార చెల్లింపు గడువు పెంచాలని కేరళ సహా మిగతా రాష్ట్రాల ఎంపీలు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. దేశంలో ఒక మంచి ఆర్థిక సమాఖ్య విధానాన్ని కొనసాగించాలని, తద్వారా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ఆయా రాష్ట్రాల ఎంపీలు కేంద్రానికి తెలిపాయి. ఆర్ఎస్‌పీ ఎంపీ ప్రేమ్‌చంద్రన్ మాట్లాడుతూ, జీఎస్టీ నష్టపరిహారాన్ని అందజేయటంలో రాష్ట్రాలకు కేంద్రం అన్యాయం చేస్తోందన్నారు. కేరళ ప్రతిఏటా దాదాపు రూ.5వేల కోట్లు నష్టపోతోందన్నారు. నష్టపరిహారం చెల్లింపులో కేంద్రం అనుసరిస్తున్న విధానం ఒక్కో రాష్ట్రానికి ఒక్కో విధంగా ఉందని, దీనివల్ల ఆయా రాష్ట్రాల్లో రెవెన్యూ లోటు పెరిగిందని విమర్శించారు.

ఐజీఎస్టీ చెల్లింపుల్లో కేరళకు అన్యాయం జరుగుతోందని ప్రేమ్‌చంద్రన్ ఆరోపించారు. దీనిపై స్పందించిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, 2017-18 నుంచి ఇప్పటివరకూ రూ.41,779 కోట్లు ఐజీఎస్టీ కింద కేరళకు అందాయని, కేవలం రూ.750 కోట్లు మాత్రమే రావాల్సి ఉందని, కేరళ అకౌంట్స్ జనరల్ నుంచి ఆర్థిక నివేదికలు రానందున ఈ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. అకౌంట్స్ జనరల్ ఆడిట్ నివేదికలు 2021లోనే కేంద్రానికి కేరళ పంపిందని, ఈ నివేదికల్ని పరిశీలించకుండానే జీఎస్టీ నష్టపరిహారంపై కేంద్రం ఎలా ఒక అంచనాకు వస్తోందని తాజాగా ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ప్రశ్నించింది. జీఎస్టీ నష్టపరిహారం చెల్లింపు గడువు, నిధుల మొత్తం పెంచాలని కేరళ, తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీసగఢ్, పశ్చిమ బెంగాల్, బీజేపీ పాలిత రాష్ట్రాలు కోరుతున్నాయి.

హాస్టల్ ఖాళీ చేయాలంటూ ప్రిన్సిపాల్ ఆదేశాలు

- ఎక్కడికెళ్లాలో తోచని స్థితిలో విద్యార్థినులు
- ప్రభుత్వ దంత వైద్యకళాశాలలో దుస్థితి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీడీఎస్ పూర్తి చేసి ఇంటర్న్‌షిప్ కోసం ఎదురు చూస్తున్న ప్రభుత్వ దంత కళాశాల విద్యార్థినులు వసతి సమస్యను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వారుంటున్న హాస్టల్‌ను ఖాళీ చేసి వెళ్లాలని ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ ఆదేశాలు జారీ చేయడంతో ఉన్నఫళంగా ఎక్కడికెళ్లాలో దిక్కుతోచని స్థితిలో వారు బిక్కుబిక్కుమంటున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇంటర్న్ షిప్ కోసమున్న విద్యార్థినీలకు వసతి లేదని చెప్పడం, ఉన్న వసతిలోనే సర్దుకుంటూ ఉంటామని విద్యార్థులంతా చెబుతున్నా ...కుదరదని తేల్చి చెబుతుండటంతో గత 15 రోజులుగా హైదరాబాద్ లోని డెంటల్ కళాశాల విద్యార్థినీలు ఆందోళనకు గురవుతున్నారు. 2018లో బీడీఎస్ లో చేరిన 77 మందిలో 42 మంది విద్యార్థినీలున్నారు. ఆయా విద్యార్థినులకు ఉస్మానియా ఆస్పత్రి ఆవరణలోనే వసతిని కల్పించారు. ఈ హాస్టల్ లోనే బీడీఎస్ మొదటి, రెండో, మూడో సంవత్సరం చదివే విద్యార్థులతో పాటు ఇంటర్న్ షిప్ కోసం ఎదురు చూస్తున్న వారు, నెల రోజుల్లో ఇంటర్న్ షిప్ అయిపోయి వెళ్లిపోయే విద్యార్థినీలు కూడా ఉన్నారు. గతేడాది కూడా ఇలాంటి వసతి సమస్యే తలెత్తితే అప్పటికే విద్యార్థినీలు చెల్లిస్తున్న రూ.800 హాస్టల్ ఫీజును రూ.1,200కు పెంచి సర్దుబాటు చేశారు. మరో వైపు ప్రస్తుతం ఇంటర్న్ షిప్ పూర్తి కావస్తున్న విద్యార్థినీలు 40 మంది వరకు నెల రోజుల్లో హాస్టల్ ఖాళీ చేసి వెళ్లనున్నారు. తాజాగా ఇంటర్న్ షిప్ కోసం ఎదురు చూస్తున్న వారు కనీసం హాస్టల్ ఫీజు పెంచైనా సరే.... తమను అక్కడే కొనసాగనివ్వాలని ప్రిన్సిపాల్ ను వేడుకున్నారు. అయినప్పటికీ కచ్చితంగా ఖాళీ చేయాల్సిందే అన్నట్టు ఆదేశిస్తుండటంతో ఏడాది పాటు బయట హాస్టళ్లో ఉండటమనేది ఖర్చుల రీత్యా, రవాణాపరంగా తమకు ఇబ్బందిగా ఉంటుందని విద్యార్థినీలు వాపోతున్నారు. పైపెచ్చు బయటి హాస్టళ్లలో తమకున్న పుస్తకాలు పెట్టుకునేందుకు సరిపడా వసతి కూడా ఉండదని చెబుతున్నారు. దీనికి తోడు పేద కుటుంబాల నుంచి వచ్చిన చాలా మంది విద్యార్థినీలకు బయట హాస్టళ్లో ఉండటం మరింత కష్టమని చెబుతున్నారు. సంబంధిత అధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

కొనసాగించాలి...

2018 బ్యాచ్ విద్యార్థినీలను యధావిధిగా హాస్టల్లో ఉండేందుకు అనుమతించాలని ఆల్ డెంటల్ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మహ్మద్ మంజూర్ డిమాండ్ చేశారు. బయట ఉంటే భద్రతా పరంగా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయని విద్యార్థినీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఇంటర్నీలు ఖాళీ చేసేంత వరకు మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం డార్మిటరీని ఉపయోగించు కుంటూ, మూడో సంవత్సరం పూర్తయిన వారికి యధావిధిగా హాస్టల్లో కొనసాగించాలని కోరారు.

మెట్రోకు 'నుమాయిష్' జోష్

- 46 రోజుల్లో 1.9కోట్ల మంది జర్నీ
- నాంపల్లి స్టేషన్‌కు 11లక్షల మంది రాకపోకలు
- ప్రయాణికులతోపాటు సందర్శకులకు మెట్రో అదనపు సౌకర్యాలు
- మంత్రి చేతుల మీదుగా ప్రత్యేక జ్ఞాపిక అందుకున్న హెచ్ఎంఆర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్(నుమాయిష్) హైదరాబాద్ మెట్రో రైల్‌కు జోష్ నింపింది. నగరంలో 46 రోజులపాటు జరిగిన నుమాయిష్‌కు ప్రజలు పోటెత్తిన ఫలితంగా మెట్రోకూ ప్రయాణికుల తాకిడి పెరిగింది. మెట్రోకు చెందిన రెండు కారిడార్లు.. మియాపూర్-ఎల్‌బీనగర్, రాయ్‌దుర్గ్-నాగోల్ రూట్‌లో జనవరి 1వ తేదీ నుంచి ఈ నెల 15వ తేదీ వరకు సుమారు 1.9 కోట్ల మంది ప్రయాణించారు. ఇందులో ఒక్క నాంపల్లి స్టేషన్‌కే దాదాపు 11 లక్షల మంది రాకపోకలు సాగించినట్టు మెట్రో వర్గాలు వెల్లడించాయి. అంతేగాక నాంపల్లి ఎగ్జిబిషన్‌కు వచ్చే సందర్శకులతో పాటు ప్రయాణికులకు మెట్రో అదనపు సౌకర్యాలు కల్పించింది. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జనవరి ఒకటో తేదీన 82వ నుమాయిష్ ఎగ్జిబిషన్ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ఘనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. విభిన్న సంస్కృతులు, ఆహార అలవాట్లు, వివిధ రాష్ట్రాల ఉత్పత్తులకు వేదికగా నుమాయిష్ నిలిచింది.

ఈ నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో సంస్థ ట్రైన్‌ల సర్వీసుల్లో మార్పులు చేసింది. నుమాయిష్ జరిగినన్ని రోజులు మెట్రో రైలు సేవలను రాత్రి సమయంలో గంట పొడిగించింది. అంటే అర్ధరాత్రి 12గంటల వరకు మెట్రో రైళ్లను నడిపారు. సాధారణ రోజుల్లో టర్మినల్ స్టేషన్‌లు అయిన ఎల్బీనగర్, మియాపూర్, నాగోల్, రాయదుర్గం నుంచి రాత్రి 11గంటలకే చివరి మెట్రో రైలు అందుబాటులో ఉంటుంది. నుమాయిష్ నేపథ్యంలో చివరి సర్వీసు అర్ధరాత్రి 12గంటలకు బయలుదేరుతుందని మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. అంతేగాక, ఈ పొడిగింపు మియాపూర్-ఎల్బీనగర్(రెడ్ లైన్), నాగోల్ నుంచి రాయదుర్గం(బ్లూ లైన్) కారిడార్‌కు మాత్రమే అధికారులు పరిమితం చేశారు. ఎగ్జిబిషన్‌కు వచ్చే ప్రయాణికుల రద్దీ కారణంగా ఎంపిక చేసిన మెట్రో స్టేషన్లలో అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయడంతోపాటు ఎగ్జిబిషన్ నడిచినంత కాలం గాంధీభవన్ మెట్రో స్టేషన్‌లో ఉండే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని 4 టిక్కెట్ కౌంటర్ల స్థానంలో 6కు పెంచారు. సందర్శకుల కోసం అదనపు సౌకర్యాలు కల్పించారు. మొత్తానికి ఎగ్జిబిషన్ సాగిన ఈ 46 రోజుల్లో దాదాపు 1.9కోట్ల మంది ప్రయాణికులను మెట్రో రైల్‌లో వారివారి గమ్యస్థానాలకు చేర్చి రికార్డు సృష్టించింది.

హెచ్ఎంఆర్‌కు నుమాయిష్ సత్కారం

గ్రేటర్‌వాసులు నాంపల్లి ఎగ్జిబిషన్‌కు సులువుగా చేరుకునేందుకు మెట్రో రైలు అధికారులు కృషి చేశారు. ఎగ్జిబిషన్‌కు వచ్చే సందర్శకులకు అదనపు సౌకర్యాలు కల్పించిన హెచ్ఎంఆర్‌ను ఏఐఐఈ(నుమాయిష్) సొసైటీ-2023 ఘనంగా సత్కారించింది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి మొహమ్మద్ మహమూద్ అలీ చేతులమీదుగా ప్రత్యేక జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని హెచ్ఎంఆర్ తరపున కియోలిస్ హైదరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్-స్టేషన్స్ జైపాల్ రెడ్డి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగర కమిషనర్ సీవీ ఆనంద్, ఏఐఐఈ-నుమాయిష్ చెందిన కీలక ప్రతినిధులు పాల్గొన్నారు.

కేసీఆర్ మనవడు హిమాన్షు పాట సామాజిక మాధ్యమాల్లో వైరల్

- 'ఆ పాట నాకేంతో నచ్చింది.. మీకూ నచ్చుతుంది..'అంటూ కేటీఆర్ ట్వీట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు మనవడు, మంత్రి కేటీఆర్ కొడుకు హిమాన్షు ఇంగ్లీషులో పాడిన పాట సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది. హిమాన్షు తొలిసారి ఒక పాటను పాడి, దాన్ని యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమ వేదికల ద్వారా పంచుకున్నారు. ప్రసిద్ధ ఇంగ్లీష్ గీతం గోల్డెన్ అవర్ పాటకు కవర్ సాంగ్ రూపంలో తనలో ఉన్న ఈ కొత్త టాలెంట్‌ని హిమాన్షు బయటపెట్టారు. ఆ పాటను మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా ప్రజలతో పంచుకున్నారు. తన కుమారుడు పాడిన పాట తనకెంతో బాగా నచ్చిందనీ, మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నానంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. హిమాన్షు భావోద్వేగపూరితంగా తాతయ్యతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు.

తన అత్యంత ప్రియమిత్రుడు, నా స్ఫూర్తి ప్రధాత మా తాతయ్య కేసీఆర్ 69 ఏండ్ల క్రితం ఈ రోజు జన్మించారంటూ ప్రారంభించి, సామాజిక, నైతిక విలువలను నేర్పించిన తాతకు ధన్యవాదాలు అంటూ పాటను ముగించారు. ఎవరిని వివక్షతతో చూడకుండా, అందర్నీ సమానంగా చూడగలిగేలా తనను తాతయ్య తయారు చేశారనీ, ముఖ్యంగా సమాజం పట్ల తనలో సేవా దృక్పథాన్ని నింపిన ఆయనకి ధన్యవాదాలని హిమాన్షు తెలిపారు. ఎంతో బిజీగా ఉన్నా, తమ కుటుంబానికి ముఖ్యంగా, తనకోసం తాతయ్య అత్యధిక సమయం కేటాయిస్తారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేల ఎర కేసులో ..

హైకోర్టు తీర్పుపై స్టేకి సుప్రీం నిరాకరణ



న్యూఢిల్లీ : ఎమ్మెల్యేల ఎర వ్యవహారంపై హైకోర్టు ఇచ్చిన తీర్పు మీద సుప్రీం కోర్టు స్టేకు నిరాకరించింది. ఈ కేసుపై దాఖలైన పిటిషన్లను శుక్రవారం ధర్మాసనం విచారణ జరిపింది. కనీసం విచారణ పూర్తయ్యేంత వరకూ ఎవరినీ అరెస్ట్ చేయవద్దని సీబీఐకు ఆదేశాలు ఇవ్వాలన్న తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనపై కూడా సుప్రీం కోర్టు స్పందించ లేదు. సీబీఐను తాము కంట్రోల్ చేయలేమని జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పేర్కొంటూ తదుపరి విచారణ ఈనెల 27కి వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే, బీజేపీ తరపున సీనియర్ న్యాయవాది జెఠ్మలానీ వాదనలు వినిపించారు. ఈ కేసులో నిందితులపై నమోదైన కేసులు తీవ్రమైనవనీ, ఈ వ్యవహారం ప్రజాస్వామ్యానికి నష్టం కలిగించేదిగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది దవే కోర్టుకు తెలిపారు. కేసు వివరాలను సీఎం కేసీఆర్ మీడియాకు తెలిపారనీ, ఆయనే స్వయంగా లీక్ చేశారని బీజేపీ తరపున సీనియర్ న్యాయవాది జెఠ్మలానీ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. కేసుకు సంబంధించిన ఇంకా చాలా విషయాలు తమ వద్ద ఉన్నాయనీ, సీబీఐ, ఈడీ కూడా రోజు లీకులు ఇస్తున్నాయన్నాయని దవే అన్నారు. కేంద్రంలోని అధికార పార్టీకి వ్యతిరేకంగా ఆధారాలున్నాయని తెలిపారు. కేసును సీబీఐకి ఇవ్వాల్సిన అవసరం ఏముందని, కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో ఉన్న సీబీఐ బీజేపీపై ఎలా విచారణ చేస్తుందని దవే ప్రశ్నించారు. ఈ కేసుకు సంబంధించి తనకు ఎక్కువ సమయం కావాలని దవే కోరును కోరారు. అనంతరం ధర్మాసనం స్పందిస్తూ ఈనెల 27న దీనిపై విచారణ చేపట్టనున్నట్టు తెలిపింది. ఆ రోజు కోర్టు జాబితాలో ఉన్న అన్ని కేసులు ముగిసిన తరువాతే దీనిపై విచారణ చేపడతామని స్పష్టం చేసింది. ఎమ్మెల్యేలకు ఎర వ్యవహారంపై దర్యాప్తును తెలంగాణ హైకోర్టు సీబీఐకి అప్పగించింది. ఈ తీర్పును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఎమ్మెల్యేల కేసు సీబీఐ చేతికి వెళ్తే ఉపయోగం ఉండదని, ఇప్పటి వరకు జరిగిన విచారణ అంతా... పక్కదారి పడుతుందని ఈనెల 7, 8ల్లో జరిగిన విచారణలో రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాదులు దుష్యంత్ దవే, సిద్ధార్థ లుత్రాలు ప్రత్యేకంగా వాదనలు వినిపించారు. వెంటనే హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. అయితే స్టే ఇచ్చేందుకు సీజేఐ ధర్మాసనం నిరాకరించింది.

కేంద్ర, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తెరపైకి మరో వివాదం

సీబీఐ అధికారులు పత్రాలు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారనీ, స్టేటస్ కో ఇవ్వాలని న్యాయవాదులు సీజేఐకు విజ్ఞప్తి చేశారు. ఒకసారి సీబీఐ చేతికి వెళితే... కేసు వెనక్కి రావడం కష్టం అవుతుందన్నారు. వాదనలు విన్న అనంతరం స్టేటస్ కో ఇవ్వడానికి కూడా ధర్మాసనం నిరాకరించింది. కేసులో మెరిట్స్ ఉంటే రివర్స్ చేస్తూ ఆదేశాలు ఇస్తామని ధర్మాసనం పేర్కొంటూ... తదుపరి విచారణ శుక్రవారం (17 తేదీ) నాటికి వాయిదా వేసింది.

బీజేపీని నిలువరించడమే మా లైన్

ఎన్నికల పొత్తులపై బీఆర్ఎస్‌తో చర్చించలేదు

- రాబోయే ఎన్నికల్లో సీపీఎంతో కలిసి పోటీ : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎవరు అధికారంలోకి రావాలో, ఎవరు రాకూడదో నిర్ణయించే శక్తి సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీలకుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. బీజేపీని నిలువరించడమే మా లైన్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ మగ్దూంభవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో కూనంనేని వివరాలను వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో సీపీఐ(ఎం)తో కలిసే పోటీ చేస్తామన్నారు. ఖమ్మంలో సీపీఐ రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తామనీ, ప్రజా సమస్యలపై ఉమ్మడిగా పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇరు పార్టీలు ఐక్యంగా బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహిస్తాయని తెలిపారు. ఎన్ని ఇబ్బందులొచ్చినా సరే.... ఈ సారి ఎన్నికల్లో కలిసే ఉండాలని రెండు పార్టీలు నిర్ణయించాయని తెలిపారు. తమ ప్రయోజనాలు దెబ్బతినకుండా ఇతరులతో కలుస్తామని తెలిపారు.

అనామకుల కామెంట్లకు స్పందించం....

ఎవరో అనామకులు, రోజుకో పార్టీ, రంగు మార్చే వారు కమ్యూనిస్టులకు రెండు, మూడు సీట్లు బీఆర్ఎస్ ఇస్తుందనీ, అసలు ఎమ్మెల్యే సీట్లే ఇవ్వడం లేదంటూ చేసే ప్రచారానికి తాము స్పందించబోమని తెలిపారు. కమ్యూనిస్టుల విశిష్టతను దెబ్బతీసే ఊహాగానాల వార్తలు సరిగాదన్నారు. ఏదైనా చేస్తే తామే మీడియాకు చెబుతామన్నారు. పోడు భూముల విషయంలో నాలుగు జెండాలేసుకుని వస్తారంటూ సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ఆ నాలుగు జెండాలే పోడు భూముల సమస్యను పరిష్కరించే అనివార్యతను తీసుకొచ్చాయని గుర్తుచేశారు. కమ్యూనిస్టు పార్టీ ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా ఉందని తెలిపారు. సింగరేణి ప్రాంతంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పూర్తిగా, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల్లో సగం, హైదరాబాద్, రంగారెడ్డి తదితర జిల్లాల్లోనూ పార్టీ ప్రభావం ఉందని స్పష్టం చేశారు. 119 నియోజకవర్గాల్లో పార్టీ కమిటీలను వేయనున్నట్టు ప్రకటించారు. తమ అవసరం ఉందనుకుంటే బీఆర్ఎస్ కలిసి వస్తుందనీ, లేదంటే ఎవరి దారి వారిదేనని స్పష్టం చేశారు. పార్టీని ఎలా నడిపించాలో, ఎలా ముందుకు తీసుకెళ్లాలో తమకు తెలుసన్నారు.

అదానీ కుంభకోణంతో దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం జరుగుతున్నా ప్రధాని మోడీ కనీసం విచారణకు ఆదేశించలేదని విమర్శించారు. పోడు భూముల విషయంలో సీఎం కేసీఆర్ ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. అయితే అటవీ చట్ట ప్రకారం ఆ ప్రాంతంలో 75 ఏండ్లు పైగా నివాసమున్న గిరిజనేతరులకు కూడా పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలను పెంచే ఆలోచన మానుకోవాలనీ, అనివార్యమైతే అలాంటి నిర్ణయం తీసుకునే ముందు సామాన్యులకు భారం కాకుండా వినియోగదారులతో చర్చించాకే నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

రబీ పంటల ప్రాంతాల్లో 24 గంటలు విద్యుత్ రాక ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. ఆర్టీసీలో యూనియన్లకు అనుమతించాలని డిమాండ్ చేశారు. పోలీసు నియామకాల్లో దేహధారుడ్య పరీక్షల నిబంధనలను సడలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, పశ్యపద్మ, కలవేన శంకర్, తక్కెలపల్లి శ్రీనివాస్, ఎన్.బాలమల్లేష్, బాగం హేమంతరావు, ఎం.బాలనర్సింహ, ఈటి.నరసింహ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో

పారిశుధ్య కార్మికులను నియమించండి

సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో పారిశుధ్యం, ఇతర పనుల కోసం సర్వీసు పర్సన్లను నియమించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ శుక్రవారం ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ మండల పరిషత్, జిల్లా పరిషత్, గిరిజన సంక్షేమ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పారిశుధ్యం, ఇతర సర్వీసు పనులను గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు నిర్వహించాలంటూ 2020, సెప్టెంబర్‌లో ఆదేశించారని గుర్తు చేశారు. ఈ నిర్ణయం చేసినప్పుడే ప్రభుత్వ విద్యాసంస్థల్లో పారిశుధ్యం, ఇతర సర్వీసు పనులు అవి చేయలేవని చెప్పామని తెలిపారు. కానీ నేటి వరకు అదే విధానం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. మరుగుదొడ్లను రోజుకు మూడుసార్లు శుభ్రం చేయాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత, కారిడార్, గదులను ఊడ్చాలని వివరించారు. ఉదయం తాళాలు తీయాలనీ, సాయంత్రం వేయాలని పేర్కొన్నారు. కుర్చీలు, బల్లలు, బెంచీలపై దుమ్ము దులపాలని సూచించారు. పీరియెడ్ వారీగా బెల్ కొట్టాలని తెలిపారు. తరగతి గదుల్లోని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు నోటీసులు అందించాలని పేర్కొన్నారు. ఈ పనులు చేసేందుకు పాఠశాల/కళాశాల ప్రారంభం నుంచి ముగించే వరకు వ్యక్తి ఉండాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నచోట ఒకరికంటే ఎక్కువ మందిని నియమించాలని కోరారు. అయితే పూర్తిస్థాయిలో అలాంటి వ్యక్తులను నియమించేందుకు ఆర్థిక స్తోమత లేదంటూ గ్రామపంచాయతీలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు చెప్తున్నాయని వివరించారు. మన ఊరు-మనబడి పథకంలో బడులను బాగు చేస్తున్నారని తెలిపారు. నీటి సరఫరాతో కూడిన మరుగుదొడ్లను నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. కానీ పారిశుధ్యం కోసం వ్యక్తిని ప్రత్యేకంగా ఇవ్వకుండా స్థానిక సంస్థలకు వదిలేస్తే మళ్లీ ఎప్పటిలాగే ఉంటుందని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారని వివరించారు. ఈ అంశాలు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలుసనీ, సమస్య పరిష్కారం కోసం సీఎం కేసీఆర్ వైపు చూస్తున్నారని తెలిపారు. 2020కి ముందు విద్యాశాఖ ద్వారానే పారిశుధ్య కార్మికులను నియమించే విధానం ఉందని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే పద్ధతిలో వారిని నియమించాలని కోరారు. ఇలాంటి నియామకాలు స్థానిక సంస్థల ద్వారా చేసినా అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. పది శాతం గ్రామపంచాయతీలు మాత్రం వాటి నిధుల నుంచి ప్రత్యేక ఒక వ్యక్తిని పాఠశాలలకు నియమించారని తెలిపారు. మిగిలిన స్థానిక సంస్థలు మాత్రం ప్రత్యేకంగా నియమించేందుకు నిధుల్లేవంటూ ప్రకటిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యను సత్వరమే పరిష్కరించాలని కోరారు.

ఆర్ఎస్ఎస్ ర్యాలీ అనుమతి కేసు 20కి వాయిదా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భైంసాలో ఆర్ఎస్ఎస్ ఈ నెల 19న వెయ్యి మందితో రూట్‌మార్చ్ నిర్వహించేందుకు అనుమతివ్వాలనే పిటిషన్‌పై హైకోర్టులో విచారణ 20కి వాయిదా పడింది. ఆర్ఎస్ఎస్ భైంసా ప్రతినిధి ఎస్.కృష్ణదాస్ దాఖలు చేసిన లంచ్‌మోషన్ పిటిషన్ జస్టిస్ విజయ్ సేన్‌రెడ్డి శుక్రవారం విచారిం చారు. ఇది దేశ వ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమమనీ, పోలీసులు అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలంటూపిటిషనర్ న్యాయవాది కోరారు. దీనిపై ప్రభుత్వ ప్లీడర్ రవీందర్ వాదనలు వినిపిస్తూ.. పోలీసులు ఇప్పటివరకు అనుమతి నిరాకరిస్తూ ఎలాంటి లిఖిత పూర్వక ఆదేశాలు ఇవ్వలేదని చెప్పారు. సున్నిత ప్రాంతం కావడంతో గతంలో బీజేపీ సభకు కూడా భైంసాలో అనుమతి చ్చేందుకు ఇదే కోర్టు నిరాకరించదని గుర్తు చేశారు. పట్టణానికి 3 కిలో మీటర్ల. దూరంలో రూట్‌మార్చ్‌ను జరుపుకోవాలని ఆదేశిందన్నారు. 19న ముస్లింలు షబ్ ఇ బరాత్ ర్యాలీ నిర్వహిస్తారనీ, ఆర్ఎస్ఎస్‌కు కూడా ర్యాలీ నిర్వహిస్తే ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంటుందని తెలిపారు. అయితే తాము 20న(సోమవారం) లేదా మరో తేదీన నిర్వహించుకునేందుకు అనుమతివ్వాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరారు. దీంతో న్యాయ మూర్తి.. దరఖాస్తును పరిశీలించి, అనుమతి ఇవ్వాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూడాల్సిన బాధ్యత పిటిషనర్‌దేనని స్పష్టం చేశారు. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేశారు.

ఎంపీ అరవింద్‌కు వెసులుబాటు

సీఎం కేసీఆర్‌ను సోషల్ మీడియా వేదికగా కించపరిచారనే పోలీసుల కేసుల దర్యాప్తును నిలిపి వేయాలని కోరుతూ నిజామాబాద్ ఎంపీ అరవింద్ దాఖలు చేసిన కేసులో హైకోర్టు స్టే విధించింది. ఎంపీపై తదుపరి చర్యలు తీసుకోరాదని పేర్కొంటూ ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ శుక్రవారం ఆదేశించారు. విచారణను ఏప్రిల్ 21కి హైకోర్టు వాయిదా వేశారు. కేసీఆర్‌ను కించపరిచేలా కార్టూన్‌ను పోస్ట్ చేశారంటూ అరవింద్ పై 2022 జనవరిలో వనస్థలిపురం, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. బంజారాహిల్స్‌లో నమోదైన కేసులో ట్రయల్ కోర్టు విచారణ చేపట్టింది. దీనిపై స్టే విధించాలన్న అరవింద్ వినతిని హైకోర్టు ఆమోదించింది.

సీబీఐ కేసు కొట్టేయండి మంత్రి సబిత విజ్ఞప్తి

ఓబుళాపురం మైనింగ్ అక్రమాలకు సంబంధించి సీబీఐ తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి దాఖలు చేసిన క్యాష్ పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం విచారించింది. గనుల మంత్రిగా ఉన్న పాపానికి తనను కేసులో ఇరికించారనీ, తనపై సీబీఐ నమోదు చేసిన చార్జిషీట్‌ను రద్దు చేయాలని ఆమె కోర్టును కోరారు. దీనిపై విచారణను వచ్చే శుక్రవారం కొనసాగిస్తామని ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ ప్రకటించారు.

చెరువు విస్తరణ పనులపై స్టే

నిర్మల్‌లోని నాయబ్ ట్యాంక్ ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్) పరిధిలో తాము తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకు ఎలాంటి రోడ్డును వేయొద్దంటూ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను మార్చి 17కు వాయిదా వేస్తూ ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీలతో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో రోడ్డు నిర్మాణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని సీనియర్ న్యాయవాది సూర్యకరణ్‌రెడ్డి కోరారు. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ, ఆ రోడ్డు 40 ఏండ్లుగా ఉందనీ, ఇప్పుడు విస్తరణ పనుల కోసమే నోటిఫికేషన్ వెలువడిందని తెలిపింది. దీనిపై హైకోర్టు, తాము తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎలాంటి ప్రక్రియ చేపట్ట వద్దంటూ ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.

హైకోర్టును ఆశ్రయించండి

- గిరిజన రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ : గిరిజన రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవోపై రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సుప్రీంకోర్టు సూచించింది. గిరిజన రిజర్వేషన్ల పెంపు జీవో వల్ల ఆదివాసీలకు నష్టం కలుగుతుందంటూ కోడెపాక రోహిత్, ఆధార్ సొసైటీలు దాఖలు చేసిన పిటిషన్లను శుక్రవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు రంజిత్ కుమార్, ఎంఎస్‌రావు, న్యాయవాది అల్లంకి రమేశ్‌లు వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. జీవో కొట్టివేయాలని కోరారు. ఈ అంశంపై తెలంగాణ హైకోర్టునే ఆశ్రయించాలని ధర్మాసనం సూచించింది. ధర్మాసనం సూచన మేరకు పిటిషనర్లు పిటిషన్లు ఉపసంహరించుకున్నారు.

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పై ఎన్జీటి జరిమానాకు సుప్రీం బ్రేక్

న్యూఢిల్లీ : పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ పై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటి) విధించిన 500 కోట్ల జరిమానాపై సుప్రీం కోర్టు స్టే విధించింది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో పర్యావరణ అనుమతులు ఉన్న 7.15 టీఎంసీల వరకు పని కొనసాగించుకునేందుకు మాత్రమే సుప్రీంకోర్టు అనుమతించింది. కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించుకు కోవాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. తాగునీటి ఎద్దడిని ఎదుర్కోవద్దనీ, ప్రజలు ఇబ్బందులకు గురికాకూడదన్న ఉద్దేశంతోనే ఈ అవకాశం కల్పిస్తున్నట్టు స్పష్టం చేసిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌ల ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో మెరిట్స్ ఆధారంగానే తగిన నిర్ణయాలు ఉంటాయని ధర్మాసనం తెలిపింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించారని ఎన్జిటీ విధించిన రూ. 500 కోట్ల జరిమానాపై సుప్రీంకోర్టు ధర్మాసనం స్టే విధించింది. ఎన్జీటి జరిమానా విధిస్తూ.. ఇచ్చిన తీర్పును తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. ప్రతివాదులందరికి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో ప్రతివాదులు అంతా... కౌంటర్ అఫిడవిట్‌లు దాఖలు చేయాలని, ఆ తరువాత ఆరు వారాల్లో వాటికి సమాధానంగా రిజాయిండర్‌లు దాఖలు చేయాలని పిటిషనర్‌ను కూడా ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ ఆగష్టులో చేపట్టనున్నట్టు తెలిపింది.

బహ్రెయిన్‌లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఎన్నారై బీఆర్ఎస్ బహ్రెయిన్ శాఖ అధ్యక్షులు రాధారపు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం బహ్రెయిన్‌లో ఘనంగా నిర్వహించారు. సతీష్ కుమార్ కేక్ కట్ చేసి కేసీఆర్ కుజన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నారై బీఆర్ఎస్ బహ్రెయిన్ శాఖ అధ్యక్షులు రాధారపు సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు బొలిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని పోరాడి సాధించమే కాక రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఎనిమిదిన్నరేండ్లుగా నిరుపేదల సంక్షేమం కోసం ఆయన అమలు చేస్తున్న ఎన్నో సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. దేశంలో గుణాత్మక మార్పుకోసం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ జెండాను సైతం బహ్రెయిన్‌లో కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఆవిష్కరించడం గర్వంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి నిండు నూరేండ్లు ఆరోగ్యాంగా , సంతోషంగా ఉండి భారత దేశాన్ని అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై బీఆర్ఎస్ సెల్ ప్రధాన కార్యదర్శి పుప్పాల బద్రి, మగ్గిడి రాజేందర్, అన్నారం సుమన్ ,కార్యదర్శులు చెన్నమనేని రాజేందర్ ,సంగేపోలు దేవన్న , ఉత్యం కిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

కేసీఆర్ జన్మదిన వేడుకలు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. పీవీ మార్గ్‌లోని థ్రిల్ టీలో భారీఎత్తున నిర్వహించిన వేడుకల్లో సీఎం కేసీఆర్ 69వ పుట్టిన రోజు కేక్‌ను కట్ చేశారు. 10 వేల మందికి అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎంపీ కె.కేశవరావు, మంత్రి గంగుల కమలాకర్,ఎమ్మెల్సీ వాణీదేవి, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, దానం నాగేందర్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్, పలువురు చైర్మన్లు, తదితర నేతలు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మార్చి 25లోగా పనులు అయిపోవాలి

- సీసీరోడ్లు, డ్రైనేజీలు, జీపీ భవనాల సమీక్షలో సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపాధి హామీ చట్టంలో భాగంగా చేపట్టిన సీసీరోడ్లు, డ్రెయినేజీలు, గ్రామపంచాయతీ భవనాల పనులకు ప్రాధాన్యతనిచ్చి మార్చి 25లోగా పూర్తిచేయాలని అధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, డీఆర్డీఓలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ చట్టం కింద మంజూరైన పనులు, గ్రౌండింగ్ పనుల ప్రగతిపై సమీక్షించారు. మార్చి 25 లోగా పనులు పూర్తిచేసి ఎఫ్‌టిపిలో నమోదుచేస్తేనే కేంద్రం నుంచి నిధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పనుల ప్రాధాన్యతను గుర్తించి ఆయా జిల్లాలలో అందుబాటులో ఉన్న మెటీరియల్ కాంపోనెంట్ కింద ఉన్న నిధుల ఆధారంగా పనులు ప్రాధాన్యత ప్రకారం చేపట్టాలని సూచించారు. కూలీలను పెద్దఎత్తున వినియోగించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల మంజూరు, పనుల తీరుతన్నులపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు తరచూ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షలు జరపాలని సూచించారు. చేపట్టిన పనులన్నీ నాణ్యతతో కూడి ఉండాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ హనుమంతరావు, స్పెషల్ కమిషనర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల్లో అపశృతి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ-అంబర్ పేట

సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. బాణాసంచా నిప్పు రవ్వలు గ్యాస్ బెలూన్లపై పడటంతో ఇద్దరు బీఆర్ఎస్ కార్యకర్తలకు గాయాలయ్యాయి. వివరాల్లోకెళ్తే.. హైదరాబాద్ కాచిగూడలో జరిగిన సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల్లో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పాల్గొన్నారు. టపాసులు పేలుస్తుండగా నిప్పురవ్వలు ఎగిరి గ్యాస్ బెలూన్లపై పడటంతో అవి పేలాయి. దాంతో భయంతో అందరూ పరిగెత్తుతుండగా ఎమ్మెల్యే కొందరు కార్యకర్తలు కిందపడ్డారు. కార్యకర్తలు వారిని పైకి లేపారు. ఈ ఘటనలో ఇద్దరు కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి.

ఉద్ధవ్ ఠాక్రేకు షాక్

- ఏక్‌నాథ్ షిండే వర్గానికి శివసేన పార్టీ పేరు..గుర్తు
- ఈసీ సంచలన నిర్ణయం

న్యూఢిల్లీ : ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి కేంద్ర ఎన్నికల సంఘం ఊహించని షాక్ ఇచ్చింది. శివసేన పార్టీ పేరు, పార్టీ గుర్తును..ఏక్‌నాథ్ షిండే వర్గానికి కేటాయించింది. శివసేన పార్టీ గుర్తు విల్లు, బాణంను షిండేకు కేటాయిస్తూ ఈసీ శుక్రవారం సంచలన నిర్ణయం తీసుకుంది. 2019లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన తరఫున గెలిచిన 55 మందిలో 40 మంది షిండే వెంటే ఉన్నారు. మొత్తం ఎమ్మెల్యేలకు కలిపి 47,82,440 ఓట్లు పోలవగా, షిండే వర్గానికి చెందిన 40 మంది ఎమ్మెల్యేలకు 36,57,327 ఓట్లు దక్కాయి. మొత్తం ఓట్లలో 76శాతం షిండే వర్గానికి దక్కగా, ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన 15 మంది ఎమ్మెల్యేలకు 12శాతం ఓట్లు మాత్రమే ఉన్నాయి. 2018లో శివసేన పార్టీ రాజ్యాంగంలో సవరణలను తమకు చూపించలేదని, అవి తమకు సమ్మతం కాదని ఎన్నికల సంఘం వ్యాఖ్యానించింది. ఎన్నికల సంఘం నిర్ణయాన్ని శివసేన తప్పుబట్టింది. వివాదం సుప్రీంకోర్టులో ఉండగానే బీజేపీ ఒత్తిడి కారణంగా షిండే వర్గానికి అనుకూలంగా నిర్ణయం తీసుకుందని ఎన్నికల సంఘాన్ని విమర్శించింది. అయితే ఈసీ నిర్ణయంపై శివసేన ఎంపీ సంజయ్ రౌత్ భిన్నంగా స్పందించారు. కొత్త పేరు, కొత్త సింబల్‌తో ప్రజా కోర్టుకు వెళ్తామన్నారు. ప్రస్తుతం మహారాష్ట్రలో శివసేన తిరుగుబాటు ఎమ్మెల్యేలతో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో శివసేనలో చీలిక తీసుకొచ్చి..మహారాష్ట్రలో అధికారాన్ని బీజేపీ హస్తగతం చేసుకుంది.